www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI




బుధవారం | 26-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 312 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి ఉ. 11.03 తదుపరి చతుర్దశి; నక్షత్రం: శ్రవణం సా 5.23 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: రా. 9.06-10.35; దుర్ముహూర్తం: మ. 12.04-12.51; అమృతఘడియలు: ఉ.7.28-8.59; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.39; సూర్యాస్తమయం: 6.17 | విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బూతులు, గొడవలకు వైసీపీ పర్యాయపదంగా మారింది. ఇన్నేళ్లూ ఇలాంటివారిని భరించిన చంద్రబాబుకు హ్యాట్సాఫ్! ప్రతిపక్ష హోదా కావాలంటే జగన్ జర్మనీకి వెళ్లాల్సిందే. మా ఎమ్మెల్యేలంతా కలిసి ఫ్లైట్ టికెట్లు ఇస్తాం. ఐదేళ్లు ఖజానాను లూటీ చేసేశారు. ఇప్పుడు ఏమైనా అడుగుదామంటే.. 'జల్సా' సినిమాలోని 'ఏముందీ ఆ చొక్కాలో! చొక్కా, దానికో బొక్క' డైలాగ్ గుర్తుకొస్తోంది!
- సభలో పవన్ సరదా వ్యాఖ్యలు

41 ఏళ్ల నా రాజకీయ జీవితంలో ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీ జరగనిస్తాం.. లేదంటే వెళ్లిపోతామనే రాజకీయ పార్టీని ఎన్నడూ చూడలేదు. ప్రజలు 11 సీట్లిచ్చారు. 11 గంటలకు వచ్చారు. 11 నిమిషాలున్నారు. 11:11 నిమిషాలకు వెళ్లిపోయారు. ఈ 11 నిమిషాల్లోనే స్పీకర్‌ను, గవర్నర్‌ను అవమానించారు. రాష్ట్రానికి అది చీకటి రోజు. - చంద్రబాబు

సమాజానికి బంగారు భవిష్యత్తును కాంక్షించేవారు వ్యక్తిగత, వృత్తిగత ఎదురుదెబ్బలను అధిగమించి సవాళ్లను స్వీకరిస్తారు. ప్రశంసలను, విమర్శల ముళ్లను సమానంగా స్వీకరించి లక్ష్యసాధన వైపు అడుగులేస్తారు. కోట్ల మంది ప్రజల జీవితాలను మెరుగుపర్చాలంటే నిర్మాణాత్మకంగా ఉండటంతోపాటు నిస్వార్థంగానూ ఉండటం అవసరం. అవే లక్ష్యశుద్ధినీ, లక్ష్యసిద్ధినీ ప్రసాదిస్తాయి.
- చంద్రబాబు



## ఎన్ని ఇబ్బందులొచ్చినా
# విడిపోం..!
## మా కోసం కాదు.. రాష్ట్రం కోసం కలిసే ఉంటాం

### మరో 15 ఏళ్లు మాదే అధికారం

అధికార పక్షం, ప్రతిపక్షం రెండూ మేమే

గవర్నర్ ప్రసంగిస్తుంటే గొడవ చేస్తారా?

వారు పేపర్లు విసిరినప్పుడు వివేకా హత్య గుర్తొచ్చింది

వైసీపీని భరించిన చంద్రబాబుకు హ్యాట్సాఫ్

గవర్నర్‌ను గౌరవించని పార్టీ సభలో అడుగు పెట్టకూడదు

వైసీపీపై పవన్ ధ్వజం

సభ సాక్షిగా మోదీకి థ్యాంక్స్

అమరావతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): 'సంకీర్ణ ప్రభుత్వాన్ని నడపడం ఒక సవాల్. రాష్ట్రంలో మా కూటమి ప్రభుత్వం ఏర్పడింది. చాలా మంది చాలా వ్యాఖ్యలు చేసినా ఎందుకు కలిసుంటామని చెబుతున్నామంటే.. ఇది నా గురించో, చంద్రబాబు, లోకేశ్ గురించో కాదు! మేం ప్రజల కోసం నిలబడి ఉన్నాం. కలిసి ఉండకపోతే ప్రజలకు ద్రోహం చేసినవాళ్లం అవుతాం. అందుకే మాటిస్తున్నాం. ఎన్ని ఇబ్బందులు వచ్చినా వాటిని అధిగమించి మరో 15 ఏళ్లు అధికారంలో ఉంటాం' అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలియజేసే తీర్మానంపై మంగళవారం అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'కింద పడతాం, మీద పడతాం. అవి మా ఇంటి విషయాలు. కూటమి విషయాలు. ఒక మాట అనొచ్చు. నాకేం అభ్యంతరం లేదు. కానీ గవర్నర్‌కు గౌరవం ఇవ్వని పార్టీ.. సభలో

మిగతా 13వ పేజీలో...

ఇబ్బందులుంటే మనం ఒక మాట అనుకుందాం. కానీ మన కమిట్‌మెంట్ ప్రజలేనన్నది గుర్తుంచుకోవాలి. కంఠంలో ప్రాణం ఉన్నంత వరకూ రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల కోసం కట్టుబడి ఉంటాం. దేశం కోసం ప్రాణమిస్తాం.
- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

### వీసీలను బెదిరించామా? నిరూపించండి!

ఆధారాలిస్తే విచారణకు ఆదేశిస్తా

బెదిరించడం మీకు అలవాటు

మండలిలో వైసీపీ ఆరోపణలకు మంత్రి నారా లోకేశ్ సమాధానం 13



## దగాపడ్డ రాష్ట్ర పునర్నిర్మాణం
## కూటమి ఏర్పాటు లక్ష్యమిదే: చంద్రబాబు

₹2.50 లక్షల ఉచిత ఆరోగ్య బీమా

రాష్ట్రంలోని ప్రజలందరికీ వర్తింపు

ప్రీమియం ప్రభుత్వమే కడుతుంది

ఎన్టీఆర్ వైద్యసేవ కింద 25 లక్షలు

గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల ఇళ్ల స్థలం

ప్రార్థనాలయాల జోలికొస్తే వెన్నెముక విరగ్గొడతాం

గవర్నర్ ప్రసంగానికి ముఖ్యమంత్రి ధన్యవాదాలు

2026 జూన్ 12 నాటికి 5 లక్షల ఇళ్ల నిర్మాణం

స్కూల్స్ తిరిగి ప్రారంభించేనాటికి మెగా డీఎస్సీ

మేలో తల్లికి వందనం.. ఈ ఏడాదే అన్నదాతా సుఖీభవ

ఒక్కో రైతుకు 3 విడతల్లో రూ.20 వేల సాయం

ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా 'సూర్యఘర్' పథకం

అమరావతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. "రాష్ట్రంలోని ప్రజలందరికీ రూ.2,50,000 ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తున్నాం. ఇందుకు అవసరమైన ప్రీమియం ప్రభుత్వమే బీమాసంస్థలకు చెల్లిస్తుంది. ఆ తర్వాత రూ.25 లక్షల వరకు అయ్యే వైద్యం ఖర్చులను ఎన్టీఆర్ వైద్యసేవ కింద అందజేస్తాం" అని ప్రకటించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ మంగళవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి మాట్లాడారు. దగాపడ్డ రాష్ట్రాన్ని పునర్నిర్మించడం కోసమే తెలుగుదేశం, జనసేన, బీజేపీ కలిశాయని చెప్పారు. "నేను నాలుగో సారి ముఖ్యమంత్రి అయ్యాను. ఇంతకుముందు మూడుసార్లలో ఎప్పుడూ ఇంతటి ఆర్థికపరమైన ఇబ్బందులు లేవు. రాష్ట్ర అభివృద్ధి కోసం సకాలంలో స్పందించి కేంద్రం అందిస్తున్న

మిగతా 12వ పేజీలో...

### ప్రభుత్వ టెండర్లలో స్టార్టప్‌లకు అవకాశం

రూ.50 లక్షల విలువైన టెండర్లలో పాల్గొనవచ్చు

అనుభవం, టర్నోవర్, ఈఎండీ అవసరం లేదు

స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం 12

ఐటీ వర్గాల హర్షం

### సభకు ఎందుకు వెళ్లానురా దేవుడా!

ఆత్మరక్షణలో పడిపోయిన వైఎస్ జగన్



### సర్వం శివమయం..
మహాశివరాత్రికి ముస్తాబైన శైవ క్షేత్రాలు



విద్యుద్దీపాల అలంకరణతో మెరిసిపోతున్న శ్రీశైల క్షేత్ర వీధుల్లో భక్త జన సందోహం 14

## రాష్ట్రానికి వెయ్యి కోట్లు



ఎస్ఏఎస్ కింద కేంద్రం నుంచి నిధులు

మార్చి మొదటి వారంలో ఖాతాకు జమ

రెవెన్యూ ఆధునీకరణకు రూ.397 కోట్లు

వ్యవసాయ రంగానికి రూ.605 కోట్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)
కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల(సీఎస్ఎస్)ను ఉపయోగించుకొని రాష్ట్రానికి నిధులు తీసుకొస్తామన్న సీఎం చంద్రబాబు ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం(ఎస్ఏఎస్) కింద ఏపీకి కేంద్రం రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసింది. మార్చి మొదటివారంలో ఈ నిధులు రెవెన్యూ, వ్యవసాయ పద్దుల కింద రాష్ట్ర ఖాతాలో జమవుతాయని అధికార వర్గాలు తెలిపాయి. ఈ మొత్తాన్ని మౌలిక వసతుల కల్పనకు వాడుకోవడానికి కేంద్రం అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. 2024-25 ఆర్థిక సంవత్సరం కోటాలో గ్రామీణ రెవెన్యూ రికార్డుల ఆధునీకరణ

మిగతా 11వ పేజీలో...



ఏనుగుల దాడిలో మృతిచెందిన టెకీ వంకాయల దినేశ్

## భక్తులపై ఏనుగుల దాడి

తలకోన అడవిలో అర్ధరాత్రి బీభత్సం.. ముగ్గురి దుర్మరణం.. నలుగురికి గాయాలు


శివరాత్రి ఉత్సవాలకు అడ్డదారిలో వెళ్తుండగా విషాదం.. స్టీల్ బాక్సుపై శబ్దం చేయడంతో రెచ్చిపోయి దాడి.. మృతుల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు 14

కొడుకు పుట్టడంతో తలనీలాలిద్దామని వెళ్తూ మృత్యువాత.. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా



2

కేంద్రం నిర్బంధ హిందీకి వ్యతిరేకంగా..
### మరో భాషోద్యమం
తమిళనాడుపై వేలాడుతున్న నియోజకవర్గాల పునర్విభజన కత్తి.. 5న అఖిలపక్షం: స్టాలిన్




2

### బడిలో తెలుగుకు జై
తెలంగాణలో ఇక నిక్కచ్చిగా అమలు

1 నుంచి 10 వరకు అన్ని సిలబస్‌ల స్కూళ్లలోనూ తెలుగును ఒక సబ్జెక్టుగా బోధించాల్సిందే

సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ సిలబస్ బడుల యాజమాన్యాలతో భేటీలో టీ-ప్రభుత్వ స్పష్టీకరణ

ఐటీ బ్రదర్..
### ఫ్యాటీ లివర్!



దేశంలోని 80% మంది ఐటీ ఉద్యోగులు ఫ్యాటీ లివర్ బాధితులే

ఏఐజీ వైద్యులు, హెచ్‌సీయూ రిసెర్చ్ స్కాలర్ల అధ్యయనంలో వెల్లడి

చిరుతిండ్లు, నిద్రలేమి, పని ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం ప్రధాన కారణాలు 2

సిక్కుల ఊచకోత కేసు..
### సజ్జన్‌కు యావజ్జీవం
కాంగ్రెస్ మాజీ ఎంపీకి ప్రత్యేక కోర్టు శిక్ష ఖరారు

మరణ శిక్ష విధించాలని సిక్కుల డిమాండ్ 2

## తెలీదు.. మరిచిపోయా..
# గుర్తులేదు!
### దర్యాప్తు అధికారుల విచారణలో 'అదుర్స్' చూపించిన వైసీపీ నేత వంశీ

సత్యవర్ధన్ ఎవరో కూడా తెలియదట

ఒక రాత్రంతా సత్యవర్ధన్ తన ఇంట్లో ఉన్నాడని వెల్లడి.. కానీ, గుర్తించలేదట!

ఇంటి నుంచి వెళ్లిపోయాకే తెలిసిందట

టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో యూటర్న్‌పై బలవంతం చేయలేదట 11

ఫోన్లు ఎక్కడున్నాయో గుర్తులేదని వెల్లడి

సత్యవర్ధన్ ఎక్కిన కారు తనది కాదని బొంకు

తొలి రోజు రెండు గంటలపాటు విచారణ

30 ప్రశ్నలు సంధించిన దర్యాప్తు అధికారి



మాజీ ఎమ్మెల్యే వంశీని విచారణకు తీసుకెళ్తున్న పోలీసులు

### అవినాశ్, జోగికి ముందస్తు బెయిల్
దేశం విడిచి వెళ్లరాదని సుప్రీంకోర్టు షరతు 14

## మోదీ ప్రభుత్వం ఫాసిస్టు కాదు! 2

నయా-ఫాసిజం పోకడలు మాత్రమే ఉన్నాయి

ముసాయిదా రాజకీయ తీర్మానంలో సీపీఎం

దశాబ్దాల వైఖరి మార్చుకున్న మార్క్సిస్ట్ పార్టీ?

డాక్యుమెంటు సవరించాలని సీపీఐ డిమాండ్

బీజేపీ-ఎల్‌డీఎఫ్ రహస్య పొత్తు: కాంగ్రెస్

ఆలస్యంగానైనా సీపీఎం గ్రహించింది: బీజేపీ



### తెలుగు యోధులకు ఢిల్లీలో ఘోర అవమానం 12

ఆచార్య ఎన్జీ రంగా, సుందర్‌రావు సమాధుల కబ్జా

మట్టి, రాళ్లతో సమాధులు కప్పేసి.. జిమ్‌కు దారి

తెలుగు రాష్ట్రాల సీఎంలు జోక్యం చేసుకోవాలి

సమాధులను పరిరక్షించాలి.. తెలుగువారి డిమాండ్

# పదో తరగతి పరీక్షలు ఇక ఏటా రెండు సార్లు

» సీబీఎస్ఈ ప్రతిపాదన.. 2026 నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ఇకపై ఏటా రెండు విడతలుగా పదో తరగతి పరీక్షలు నిర్వహించాలని సీబీఎస్ఈ ప్రతిపాదించింది. 2026 నుంచి అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన విధి విధానాలను మంగళవారం జనబాహుళ్యంలోకి అందుబాటులో ఉంచింది. వీటిపై మార్చి 9లోగా అభిప్రాయాలు చెప్పాలని కోరింది. ఫిబ్రవరి 17 నుంచి మార్చి 6 వరకు తొలి విడతగా, మే 5 నుంచి 20 వరకు రెండో విడతగా పరీక్షలు జరపాలని ముసాయిదాలో పేర్కొంది. 'ఇంప్రూవ్‌మెంట్' కోసం ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ రెండు విడతల్లోనూ పరీక్షలు రాసే అవకాశం ఉంది. ఇంప్రూవ్‌మెంట్ కోసం కొన్ని సబ్జెక్టులను మాత్రమే ఎంచుకునే సౌలభ్యం కూడా ఉంది. రెండు విడతల్లోనూ మొత్తం సిలబస్‌కు పరీక్షలు జరుపుతారు. రెండు విడతలకు కూడా ఒకే పరీక్ష కేంద్రాన్ని కేటాయిస్తారు. ఎలాంటి మార్పులు చేయబోరు. 2026 ఫిబ్రవరిలో పరీక్షలు రాసే విద్యార్థుల జాబితాను 2025 సెప్టెంబరు నాటికే తయారు చేస్తారు. ఈ జాబితాలో పేరు ఉన్నవారికి మాత్రమే 2026 మేలో జరిగే పరీక్షలకు అనుమతి ఇస్తారు. ఒక్కసారి జాబితాను ఖరారు చేసిన తరువాత సబ్జెక్టులను మార్చుకునే అవకాశం విద్యార్థులకు ఉండదు.

## ఐటీ బ్రదర్.. ఫ్యాటీ లివర్ !

» దేశంలోని 80% మంది ఐటీ ఉద్యోగులు ఫ్యాటీ లివర్ బాధితులే

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) దాని అనుబంధ రంగాల్లో పని చేస్తున్న వారిలో కాలేయ సంబంధిత అనారోగ్య సమస్యలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. దేశ వ్యాప్తంగా 54 లక్షల మంది ఐటీ రంగంలో పని చేస్తుండగా.. వారిలో 80 శాతం మందికి పైగా ఫ్యాటీ లివర్ సహా పలు కాలేయ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. అంతేకాక, 71 శాతం మంది ఐటీ ఉద్యోగుల్లో ఊబకాయం సమస్య ఉండగా, 34 శాతం మంది ఫ్యాటీ లివర్, అధిక రక్తపోటు, మధుమేహం తదితర సమస్యల బారిన పడే ప్రమాదంలో ఉన్నారు. హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రి హెపటాలజిస్ట్ డాక్టర్ పీఎన్ రావు బృందం, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)కి రిసెర్చ్ స్కాలర్ల బృందం సంయుక్తంగా చేసిన ఓ అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. అధిక పని గంటలు, ఒత్తిడి, రకరకాల పని వేళలు, ఎక్కువ సేపు ఒకే చోట కూర్చోని ఉండడం వంటివి కాలేయ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని పరిశోధకులు తెలిపారు. అంతేకాక, నిద్రలేమి, అనారోగ్యకరమైన చిరుతిళ్లు, శారీరక శ్రమ లేకపోవడం కూడా సమస్యకు కారణాలని పేర్కొన్నారు. ఈ అధ్యయనంలో హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ మెడిసన్ ప్రొఫెసర్లు కల్యాణ్కర్ మహదేవ్, అనిత, రీసెర్చ్ స్కాలర్లు బారం భార్గవ, నందితా ప్రమోద్ పాల్గొన్నారు.

## అరగంటలో ఢిల్లీ నుంచి జైపూర్‌కు

» తొలి హైపర్‌లూప్ ప్రాజెక్టులో ముందడుగు

» 422 మీటర్ల టెస్ట్ ట్రాక్ సిద్ధం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ఢిల్లీ నుంచి రాజస్థాన్‌లోని జైపూర్‌కు దాదాపు 300 కిలోమీటర్లు ఉంటుంది. రోడ్డు, రైలు లేదా విమాన మార్గం ద్వారా ఈ దూరాన్ని అరగంటలో చేరుకోవడం సాధ్యం కాదు. కానీ త్వరలోనే అందుబాటులోకి రానున్న హైపర్‌లూప్ ప్రాజెక్టుతో ఇది సాధ్యమే అంటోంది రైల్వే మంత్రిత్వ శాఖ. ఈ అత్యాధునిక వ్యవస్థను భారత్‌లో తొలిసారిగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రైల్వే శాఖ, ఐఐటీ మద్రాస్ కలిసి పనిచేస్తున్నాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా ఐఐటీ మద్రాస్ 422 మీటర్ల పొడవైన హైపర్ లూప్ టెస్ట్ ట్రాక్‌ను సిద్ధం చేసిందని, దీన్ని పరీక్షిస్తామని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు.

## ఢిల్లీ లిక్కర్ స్కామ్‌తో..

# సర్కారుకు 2 వేల కోట్ల నష్టం

» ఉత్పత్తి, అమ్మకాల లెక్కలే లేవు: కాగ్

» అసెంబ్లీలో నివేదిక.. ఆప్ గందరగోళం

» 21 మంది ఆప్ ఎమ్మెల్యేల సస్పెన్షన్



ఢిల్లీ అసెంబ్లీలో ఎల్జీ సక్సేనా ప్రసంగిస్తుండగా ఆప్ ఎమ్మెల్యేల ఆందోళన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కామ్‌తో ఢిల్లీ ప్రభుత్వానికి రూ.2002.68 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) స్పష్టం చేసింది. ఢిల్లీ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంగళవారం సీఎం రేఖాగుప్తా కాగ్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన లొసుగులకు సంబంధించి కాగ్ 20 అంశాలను లేవనెత్తగా.. వాటిల్లో ఒకటి– మద్యం విధానం-2021తో నష్టాల చిట్టాపై అసెంబ్లీలో చర్చ జరుగుతుండగా.. ఆప్ ఎమ్మెల్యేలు తీవ్రంగా వ్యతిరేకించారు. వారు గందరగోళం సృష్టించడంతో స్పీకర్ విజేంద్రగుప్తా 21 మంది ఆప్ ఎమ్మెల్యేలు రెండ్రోజులపాటు సస్పెండ్ చేశారు.

### కాగ్ లేవనెత్తిన అంశాలు..

మద్యం పాలసీ-2021లో అడుగడుగునా ప్రభుత్వానికి నష్టం వాటిల్లినట్లు కాగ్ స్పష్టం చేసింది. సరెండర్ చేసిన రిటైల్ లైసెన్స్‌ల స్థానంలో మళ్లీ టెండర్లను ఆహ్వానించలేదని, దీని వల్ల ప్రభుత్వానికి రూ.890.15 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు స్పష్టం చేసింది. జోనల్ లైసెన్సుల మినహాయింపు వల్ల మరో రూ.941.53 కోట్లు, సెక్యూరిటీ డిపాజిట్లను సరిగా వసూలు చేయకపోవడం వల్ల రూ.27 కోట్లు, కొవిడ్ లాక్‌డౌన్ల పేరుతో అడ్డగోలు మినహాయింపులతో ఇంకో రూ.144 కోట్లు.. ఇలా మొత్తం 2002.68 కోట్ల మేర ప్రభుత్వం నష్టపోయినట్లు కాగ్ నివేదిక వెల్లడించింది. "కొత్త మద్యం పాలసీ రూపకల్పనకు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సిఫారసులను అప్పటి ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా విస్మరించారు" అని కాగ్ వివరించింది.

### సగం నాటు మద్యమే

2021 మద్యం పాలసీ తర్వాత ఢిల్లీలో విక్రయించిన మద్యంలో సగం నాటు సరుకేనని కాగ్ తేల్చింది. "అనేక మంది హోల్‌సేల్ మద్యం వ్యాపారులు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) నిబంధనలకు అనుగుణంగా నాణ్యత పరీక్షలను నిర్వహించలేదు. ఎక్సైజ్ ఇంటెలిజెన్స్ సీజ్ చేసిన మద్యంలో సగం నాటు సరుకే ఉంది. అసలు ఎంత ఉత్పత్తి చేశారు? ఎంత మేర విక్రయాలు జరిగాయి? అనే దానికి లెక్కలే లేవు. మద్యం విధానం సాంతం లోపాలమయం" అని కాగ్ నివేదిక వివరించింది. సర్కారు అజమాయిషీలోని హోల్‌సేల్ సంస్థలకు కాకుండా.. ప్రైవేటు కంపెనీలకు పెద్ద ఎత్తున హోల్‌సేల్ లైసెన్సులు ఇచ్చారని, ఎక్సైజ్ సుంకం స్థానంలో భారీ ఎత్తున లైసెన్స్ ఫీజు వసూలు చేశారని ఎత్తిచూపింది. "నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి రెండు దుకాణాలను మాత్రమే కేటాయించాలి. అయితే.. 2021 పాలసీలో 54 రిటైల్ దుకాణాలను కేటాయించారు. ఈ విషయంలో లెఫ్టినెంట్ గవర్నర్ నుంచి లేదా క్యాబినెట్ నుంచి అనుమతులు తీసుకోలేదు. అడ్డగోలుగా రాయితీలు, సడలింపులు ఇచ్చారు. దేశీయ, విదేశీ మద్యం సరఫరాకు హోల్‌సేల్ లైసెన్సులు లేని 14 బడా వ్యాపార సంస్థలకు కేటాయింపులు చేశారు. ఢిల్లీని 32 జోన్లుగా విభజించి, 22 సంస్థలకు రిటైల్ దుకాణాలను కేటాయించార"ని కాగ్ స్పష్టం చేసింది.

### అంతా కుమ్మక్కయ్యారు

హోల్‌సేల్ లైసెన్సు పొందిన వారు, జోనల్ లైసెన్సులు పొందిన వారు కుమ్మక్కయ్యారని కాగ్ తేల్చింది. హోల్‌సేల్ లైసెన్సులు పొందిన ఇండో స్పిరిట్ సంస్థకు కావోగలి రెస్టారెంట్లు అనుబంధ సంస్థలని, మహాదేవ్ లిక్కర్ అనే హోల్‌సేల్ సంస్థకు భగవతీ ట్రాన్స్‌పోర్టర్ కార్పొరేషన్ అనే సంస్థకు సంబంధాలున్నాయని తెలిపింది. గౌతమ్ వైన్స్ అనే హోల్‌సేల్ సంస్థకు, ఒయాసిస్ బిస్లరీస్, విజేత బేవరేజస్ సంస్థల్లో వాటాలున్నాయని వివరించింది. అయితే, నాటు మద్యాన్ని విక్రయించారనే ఆరోపణలను మాజీ సీఎం ఆతిషి ఖండించారు. తాము గతంలో కంటే నాణ్యమైన మద్యాన్నే సరఫరా చేశామని వ్యాఖ్యానించారు.


## మోదీ ప్రభుత్వం ఫాసిస్టు కాదు!

**నయా-ఫాసిజం పోకడలు మాత్రమే ఉన్నాయి**

**ముసాయిదా రాజకీయ తీర్మానంలో సీపీఎం**

తిరువనంతపురం, ఫిబ్రవరి 25: కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని తీవ్ర నిరంకుశత్వ జాతీయవాద (ఫాసిస్టు) శక్తిగా పేర్కొంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడే సీపీఎం.. తన వైఖరి మార్చుకుందా? దానిపై ఫాసిస్టు ముద్ర వేసేందుకు నిరాకరిస్తోందా? ..అవునని తాజా పరిణామమే చెబుతోందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. మోదీ సర్కారుకు నయా-ఫాసిస్టు పోకడలు ఉన్నాయని పార్టీ ముసాయిదా తీర్మానంలో అంగీకరిస్తూనే.. ఫాసిస్టు ప్రభుత్వమని మాత్రం అనకుండా సీపీఎం ఆగిపోయింది. దీనిపై సోదర కమ్యూనిస్టు పక్షం సీపీఐ ఆగ్రహం వ్యక్తంచేయగా.. మార్క్సిస్ట్ పార్టీ ఏళ్లతరబడి బీజేపీతో సాగిస్తున్న రహస్య మైత్రి బట్టబయలైందని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. తమిళనాడులోని మదురైలో వచ్చే ఏప్రిల్లో సీపీఎం జాతీయ కాంగ్రెస్ జరుగనుంది. అందులో ఆమోదించే విశ్లేషణాత్మక రాజకీయ తీర్మానం ముసాయిదాను కేంద్ర కమిటీ ఇటీవల రాష్ట్ర కమిటీలకు చర్చ కోసం పంపింది. మోదీ సర్కారును సీపీఐ ఫాసిస్టు ప్రభుత్వంగా అభివర్ణిస్తుంటుంది.. భారత్‌లోకి ఫాసిజం వచ్చేసిందని సీపీఐ-ఎంఎల్ అటుంటుంది. ఈ రెండు పార్టీలకు తన వైఖరి భిన్నమని సీపీఎం సదరు ముసాయిదాలో పేర్కొంది. ముస్సోలినీ, హిట్లర్‌ల నాటి ఫాసిజాన్ని క్లాసికల్ ఫాసిజంగా అభివర్ణించింది. తర్వాత వచ్చిన అలాంటి వ్యక్తీకరణలన్నీ 'నియో-ఫాసిజం' కిందకు వస్తాయని తెలిపింది. 'సామ్రాజ్యవాద అంతర్గత వైరుధ్యాల వల్ల క్లాసికల్ ఫాసిజం పుట్టింది. నయా ఉదారవాద సంక్షోభం కారణంగా నయా-ఫాసిజం ఆవిర్భవించింది' అని కొత్తగా నిర్వచించింది. గతంలో ఆర్‌ఎస్‌ఎస్‌ను ఫాసిస్టు లక్షణాలున్న సంస్థగా సీపీఎం పేర్కొంది. తాజాగా మోదీ ప్రభుత్వాన్ని ఫాసిస్టు కేటగిరీలో చేర్చలేమని.. అలాగే భారతదేశాన్ని నయా ఫాసిస్టుగా చిత్రీకరించరాదని తీర్మానంలో అభిప్రాయపడింది. 'దశాబ్దానికిపైగా మోదీ అప్రతిహత పాలన కారణంగా రాజకీయాధికారం బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ చేతుల్లో నిక్షిప్తమైపోయింది. ఈ కూటమిని అడ్డుకోకపోతే.. హిందూత్వ-కార్పొరేట్ నియంతృత్వం నయా ఫాసిజం వైపు నడుస్తుంది. అయితే నయా-ఫాసిజం పోకడలు అనే పదబంధాన్ని.. ప్రభుత్వం నయా-ఫాసిజం సర్కారుగా లేదా రాజకీయ వ్యవస్థగా రూపాంతరం చెందినట్లుగా అర్థం చేసుకోకూడద'ని తెలిపింది. సీపీఎంలో ఈ పరివర్తన సీపీఐకి ఆగ్రహం తెప్పించింది. తీర్మానాన్ని సవరించుకోవాలని సీపీఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం అన్నారు. ఇంకోవైపు.. సీపీఎం ఆలస్యంగానైనా నిజాన్ని గ్రహించిందని, ఈ మార్పును స్వాగతిస్తున్నామని బీజేపీ పేర్కొంది.

## లోకం తీరు




## తెలుగు నిర్మాత కేదార్ దుబాయ్‌లో మృతి

**ఓ పెళ్లి వేడుకలో పాల్గొన్న తర్వాత విషాదం**

**అల్లు అర్జున్, విజయ దేవరకొండ సన్నిహితుడు**



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): టాలీవుడ్ యువ నిర్మాత కేదార్ సెలగంశెట్టి మంగళవారం దుబాయ్‌లో ఆకస్మికంగా మృతి చెందారు. ఇది సినీ వర్గాల నుంచి వస్తున్న సమాచారమే కానీ ఇంతవరకు అధికారికంగా ఎవరూ ధ్రువీకరించలేదు. ఆనంద్ దేవరకొండ హీరోగా ఇటీవల విడుదలైన గం గం గణేషా చిత్రం ఆయన నిర్మించిందే. టాలీవుడ్ సినీ ఫైనాన్షియర్ కుమారుడి వివాహానికి సంబంధించిన ప్రీ వెడ్డింగ్ వేడుకకు పరిశ్రమలోని ముఖ్యులు అనేకులు హాజరైన తరుణంలో ఈ దుర్ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. ఈ వేడుకకు తోడు దుబైలో సోమవారం రాత్రి మిత్రులతో పార్టీకి హాజరైన కేదార్ అనంతరం తన ఫ్లాట్‌లో నిద్రపోయాడు. నిద్రలోనే తాను మృతి చెందాడని సమాచారం. తన మరణానికి అనారోగ్యమా? మరింకేమైనా కారణం ఉందా? తేలాల్సి ఉంది. కేదార్ నిద్రించిన ఫ్లాట్‌లోనే తెలంగాణకు చెందిన తాజా మాజీ ఎమ్మెల్యే కూడా బస చేసినట్లు సమాచారం. ఆ మాజీ ఎమ్మెల్యేను దుబాయి పోలీసులు ప్రశ్నిస్తున్నట్లు ధ్రువీకరించని సమాచా రం. సరిగ్గా ఏడాది క్రితం గచ్చిబౌలి పరిధిలోని రాడిసన్ హోటల్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీపై పోలీసులు దాడి చేశారు. ప్రముఖ రాజకీయ నాయకుడి కుమారుడు ఇచ్చిన కొకైన్ పార్టీకి కేదార్‌తో పాటు.. కొందరు సినీ ప్రముఖులు, దర్శకుడు క్రిష్, ఇండస్ట్రీకి చెందిన జూనియర్ మహిళా ఆర్టిస్టులు సైతం హాజరయ్యారని అప్పట్లో పోలీసులు పేర్కొన్నారు.

# మస్క్ అడిగాడు కదా.. చెప్పండి



వాషింగ్టన్, ఫిబ్రవరి 25: ఫెడరల్ ఉద్యోగులంతా గడిచిన వారంలో చేసిన పనుల వివరాలను మెయిల్ చేయాలని, లేనిపక్షంలో ఉద్యోగాలకు రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉండాలని అమెరికాలోని డోజ్ విభాగం చీఫ్ ఎలాన్ మస్క్ చేసిన ప్రకటనను అధ్యక్షుడు ట్రంప్ సమర్థించారు. "మీరంతా నిజంగానే పని చేస్తున్నారా.. చేస్తే ఆ పనులేంటో చెప్పండి అని మస్క్ అడుగుతున్నారు. ఒక వేళ సమాధానం ఇవ్వకపోతే మీరు తొలగించాల్సిన ఉద్యోగుల జాబితాలో ఉంటారు" అని ఫెడరల్ ఉద్యోగులను ఉద్దేశించి ట్రంప్ వ్యాఖ్యానించారు. ఫెడరల్ విభాగాల్లో పనిచేస్తున్నట్లుగా ఉన్న చాలా మంది ఉద్యోగులు అసలు ఉనికిలోనే లేరని, లేని ఉద్యోగులకు జీతాలు అందుతున్నాయని ట్రంప్ ఈ సందర్భంగా ఆరోపించారు. ఇలా వందల బిలియన్ల డాలర్ల మోసం జరుగుతోందని చెప్పారు. దీన్ని డోజ్ విభాగం గుర్తించిందన్నారు. మరోవైపు, తన ప్రకటన పట్ల ఫెడరల్ ఉద్యోగుల్లో వ్యతిరేకతపై మస్క్ స్పందించారు. 'కొంచెం జవాబుదారీగా ఉండండి అంటే ద్వేషాన్నంతా వెళ్లగక్కుతున్నారు' అని వ్యాఖ్యానించారు. అధ్యక్షుడికి ఉన్న విచక్షణాధికారంతో ఫెడరల్ ఉద్యోగులకు ఇంకొక అవకాశం ఇస్తామని, అప్పుడు కూడా మెయిల్ పంపకపోతే వారిని కచ్చితంగా ఉద్యోగాల నుంచి తొలగిస్తామని ఆయన హెచ్చరించారు. అమెరికా కాలమానం ప్రకారం.. సోమవారం రాత్రిలోగా ఫెడరల్ ఉద్యోగులంతా మెయిల్ పంపాలని మస్క్ మూడు రోజుల క్రితం ఆదేశించారు. ఇప్పటికే గడువు ముగిసింది. మరోవైపు, మస్క్‌కు రిప్లై ఇవ్వాల్సిన అవసరం లేదని ఫెడరల్ విభాగాలు తమ ఉద్యోగులకు సూచించాయి.

### పుతిన్ నియంత కాదు

రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను 'నియంత' అని పిలిచేందుకు ట్రంప్ నిరాకరించారు. అలాంటి పదాలను ఎలా ఉపయోగిస్తామని ప్రశ్నించారు. సోమవారం ఆయన అమెరికా పర్యటనకు వచ్చిన ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌తో చర్చలు జరిపారు. అనంతరం ఇరువురు నేతలు ఉమ్మడిగా విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని 'నియంత' అని గత వారం ట్రంప్ విమర్శించిన నేపథ్యంలో 'పుతిన్‌ను కూడా నియంతగా గుర్తిస్తున్నారా?' అని విలేకరులు అడిగారు. ఇందుకు ట్రంప్ సమాధానం ఇస్తూ 'అంత తేలికగా అలాంటి మాటలను ఎలా అంటాం' అని అన్నారు. శాంతి చర్చలపై మాట్లాడుతూ 'మనం స్మార్ట్‌గా ఉంటే వారంలోనే యుద్ధం ముగిసిపోవచ్చు. స్మార్ట్‌గా లేకపోతే కొనసాగవచ్చు' అని అన్నారు. దీనిపై మేక్రాన్ స్పందిస్తూ శాంతి ఒప్పందం అంటే ఉక్రెయిన్ లొంగిపోవడం కాదని, ఎలాంటి గ్యారెంటీలు లేకుండా కాల్పుల విరమణ జరగకూడదని చెప్పారు.

# మరోసారి భాషా ఉద్యమానికి సిద్ధం

» తమిళ ప్రజలపై హిందీని రుద్దితే ఒప్పుకోం..కుట్రను తిప్పికొడతాం

» తమిళనాడు సీఎం స్టాలిన్



విలేకరులతో మాట్లాడుతున్న స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మరోసారి భాషా యుద్ధానికి తమిళనాడు సిద్ధమని, ప్రజలు అందుకు సిద్ధం కావాలని ఆ రాష్ట్ర సీఎం స్టాలిన్ పిలుపునిచ్చారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కుట్రలను తిప్పికొడతామన్నారు. ఈ మేరకు ఆయన పార్టీ కార్యకర్తలకు బహిరంగ లేఖ రాశారు. ఆధిపత్య ధోరణిని ప్రతిఘటించడం, మాతృభాషను కాపాడుకోవడం డీఎంకే కార్యకర్తల రక్తంలోనే ఉందన్నారు. ఆ చైతన్యం తుదిశ్వాస వరకూ కొనసాగుతుందని అన్నారు. కేంద్రంలోని పాలకులు తమిళనాడులో హిందీని ఎలాగైనా అమలు చేయాలనే ప్రయత్నిస్తుంటారని, వాటిని డీఎంకే ఎప్పటికప్పుడు తీవ్రంగా వ్యతిరేకిస్తూనే వస్తోందని చెప్పారు. తాజాగా కేంద్రం విద్యారంగానికి కేటాయించాల్సిన నిధులకు-జాతీయ విద్యావిధానం అమలుకు ముడిపెట్టిందని, త్రిభాషా విద్యావిధానాన్ని అమలు చేస్తేనే ఆ నిధులిస్తామంటూ బ్లాక్ మెయిల్‌కు దిగుతోందని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో మళ్లీ హిందీ వ్యతిరేకోద్యమం కోసం అంతా నడుం బిగించి సిద్ధంగా ఉండాలని స్టాలిన్ కోరారు. కాగా, 1965లో డీఎంకే నేతృత్వంలో హిందీకి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమం చేసింది.

### మార్చి 5న అఖిలపక్ష సమావేశం

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన పేరుతో తమిళనాడులో 8 లోక్‌సభ స్థానాలను తగ్గించేలా కేంద్రప్రభుత్వం కుట్రపన్నుతోందని సీఎం స్టాలిన్ ఆరోపించారు. మంగళవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సందర్భంగా సీఎం మీడియాతో మాట్లాడారు. జనాభా నియంత్రణను సమర్థవంతంగా నిర్వహించి దేశాభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తున్న దక్షిణ భారతదేశంపై నియోజకవర్గాల పునర్విభజన కత్తి వేలాడదీయడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఎంపీ సీట్ల సంఖ్యను తగ్గించకుండా కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు మార్చి 5న అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గాల పునర్విభజనతో తమిళనాడులో ఎంపీ సీట్లు 39 నుంచి 31కి పడిపోతాయని వివరించారు. మరోవైపు, జాతీయ విద్యా విధానంపై తమిళనాట రాజకీయాలు వేడెక్కుతున్న వేళ.. కేంద్రం తీరును నిరసిస్తూ బీజేపీ నేత, నటి రంజనా నట్చియార్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. త్రిభాషా పాలసీని రుద్దడమంటే ద్రవిడ భావజాలాన్ని వ్యతిరేకించడమేనని ఆమె ఎక్స్ వేదికగా విమర్శించారు.

### కర్ణాటక, మహారాష్ట్ర మధ్య తిరగని సర్వీసులు

బెంగళూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని బెళగావి జిల్లాలో కేఎస్‌ఆర్టీసీ బస్సు కండక్టర్ మరాఠీలో మాట్లాడలేదని జరిగిన దాడి నేపథ్యంతో మూడోరోజు మంగళవారం కూడా మహారాష్ట్ర, కర్ణాటక మధ్య బస్సు సర్వీసులు నిలిచిపోయాయి. ఘటనపై కన్నడ సంఘాలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి. కాగా, కండక్టర్‌పై పెట్టిన పోక్సో కేసును వాపసు తీసుకుంటున్నట్టు బాలిక తల్లి ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం బాలిక తల్లి ఒక వీడియో సందేశం విడుదల చేశారు. తాము కన్నడిగులమేననీ, కన్నడ అంటే అభిమానమని, కండక్టర్‌పై ఫిర్యాదు కన్నడ, మరాఠా వివాదంగా మారిందన్నారు. కండక్టర్ మహదేవప్పపై చేసిన ఫిర్యాదును వాపసు తీసుకుంటున్నామన్నారు. టిక్కెట్ కొనుగోలు విషయంలో గొడవ జరిగిందనీ, అది భాషా సమస్యగా మారిందన్నారు.

# భారత్‌కు ట్రంప్ ఝలక్

## మన దేశానికి వ్యతిరేకంగా ఒకేసారి రెండు నిర్ణయాలు

» భారత్‌లోని కొన్ని సంస్థలు, నౌకలపై తాజా ఆంక్షలు

» ఇంధన ట్యాంకర్ల ఆపరేటర్లు, మేనేజర్లపై కూడా

» ఇరాన్‌కు సహకరిస్తున్నారని ఆరోపణ

వాషింగ్టన్, ఫిబ్రవరి 25: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌కు వ్యతిరేకంగా తాజాగా తీసుకున్న రెండు నిర్ణయాలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. రహస్యంగా ఇరాన్ పెట్రోలియం ఉత్పత్తుల రవాణా, అమ్మకాల బ్రోకరింగ్ నిర్వహిస్తున్నారంటూ 30 మంది వ్యక్తులపైనా, నౌకలు, సంస్థలపైనా అమెరికా ఆర్థిక, విదేశాంగశాఖలు తాజాగా ఆంక్షలు విధించాయి. భారత్, చైనాలోని ట్యాంకర్ల ఆపరేటర్లు, మేనేజర్లు, యూఏఈ(యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్), హాంకాంగ్‌లోని ఇంధన బ్రోకర్లు, ఇరాన్‌కు చెందిన నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ అధినేత కూడా ఈ ఆంక్షల జాబితాలో ఉన్నారు. ఇరాన్‌కు చెందిన కోట్లాది బ్యారెళ్ల ముడి చమురును ఈ నౌకలు రవాణా చేస్తున్నాయని, ఆ చమురు విలువ వందల కోట్ల రూపాయలు ఉంటుందని అమెరికా ఆర్థికశాఖ తెలిపింది. 'ఇరాన్ చమురుకు సంబంధించిన కార్యకలాపాలు నిర్వర్తించే ఎవరికైనా ఆంక్షల ముప్పు తప్పదు' అని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సంట్ తేల్చిచెప్పారు.

### ఆంక్షలు ఈ సంస్థలపైనే...

అమెరికా తాజాగా ఆంక్షలు విధించిన సంస్థల్లో భారత్‌కు చెందిన బీఎంఎస్ మెరైన్ లిమిటెడ్ లయబిలిటీ పార్ట్‌నర్‌షిప్, ఆస్టిన్‌షిప్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, కాస్మోస్ లైన్స్ ఇన్క్ ఉన్నాయి. ఈ సంస్థలు రహస్యంగా ఇరాన్‌కు చెందిన పెట్రోలియం ఉత్పత్తుల కొనుగోలు, మార్కెటింగ్, రవాణా, అమ్మకాలను నిర్వహిస్తున్నాయనేది అమెరికా ఆరోపణ. దీంతోపాటు భారత్‌కు చెందిన ఫ్లక్స్ మారిటైమ్ ఎల్ఎల్‌పీ సాంకేతిక మేనేజర్‌లా వ్యవహరిస్తూ లక్షల బ్యారెళ్ల ఇరాన్ ముడి చమురును ఒక నౌక నుంచి మరో నౌకకు మళ్లించే కార్యకలాపాలకు పాల్పడుతోందని అమెరికా ఆరోపించింది.

### ఇరాన్‌ను ఆర్థిక దిగ్బంధనం చేసేందుకే..

ఇరాన్‌పై గరిష్ఠంగా ఆర్థికపరమైన ఒత్తిడి తెచ్చేలా అమెరికా ఆర్థిక శాఖ మంత్రిని ఆదేశిస్తూ ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ఈనెల మొదట్లో ట్రంప్ సంతకం చేశారు. ఇరాన్ ఇంధన ఎగుమతులు శూన్యం కావాలని అందులో ఆదేశించారు. ఇరాన్ అణ్వాయుధ దేశంగా అభివృద్ధి చెందకూడదని ట్రంప్ తేల్చిచెప్పారు. అమెరికా నుంచి తీవ్రమైన ఆంక్షలు ఉన్నప్పటికీ ఇంధన ఎగుమతుల ద్వారా 2022లో రూ.4.7 లక్షల కోట్లు(54 బిలియన్ డాలర్లు), 2023లో రూ.4.6 లక్షల కోట్లను ఇరాన్ ఆర్జించినట్టు అమెరికా అంచనా వేసింది.

### విదేశీ సాయం నిలిపేసినా.. పాక్‌కు నిధులు

అప్పుల్లో కూరుకుపోయిన పాకిస్థాన్‌కు ఎఫ్-16 యుద్ధ విమానాల నిర్వహణ కోసం రూ.3,461 కోట్ల(397 మిలియన్ డాలర్ల) నిధులను అమెరికా తాజాగా మంజూరు చేసింది. అమెరికా పర్యవేక్షణ కార్యక్రమం కింద ఈ నిధులను ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లకు ఉపయోగించాలని, ఆ నిధులను భారత్‌కు వ్యతిరేకంగా వినియోగించకూడదని అమెరికా తేల్చిచెప్పినట్టు ఒక ఆంగ్ల వార్తా సంస్థ తాజాగా కథనం ప్రచురించింది. జనవరి 20 అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత విదేశీ సాయాన్ని ట్రంప్ నిలిపివేసినప్పటికీ పాకిస్థాన్‌కు తాజాగా నిధులు విడుదల చేయడం గమనార్హం. ఉగ్రవాదంపై తగిన చర్యలు చేపట్టడం లేదంటూ 2018లో పాకిస్థాన్‌కు రక్షణ సాయాన్ని ట్రంప్ నిలిపివేశారు. ఆ నిర్ణయాన్ని బైడెన్ ప్రభుత్వం ఉపసంహరించుకొంది.

# సిక్కుల ఊచకోత కేసులో సజ్జన్ కుమార్‌కు యావజ్జీవం

» ప్రత్యేక కోర్టు తీర్పు

» ఉరిశిక్ష విధించాలని సిక్కుల డిమాండు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: నాలుగు దశాబ్దాల నాటి సిక్కుల ఊచకోత కేసులో కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్ దోషి అని ప్రకటించిన ప్రత్యేక కోర్టు మంగళవారం ఆయనకు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఈ మేరకు ప్రత్యేక జడ్జి కావేరీ బవేజా తీర్పు చెప్పారు. మాజీ ప్రధాని ఇందిర హత్య అనంతరం జరిగిన అల్లర్లలో 1984 నవంబరు ఒకటో తేదీన జశ్వంత్ సింగ్ ఆయన కుమారుడు తరుణ్‌దీప్ సింగ్‌లను హత్య చేయించారంటూ ఆయనపై కేసు నమోదయింది. ఇలాంటి నేరాలకు గరిష్ఠంగా మరణశిక్ష, కనిష్ఠంగా యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తారు. అల్లర్లలో ఆయన ఒక్కడే పాల్గొనలేదని, కానీ అల్లరి మూకకు అతడే నాయకత్వం వహించాడని కోర్టు గుర్తించింది. సిక్కులపై జరిగిన దాడులకు సంబంధించి నానావతి కమిషన్ దర్యాప్తు చేసింది. మొత్తం 2,733 మంది మరణించగా 587 కేసులు నమోదయ్యాయి. నిందితుల ఆచూకీ దొరకకపోవడంతో 240 కేసులను మూసివేశారు. 250 కేసుల్లో నిందితులను నిర్దోషులుగా విడుదల చేశారు. 400 మందిని దోషులుగా కోర్టులు గుర్తించాయి. హత్యానేరం చేసినట్టు 50 మందిని శిక్షించగా వారిలో సజ్జన్ కుమార్ ఒకరు కావడం గమనార్హం. ప్రస్తుతం ఆయన తిహాడ్ జైలులో ఉన్నారు. మరోవైపు దీనిని అరుదైన కేసుల్లో అత్యంత అరుదైన కేసుగా పరిగణించి మరణశిక్ష విధించాలని డిమాండు చేస్తూ కోర్టు బయట సిక్కులు ప్రదర్శన జరిపారు. తీర్పుపై బీజేపీ ఐ.టి.విభాగం అధిపతి అమిత్ మాలవీయ ఎక్స్‌లో పోస్టు పెడుతూ "రాజీవ్, సోనియాల ప్రధాన అనుచరుడికి యావజ్జీవ కారాగార శిక్ష పడింది. ఈ కేసులోని ఇతర వ్యక్తులకు కూడా ఇదే గతి పడుతుంది" అని వ్యాఖ్యానించారు. ఈ కేసులో జగదీష్ టైట్లర్ కూడా నిందితుడిగా ఉన్నారు.

## తెలంగాణ బడుల్లో తెలుగు ఇక నిక్కచ్చిగా అమలు

» 1 నుంచి 10 వరకు అన్ని సిలబస్‌ల స్కూళ్లలో తెలుగును ఒక సబ్జెక్టుగా బోధించాల్సిందే

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నింటిలో తెలుగును ఒక సబ్జెక్టుగా బోధించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. విద్యార్థులకు తెలుగు భాషను తప్పనిసరి చేస్తూ తీసుకొచ్చిన చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని నిర్ణయించింది. అన్ని బోర్డుల స్కూళ్లలో 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఒకటో తరగతి మొదలు 10వ తరగతి వరకు తెలుగును ఒక సబ్జెక్టుగా బోధించాలని ఆదేశించింది. విద్యార్థులకు తెలుగు భాషపై పరీక్షలను కూడా నిర్వహించాలని తెలిపింది. విద్యార్థులు తెలుగు భాషను అభ్యసించేలా చర్యలు తీసుకోవాలని పాఠశాలలను ఆదేశించింది. ఈ విషయంలో విద్యాశాఖ అధికారులు తగిన పర్యవేక్షణ చేపట్టాలని సూచించింది. విద్యార్థులకు సరళమైన విధానంలో బోధించడం, వారిలో అభిరుచిని పెంపొందించడానికి వీలుగా 9, 10 తరగతుల పాఠ్యాంశంగా 'వెన్నెల' అనే తెలుగు వాచకం పుస్తకాన్ని తీసుకొచ్చింది. దీని వినియోగానికి సంబంధించి పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి డా.యోగితా రాణా మంగళవారం మెమో జారీ చేశారు. ఈ పుస్తకం ఆధారంగా సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ బోర్డుల యాజమాన్యాలు 10వ తరగతి పరీక్షలు నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

### రాగి జావ తాగిన 14 మంది విద్యార్థులకు అస్వస్థత

ఉప్పలగుప్తం/అమలాపురం టౌన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా చల్లపల్లి పంచాయతీ పరిధిలోని జగ్గరాజుపేట ప్రాథమిక పాఠశాలలో కలుషిత రాగి జావ తాగిన 14 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం ఉదయం మధ్యాహ్న భోజన పథక నిర్వాహకురాలు పులిదిండి సుజాత విద్యార్థులకు రాగిజావ అందించింది. తాగిన కొద్దిసేపటికి వారు స్వల్పంగా అస్వస్థతకు గురయ్యారు. 28 మంది విద్యార్థుల్లో 14 మంది విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. విద్యార్థులను అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

# రాజధానిలో దళారుల దందా!

## అసైన్డ్ రైతులకు ఇచ్చిన ప్లాట్లే టార్గెట్

- గత సర్కారు పెట్టిన సీఐడీ కేసులు బూచిగా చూపి బెదిరింపులు.. ధర రాదంటూ ప్రచారం
- గజానికి 10 నుంచి 20 వేల వరకు తగ్గింపు
- కేసులు ఎత్తేసినా రైతులకు తప్పని తిప్పలు
- సర్కారు స్పష్టమైన ప్రకటన చేయాలని విన్నపం

## చౌకగా రిటర్నబుల్ ప్లాట్లు కాజేసేందుకు కుట్ర

గుంటూరుకు చెందిన ఒక ఇంజనీర్ రాజధానిలోని వెంకటపాలెం గ్రామానికి చెందిన ఒక అసైన్డ్ రైతు వద్ద ప్రభుత్వం ఇచ్చిన 110 గజాల రిటర్నబుల్ ప్లాటును కొన్నారు. గజానికి రూ.38 వేలు చొప్పున రైతుకు చెల్లించారు. ఆ మరుసటి రోజే గజం రూ.55 వేలకు బేరం పెట్టి అమ్మేసుకున్నారు.

కురగల్లులో ఓ అసైన్డ్ రైతు తనకు ప్రభుత్వం ఇచ్చిన ప్లాటును బేరం పెట్టారు. సాధారణంగా గజం ధర రూ.50 వేలు పలుకుతుండగా, ఆ రైతు ప్లాటును దళారులు గజం రూ.30 వేలకు అడుగుతున్నారు. అదేమంటే.. అసైన్డ్ ప్లాట్ అంటూ దగా చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాజధానిలో రైతుల రిటర్నబుల్ ప్లాట్లకు విపరీతంగా డిమాండ్ పెరగడంతో దళారులు అక్కడ గద్దల్లా వాలిపోతున్నారు. కొర్రీలు పెట్టి రైతుల ప్లాట్ల ధరలు తగ్గించేస్తున్నారు. కారు చౌకగా కొట్టేసి సొమ్ము చేసుకుంటున్నారు. రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం ఇచ్చిన అన్ని రిటర్నబుల్ ప్లాట్లదీ ఒకే స్వభావం. అయితే దళారులు అసైన్డ్ రైతుల భూములను ప్రధానంగా టార్గెట్ చేసుకున్నారు. వాటి ధరలు తగ్గించి, వాటిని చూపి సాధారణ రైతుల ప్లాట్ల ధరలు కూడా తగ్గించి కాజేసేందుకు కుట్రలు పన్నుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం అసైన్డ్ రైతులపై పెట్టిన తప్పుడు సీఐడీ కేసులను వాడుకొని వారిని లూటీ చేస్తున్నారు.



అమరావతి పరిధిలోని దొండపాడులో రైతుల రిటర్నబుల్ ప్లాట్లు

### వైసీపీ హయాంలో చిక్కులు

రాజధాని అమరావతి నిర్మాణం కోసం గత టీడీపీ ప్రభుత్వం భూసమీకరణ పద్ధతిలో భూములు సేకరించింది. రాజధాని కోసం 29 వేలమంది రైతులు 34 వేల ఎకరాలను ప్రభుత్వానికి ఇచ్చారు. వారిలో 29 గ్రామాలకు చెందిన 3,139 మంది అసైన్డ్ రైతులు 2,689.14 ఎకరాలు ఇచ్చారు. వారి భూములపై గత వైసీపీ ప్రభుత్వం సీఐడీ కేసులు వేసింది. వారి స్థలాలను నాట్ ట్యాలీడ్ జాబితాలో పెట్టి ఐదేళ్లపాటు వేధించింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఆ భూములను అసైన్డ్ చెర నుంచి తప్పించింది. సాధారణ రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్ల తరహాలో వీటికి కూడా సర్వహక్కులూ కల్పించింది.

### తప్పుడు ప్రచారంతో దగా

సీఆర్డీఏ ఒప్పందం ప్రకారం రైతులకు రిటర్నబుల్ ప్లాట్లను ప్రభుత్వం చట్టపరంగా రిజిస్టర్ చేసి అందిస్తోంది. అలా ఇచ్చే క్రమంలో రైతులు ప్రభుత్వానికి ఇచ్చిన భూమి స్వభావం అనే కాలమ్ వద్ద 'అసైన్డ్' అని నమోదు చేస్తోంది. ఈ పదాన్ని అడ్డం పెట్టుకుని దళారులు రైతులను మోసం చేస్తున్నారు. రైతులకు ప్రభుత్వం ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లకు 'అసైన్డ్' స్వభావం ఉంటుందని చెప్పి, వాటికి ఎలాంటి హక్కులూ సంక్రమించవని, బ్యాంకుల నుంచి రుణాలు రావని చెబుతూ రేట్లు తెగ్గోస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం సీఐడీ విచారణ పేరుతో చేసిన నిర్వాకమే అసైన్డ్ రైతుల పాలిట శాపంగా మారింది. విచారణ పేరుతో వారి పొలాలను నాట్ ట్యాలీడ్ జాబితాలో పెట్టింది. దీన్ని ఆసరా చేసుకుని వైసీపీ ప్రభుత్వంలో గజం రూ.35 వేలు ఉన్న స్థలాలను రూ.10, 12వేలకు దళారులు కొల్లగొట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అదే పద్ధతిలో రైతులను దోపిడీ చేయాలని చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం సీఐడీ కేసులు తొలగించి, నాట్ ట్యాలీడ్ జాబితా నుంచి అసైన్డ్ పొలాలకు విముక్తి కల్పించాక కూడా గత ప్రభుత్వం పెట్టిన కేసుల వంకలను చూపి రైతులను దగా చేస్తున్నారు. ప్రభుత్వం మారితే మళ్లీ సమస్యలు వస్తాయని, అసైన్డ్ రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు ఎప్పటికైనా ఇబ్బంది తప్పదని, వాటి రిజిస్ట్రేషన్లు చెల్లవని దళారులు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఏడేళ్ల పాటు కౌలు ఇచ్చిన తరువాత అసైన్డ్ రైతుల కౌలు ఆగిపోయి, నాట్ ట్యాలీడ్ జాబితాలో పడడాన్ని ఉదాహరణగా చూపిస్తూ, మళ్లీ అలాంటి సమస్యలే వస్తాయని రైతుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారు.

- గుంటూరు, ఆంధ్రజ్యోతి

### సీఆర్డీఏ స్పందించాలి..

రాజధాని గ్రామాల్లో ప్రస్తుతం గజం భూమి ధర రూ.50 నుంచి 70 వేల వరకూ పలుకుతోంది. కురగల్లు, నీరుకొండ, కృష్ణాయపాలెం, మందడం ప్రాంతాల్లో గజం స్థలం రూ.50 వేలు ఉండగా.. విట్, ఎస్ఆర్ఎం విద్యాలయాల సమీపంలో, కోర్ క్యాపిటల్లో గజం స్థలం రూ.70 వేలు పలుకుతోంది. దళారులు తప్పుడు ప్రచారాలతో ఆ భూములను 40, 50 వేలకే కాజేస్తున్న ఉదంతాలు అనేకం కనిపిస్తున్నాయి. ఒకే లే అవుట్, ఒకే సర్వే నెంబరులో ప్లాట్లు వచ్చిన సాధారణ, అసైన్డ్ రైతుల ప్లాట్ల ధరల్లో రూ.10 నుంచి 20 వేలు తేడా కనిపిస్తోంది. ఇలా తొలుత అసైన్డ్ రైతుల ప్లాట్ల ధరలు తగ్గించి, ఆ ధరను చూపి సాధారణ రైతుల ప్లాట్ల ధరలను కూడా తగ్గించేందుకు అక్రమార్కులు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఆర్డీఏ వైపు నుంచి రిటర్నబుల్ ప్లాట్లపై స్పష్టమైన ప్రకటన రావాలని రైతులు కోరుతున్నారు. తద్వారా గందరగోళం తొలగిపోతుందని, దళారుల ఆట సాగదని రైతు నేతలు భావిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గవర్నర్‌కు వీడ్కోలు పలుకుతున్న మంత్రి ఫరూక్, ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి, కలెక్టర్ రాజకుమారి

### మల్లన్నను దర్శించుకున్న గవర్నర్

శ్రీశైలం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ దంపతులు సోమవారం రాత్రి శ్రీశైలంలో భ్రమరాంబ, మల్లికార్జునస్వామి వార్లను దర్శించుకున్నారు. కాగా, శ్రీశైలంలో రెండురోజుల పర్యటనను పూర్తి చేసుకున్న గవర్నర్ మంగళవారం ఉదయం సున్నిపెంట నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో విజయవాడ వెళ్లారు.

### సీపీఎస్ ఉద్యోగులకు 'పెట్టుబడి' ఆప్షన్లు

అమరావతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగులకు వారి ఫండ్‌ను ఎక్కడ పెట్టుబడి పెట్టాలో ఎంపిక చేసుకునే అవకాశం కల్పిస్తూ ఆర్థిక శాఖ కార్యదర్శి ఎం.జానకి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. సీపీఎస్ ఉద్యోగులకు ప్రతినెలా వారి జీతం నుంచి 10శాతం సొమ్మును కంట్రిబ్యూటరీ పెన్షన్ ఫండ్ పేరుతో వినహాయిస్తారు. దీనికి ప్రభుత్వం మరో 10 శాతాన్ని కలుపుతుంది. ఈ మొత్తం సొమ్మును ఇప్పటి వరకు ఎస్‌బీఐ, ఎల్ఐసీ, యూటీఐ పెట్టుబడి ఫండ్స్‌లోనే ఇన్వెస్ట్ చేసేవారు. కానీ, ఇప్పుడు ఉద్యోగి తన ఇష్టప్రకారం ప్రైవేట్ పెట్టుబడి సాధనాలతో సహా ఇతర ప్రభుత్వ సాధనాల్లోనూ పెట్టుబడి పెట్టుకోవచ్చు. ప్రతి ఆర్థిక సంవత్సరంలో రెండుసార్లు ఈ ఎంపిక చేసుకోవచ్చు. ఏ పెట్టుబడి సాధనాన్ని ఎంచుకోని ఉద్యోగుల ఫండ్‌ను డిఫాల్ట్‌గా ఉన్న ఎల్ఐసీ, యూటీఐ, ఎస్‌బీఐ ఫండ్స్‌లో పెట్టుబడి పెడతారు.

### ఓటు వేసేందుకు అవకాశం కల్పించండి

- ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘాలు విజ్ఞప్తి

తెనాలి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 16 జిల్లాలలో ఎమ్మెల్సీ ఎన్నికలు ఉన్నందున ఆయా జిల్లాల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేక అనుమతులు, సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘాలు ఎన్నికల సంఘానికి, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొలసాని తులసీ విష్ణుప్రసాద్, ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్-(డెమోక్రటిక్) అధ్యక్షుడు గొల్లపూడి మోహనరావు, ఇండిపెండెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌బాబు మంగళవారం దీనిపై ఉమ్మడి ప్రకటన చేశారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలను అందించినట్టు పేర్కొన్నారు.

# వాస్తవాలు దాచేందుకు మరిన్ని తప్పులు

- సోషల్ మీడియా పోస్టుల కేసులో రమణ అరెస్టుపై విశాఖ సీపీ, ప్రకాశం ఎస్పీ భిన్న వివరాల సమర్పణ
- రాతపూర్వక ఉత్తర్వులు ఇస్తేనే నివేదిక ఇస్తారా?
- డీజీపీ పోస్టుపై గౌరవంతో హాజరుకు ఆదేశించట్లేదు
- పోలీసులపై హైకోర్టు అసహనం.. ఘాటు వ్యాఖ్యలు

అమరావతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా అనుచిత పోస్టుల వ్యవహారంలో నిందితుడు బోస రమణ అరెస్టుపై పోలీసులు వాస్తవాలు చెప్పకుండా దాచిపెట్టేందుకు మరిన్ని తప్పులు చేస్తున్నారని హైకోర్టు మంగళవారం ఘాటుగా వ్యాఖ్యానించింది. రమణను విశాఖలోని ఆయన ఇంటి వద్ద ప్రకాశం జిల్లా పొదిలి పోలీసులు అరెస్టు చేశారని విశాఖ పోలీస్ కమిషనర్.. విశాఖలోని ఎంవీపీ పోలీస్‌స్టేషన్ వద్ద అరెస్టు చేసినట్లు ప్రకాశం జిల్లా ఎస్పీ భిన్నమైన వివరాలు సమర్పించడంపై అసహనం వ్యక్తం చేసింది. రమణ అరెస్ట్‌పై డీజీపీ నివేదిక దాఖలు చేయకపోవడాన్ని ఆక్షేపించింది. కేసు సున్నితత్వాన్ని దృష్టిలో పెట్టుకొని నివేదిక సమర్పించాలని కోరామని, అయితే డీజీపీ పోస్టుపై ఉన్న గౌరవంతో తమ ముందు హాజరుకు ఆదేశాలు ఇవ్వకుండా ఆగుతున్నామని పేర్కొంది. రాతపూర్వక ఉత్తర్వులు ఇస్తేనే నివేదిక దాఖలు చేస్తామంటే అందుకు సిద్ధమని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది అందుబాటులో లేకపోవడంతో సహాయ ప్రభుత్వ న్యాయవాది అభ్యర్థన మేరకు విచారణను మార్చి 11కి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావు ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. తన భర్త బోస రమణను పొదిలి పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, ఆయన్ను కోర్టు ముందు హాజరుపర్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ బోస లక్ష్మి గత ఏడాది నవంబరులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. ఇటీవల విచారణ జరిపిన న్యాయస్థానం.. రమణ అరెస్ట్‌పై నివేదిక ఇవ్వాలని ప్రకాశం జిల్లా ఎస్పీ, వైజాగ్ సీపీని ఆదేశించింది. ఈ వ్యవహారంపై దృష్టి సారించాలని డీజీపీకి స్పష్టం చేసింది. కాగా, మంగళవారం విచారణలో విశాఖ సీపీ దాఖలు చేసిన నివేదికలో పొదిలి పోలీసులు రమణను విశాఖలోని ఆయన ఇంటి వద్ద అరెస్టు చేసి విశాఖ ఎంవీపీ పోలీస్ స్టేషన్‌కు తరలించారని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా ఎస్పీ సమర్పించిన నివేదికలో నోటీసులు ఇచ్చేందుకు రమణ ఇంటికి వెళ్లగా.. బంధువులు, కుటుంబసభ్యులు గొడవ చేశారని, దీంతో అతన్ని ఎంవీపీ పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, అక్కడకు కూడా వచ్చి గొడవ చేయడంతో రమణను అరెస్టు చేసి పొదిలికి తరలించినట్లు పేర్కొన్నారు. మరోవైపు తన భర్తను పోలీసులు అక్రమంగా నిర్బంధించారని వర్రా రవీందర్‌రెడ్డి భార్య కళ్యాణి వేసిన పిటిషన్‌లో కడప జిల్లా అప్పటి ఇంచార్జి ఎస్పీ విద్యాసాగర్ నాయుడిని హైకోర్టు సుమోటో ప్రతివాదిగా చేర్చింది. ఎస్పీ విద్యాసాగర్‌పై కేసులోని సహ నిందితులు(థర్డ్ పార్టీ) నిర్దిష్ట ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో తన వాదన వినిపించేందుకు వీలుగా ఆయన్ను ప్రతివాదిగా చేరుస్తున్నట్లు పేర్కొంది. కౌంటర్ వేయాలని ఆదేశిస్తూ విచారణను మార్చి 10కి వాయిదా వేసింది.

## బెయిల్ పిటిషన్లు ఉపసంహరణ

- కల్తీ నెయ్యి కేసులో అనూహ్య పరిణామం
- పిటిషన్లు వెనక్కి తీసుకున్న ఇద్దరు నిందితులు
- మరో నిందితుడి పిటిషన్, సిట్ కస్టడీ పిటిషన్లపై విచారణ రేపటికి వాయిదా

తిరుపతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసులో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఏ3, ఏ4 నిందితులుగా ఉన్న పొమిల్ జైన్, విపిన్ జైన్ తమ బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. మంగళవారం తిరుపతి 2వ ఏడీఎం కోర్టులో ఈ పిటిషన్లపై విచారణ జరగాల్సి ఉండగా ఆ ఇరువురూ బెయిల్ పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నారు. ఈ కేసులో ఏ2 నిందితుడుగా ఉన్న ఏఆర్ డెయిరీ ఎండీ రాజశేఖరన్ బెయిల్ పిటిషన్‌ను సోమవారం తిరస్కరించిన విషయం తెలిసిందే. మిగిలిన ఏ3, ఏ4, ఏ5 నిందితుల బెయిల్ పిటిషన్లపై మంగళవారం విచారణ జరగాల్సిన తరుణంలో ఏ3, ఏ4 నిందితుల తరఫు న్యాయవాదులు బెయిల్ పిటిషన్ వెనక్కు తీసుకుంటున్నట్లు కోర్టుకు నివేదించారు. ఇక ఏ5 నిందితుడు అపూర్వ వినయ్‌కాంత్ చావడా బెయిల్ పిటిషన్‌పై విచారణను వాయిదా వేయాలని న్యాయవాదులు కోరిన మీదట తదుపరి విచారణను జడ్జి గురువారానికి వాయిదా వేశారు. కాగా ఏ3, ఏ5 నిందితుల కస్టడీ కోరుతూ సిట్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా మంగళవారం జరగాల్సిన విచారణ వాయిదా పడింది. నిందితుల తరఫు న్యాయవాదులు అభ్యర్థన మేరకు తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేశారు.

## తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక ఘటనలపై దర్యాప్తు చేయించండి

- హైకోర్టులో మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామి పిల్

అమరావతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా జరిగిన ఘటనలపై సీబీఐ దర్యాప్తు లేదా ఒక కమిటీని నియమించి హైకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేయించాలని లేదా రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తితో దర్యాప్తు చేయించాలని కోరుతూ మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామి మంగళవారం హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఫిబ్రవరి 3, 4 తేదీల్లో జరిగిన ఘటనల్లో పోలీసులు, ఎన్నికల అధికారుల పాత్రపై దర్యాప్తు చేసేందుకు సిట్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వ అధికారుల (పోలీసులు, ఎన్నికల అధికారుల) పాత్రపై మార్గదర్శకాలు రూపొందించేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. హోంశాఖ ముఖ్యకార్యదర్శి, రాష్ట్ర డీజీపీ, ఏపీ ఎన్నికల సంఘం, కేంద్ర ఎన్నికల సంఘం, సీబీఐ, కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ కార్యదర్శిలను ప్రతివాదులుగా చేర్చారు.

### వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలి: సుబ్రమణ్యస్వామి

పిల్ దాఖలు అనంతరం సుబ్రమణ్యస్వామి మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీగా వైసీపీ మాత్రమే ఉందని, తగినంత మంది ఎమ్మెల్యేలు లేనప్పటికీ, ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా ఇవ్వడంలో తప్పు లేదన్నారు. తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా ప్రజా ప్రతినిధులపై దాడులు జరగడం దురదృష్టకరమన్నారు. తాను వేసిన పిల్ మార్చి 12న విచారణకు వస్తుందన్నారు.

## పొగాకు బోర్డులో ముగ్గురు ఎంపీలకు సభ్యత్వం

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పొగాకు బోర్డులో ముగ్గురు పార్లమెంట్ సభ్యులకు సభ్యత్వం కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. లోక్‌సభ నుంచి డీ ఎం కతీర్ ఆనంద్, పుట్టా మహేష్, రాజ్యసభ నుంచి డాక్టర్ కే లక్ష్మణ్‌ని బోర్డు సభ్యులుగా నియమించింది. ఈ ముగ్గురు ఎంపీలు మూడేళ్ల పాటు బోర్డు సభ్యులుగా కొనసాగుతారని కేంద్ర వాణిజ్య శాఖ అదనపు సెక్రెటరీ రాజేష్ అగర్వాల్ పేర్కొన్నారు.

## తిరుమలలో బాలుడి మరణంపై జగన్ మీడియా దుష్ప్రచారం

- గుండెపోటుతో మరణిస్తే తొక్కిసలాటలో మృతి అంటూ కథనాలు
- తప్పుడు వార్తలు ప్రసారం చేస్తే చర్యలు: టీటీడీ

తిరుమల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మీద, టీటీడీ మీద బురదచల్లడమే లక్ష్యంగా పెట్టుకున్న జగన్ మీడియా తాజాగా ఒక తప్పుడు వార్త ప్రసారం చేసి నవ్వులపాలైంది. తిరుమల అన్నదాన సత్రంలో తొక్కిసలాటలో ఒక బాలుడు మృతి చెందాడంటూ వార్త ప్రసారం చేసింది. నిజానికి మంజునాథ్(16) గుండెపోటుతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. ఆ విషయాన్ని మంగళవారం టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి మీడియాకు వెల్లడించారు. కర్నాటకలోని మడికెరకు చెందిన మల్లేష్, నాగరత్నమ్మ కుటుంబం శనివారం తిరుమలకు వచ్చారు. అదేరోజు అన్నదాన కేంద్రానికి వెళ్లినప్పుడు ర్యాంప్‌పై పరుగు తీస్తున్న వారి కుమారుడు మంజునాథ్ హఠాత్తుగా కుప్పకూలిపోయాడు. తిరుపతిలోని స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంజునాథ్ మంగళవారం మృతి చెందాడు. జగన్ మీడియాతో పాటూ సోషల్ మీడియాలో కూడా ఈ వార్తపై అసత్య ప్రచారం కావడంతో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అన్నదాన కేంద్రంలోని సీసీ టీవీ ఫుటేజిని మీడియాకు చూపించారు. బాలుడి తల్లిదండ్రులే తమ బిడ్డకు గుండె సంబంధిత సమస్య ఉందని అంగీకరించి పోస్టుమార్టం కూడా వద్దని చెప్పి మృతదేహన్ని తీసుకెళతామని తెలిపారన్నారు. టీటీడీపై బురదజల్లే విధంగా తప్పుడు వార్తలు ప్రచురించి అవాస్తవాలు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టీటీడీ ఒక ప్రకటనలో హెచ్చరించింది.

### జనసేనలోకి వైసీపీ కార్పొరేటర్లు

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తనయుడు వినీత్ రెడ్డితో సహ ఒంగోలు, తిరుపతికి చెందిన 26 మంది వైసీపీ కార్పొరేటర్లు జనసేన పార్టీలో చేరారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జనసేన అధినేత పవన్ కల్యాణ్ వీరందరికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.



ఒంగోలు కార్పొరేషన్‌లో వైసీపీకి చెందిన కార్పొరేటర్లను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన జనసేనాని పవన్ కల్యాణ్. చిత్రంలో మాజీ మంత్రి బాలినేని తదితరులు

### భక్తులను మోసగిస్తే కఠిన చర్యలు

- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు హెచ్చరిక

తిరుమల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులను దర్శనాల పేరుతో మోసగిస్తే కఠిన చర్యలు తప్పవని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు హెచ్చరించారు. ఎన్ఆర్ఐ భక్తులకు శ్రీవారి దర్శన టికెట్లు ఆశజూపి నగదు వసూలు చేస్తున్నట్టు ఎన్ఆర్ఐ భక్తుడు గోపాల్‌రాజ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. ప్రసాద్ అనే పేరుతో టీటీడీ పీఆర్వో అని చెప్పుకుంటూ, చైర్మన్ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకుని...తిరుమల సమాచారం అనే గ్రూప్ ద్వారా ఈ తంతు జరుగుతున్నట్టు ఫిర్యాదు చేశారు. దీనిని బీఆర్ నాయుడు తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అధికారులను ఆదేశించారు. వింగ్ సిబ్బంది బాధితుడి నుంచి చేపట్టిన వివరాల ఆధారంగా నిందితుడు హైదరాబాదులోని ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ జావేద్ ఖాన్‌గా గుర్తించారు. విజిలెన్స్ ఫిర్యాదుతో తిరుమల టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో నిందితుడు వాట్సాప్ గ్రూప్ ద్వారా ఎన్ఆర్ఐ భక్తుల నుంచి దర్శనం పేరుతో భారీ మొత్తంలో వసూలు చేస్తూ, డబ్బు ముట్టాక వారిని గ్రూప్ నుంచి తొలగిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు.

### కర్నూలుకు సంజీవయ్య పేరు పెట్టండి

- పవన్‌ను కోరిన మాజీ ఎంపీ హనుమంతరావు

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించి విలువైన సేవలు అందించిన దామోదరం సంజీవయ్య పేరును కర్నూలు జిల్లాకు పెట్టాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మంగళగిరిలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయన పవన్ కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీని సత్కరించిన డిప్యూటీ సీఎం పవన్ ఆయనకు జ్ఞాపికను అందించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# జర్మనీలో మార్పు

జర్మనీ ఓటర్లు మితవాదులను గెలిపించారు. వలసలు, మందగించిన ఆర్థికాభివృద్ధి, ఉక్రెయిన్ సంక్షోభం ప్రధాన అంశాలుగా ఆదివారం నాడు బండేస్టాగ్ (పార్లమెంటు)కు జరిగిన ఎన్నికలలో మితవాద పక్షాలు అయిన సిడియు–సిఎస్‌యులకు 29 శాతం ఓట్లు రాగా కరడుగట్టిన మితవాద పక్షం ఎఎఫ్‌డి 21 శాతం ఓట్లతో ద్వితీయ స్థానంలో ఉన్నది. ఎన్నికలకు ముందు ఆపద్ధర్మ ప్రధానిగా ఉన్న ఒలాఫ్ షోల్జ్ నాయకత్వంలోని సోషల్ డెమొక్రాటిక్ పార్టీకి కేవలం 16 శాతం ఓట్లు మాత్రమే లభించాయి. క్రిస్టియన్ డెమొక్రాటిక్ పార్టీ–క్రిస్టియన్ సోషల్ యూనియన్ కూటమి నాయకుడు ఫ్రీడిష్ మెర్జ్ ఎస్‌డిపి భాగస్వామ్యంతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశమున్నది. 'యూరోపియన్ దేశాలు అమెరికాపై ఆధారపడకుండా స్వతంత్రంగా వ్యవహరించగలిగేలా చేయడమే తన లక్ష్యమని' ఫలితాలు వెలువడిన అనంతరం మెర్జ్ ప్రకటించారు.

నయా నాజీ మూలాలు ఉన్న ఎఎఫ్‌డి, ఉదారవాద పార్టీ గ్రీన్స్, బిఎస్‌డబ్ల్యు, వామపక్ష పార్టీ డి లింకె లకు గతంలో కంటే ఓట్ల శాతం పెరుగుదల ప్రధానస్రవంతి క్రిస్టియన్, సోషల్ డెమొక్రాటిక్ పార్టీల పట్ల ఓటర్ల అసంతృప్తిని ప్రతిబింబిస్తోంది. యూరోపియన్ యూనియన్‌లో తమ భవిష్యత్తు విషయమై తూర్పు, పశ్చిమ జర్మనీ ప్రజల మధ్య, పేదలు–సంపన్నుల మధ్య పట్టణ–గ్రామీణ ప్రాంతాల ఓటర్ల దృక్పథాల మధ్య తేడాలు ఎంతగా ఉన్నాయో ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయి.

సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో ఎఎఫ్‌డి సహకారాన్ని తీసుకోవడానికి మెర్జ్ నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నారు. ఓట్ల నిష్పత్తి ప్రకారం సిడియు–సిఎస్‌యు–ఎస్‌డిపిలకు బండేస్టాగ్‌లో 328 సీట్లు మాత్రమే లభిస్తాయి. 630 సీట్లుగల పార్లమెంటులో ఇది స్వల్ప మెజారిటీ మాత్రమే. సంకీర్ణ ప్రభుత్వ పార్టీలు తమ వాగ్దానాలను నెరవేర్చడంలో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవలసిరావచ్చు. అటువంటి పరిస్థితులనే ఎఎఫ్‌డి ఆశిస్తున్నది. జర్మనీ చరిత్రలోని నాజీ గతాన్ని సమర్థించే ఈ పార్టీని 2013లో సిడియు విధానాలతో విభేదించిన ఆ పార్టీ ప్రముఖులు కొంతమంది ఏర్పాటు చేశారు. ఇటీవల ఈ పార్టీకి ప్రపంచ కుబేరుడు, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సన్నిహితుడు ఎలాన్ మస్క్ బహిరంగంగా మద్దతు నివ్వడం, అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ ఎలీస్ వీడెల్‌తో సమావేశమై మద్దతునివ్వడం ఈ ఎన్నికలలో ఎఎఫ్‌డి ఓట్ల శాతం పెరుగుదలకు దోహదం చేశాయి. ఈ పార్టీకి ప్రధానంగా యువ వోటర్ల మద్దతు లభించడమే పరిశీలకులను కలవరపరుస్తోంది. తదుపరి పార్లమెంటరీ ఎన్నికలలో ఎఎఫ్‌డి ప్రథమ స్థానంలో నిలిస్తే జర్మనీ రాజకీయాలు పెనుమార్పులకు లోనవుతాయి. 'అవ్యవస్థకు నిగూఢ మార్గాలు జర్మన్లకు సుపరిచితమైనవ'ని తాత్త్వికుడు ఫ్రెడరిఖ్ నీషే అన్న మాటను ఎఎఫ్‌డి ఉత్థానం మరోసారి రుజువు చేస్తుందేమో?!

వలసకారులను నిరోధించేందుకు జర్మనీ సరిహద్దులను మూసివేయాలని, యూరోపియన్ యూనియన్ నుంచి వైదొలగాలని వాదించే ఎఎఫ్‌డి లాంటి పార్టీ ప్రాబల్యం పెరగడం ఈయూ భవిష్యత్తుకు మేలు చేయదనే ఆందోళన జర్మనీలో బాగా వ్యక్తమవుతున్నది. అయినప్పటికీ పార్లమెంటరీ ఎన్నికలలో ఆ పార్టీ తన ఓట్ల శాతాన్ని అంతకంతకూ పెంచుకోవడం, అమెరికా పాలకులు ఆ పార్టీకి మద్దతునివ్వడం ఈయూకు తీవ్ర సవాళ్లను సృష్టించనున్నది.

'ఐరోపా హృదయం'గా ఫ్రెంచ్‌వారు సైతం గౌరవించే జర్మనీ వాతావరణ మార్పుపై పోరు, స్వచ్ఛ ఇంధనానికి పరివర్తన వ్యవహారాలలో ప్రపంచ నాయకురాలు. 2030 నాటికి హరిత గృహ వాయువుల ఉద్గారాన్ని 65 శాతం మేరకు తగ్గించుకోవడంలో గణనీయమైన పురోగతి సాధించిన దేశం జర్మనీ. అయితే ఈ ఆదర్శప్రాయమైన కార్యాచరణ క్లైమేట్ ఛాన్సలర్‌గా పేరు పొందిన ఏంజెలా మెర్కెల్ హయాం అనంతరం మందగించింది. ఇటీవలి ఎన్నికలలో వాతావరణ మార్పునిరోధం అంశం పెద్దగా ప్రాధాన్యం పొందలేదు. ప్రజల అభిప్రాయాలలో మార్పును గమనించిన రాజకీయ పక్షాలు పర్యావరణ భద్రతను ఉపేక్షిస్తున్నాయి. ఎఎఫ్‌డి అయితే డొనాల్డ్ ట్రంప్ వలే వాతావరణ మార్పును ఒక మిథ్యగా భావిస్తోంది. అమెరికా మాదిరిగానే జర్మనీ కూడా పారిస్ ఒడంబడిక నుంచి వైదొలగాలని డిమాండ్ చేస్తోంది. వాతావరణ మార్పుపై పోరుకు పేద దేశాలకు 100 కోట్ల డాలర్ల ఆర్థిక సహాయన్ని అందిస్తానన్న జర్మనీ మిగతా యూరోపియన్, ఇతర సంపన్న దేశాల వలే ఆ వాగ్దానాన్ని పూర్తిగా నెరవేర్చనేలేదు. నిధుల కొరతతో పాటు ప్రజల నుంచి వస్తోన్న వ్యతిరేకత కారణంగానే పర్యావరణ భద్రతను జర్మనీ ఉపేక్షిస్తోంది.

# 'ఉక్కుచట్రం'కు అవినీతి తుప్పు!



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్


'రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదువా?' అన్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ తలుచుకుంటే జరగనిది ఏమీ ఉండదని చెప్పవచ్చు. గత వారం ప్రధానమంత్రి తన కార్యాలయంలో రెండవ ప్రిన్సిపల్ సెక్రటరీగా శక్తికాంత దాస్‌ను నియమించారు. ఇలా ఒక ప్రిన్సిపల్ సెక్రటరీ ఉండగా మరొకరిని అదే హోదాలో నియమించడం ఇదే మొదటిసారి. శక్తికాంత దాస్‌ను ప్రధానమంత్రి కార్యాలయంలో నియమించడంలో పెద్ద ఆశ్చర్యం లేదు. రిజర్వు బ్యాంకుకు స్వతంత్ర ప్రతిపత్తిని ఆశిస్తూ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించిన రఘురామరాజన్, ఊర్జిత్ పటేల్ వంటి ఆర్థిక వేత్తలు ఎక్కువ కాలం రిజర్వు బ్యాంకు గవర్నర్ పదవిలో కొనసాగలేకపోయిన తర్వాత ప్రవేశించిన శక్తికాంత దాస్ తన శక్తివంచన లేకుండా ప్రభుత్వ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేసినందువల్లే ఆయన ఆరు సంవత్సరాలు రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా కొనసాగగలిగారు. అంతకు ముందు ఫైనాన్స్ సెక్రటరీగా ఆయన పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వంటి కీలక నిర్ణయాలకు కారకుడయ్యారు. ఈ రెండు నిర్ణయాల వల్ల మాత్రమే కాదు, కోవిడ్ వల్ల కూడా దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా ఆయనే చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. రిజర్వులను మళ్లించడం వంటి ప్రభుత్వ విధానాలపై పెద్దగా విభేదించకుండా, రిజర్వు బ్యాంకు బోర్డులో ఎవర్ని నియమిస్తున్నారన్న అంశాలపై దృష్టి కేంద్రీకరించకుండా జీడీపీ, ద్రవ్యోల్బణం, బ్యాంకులకు రుణాల ఎగవేత, నిరర్థక ఆస్తులు, భారీ ఎత్తున ప్రభుత్వ వ్యయం పెరగడం, పెరిగిపోతున్న ఆర్థిక లోటు మొదలైన అంశాలపై అంతగా ఆందోళన చెందకుండా, అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి విలువ పడిపోతున్నా చెక్కుచెదరకుండా 'ఎప్పటికెయ్యది ప్రస్తుతం' అన్నధోరణిలో వ్యవహరించినందువల్లే శక్తికాంత దాస్ కేంద్రానికి అత్యంత సన్నిహితుడు అయ్యారు. ఐఏఎస్ అధికారుల్లో 'నొప్పించి తానొవ్వక' అన్నట్లు ప్రభుత్వ ఆలోచనా విధానానికి అనుగుణంగా పనిచేసినవారే విజయవంతం కాగలుగుతారు. అలాంటి వారిలో శక్తికాంత దాస్ ఒకరని చెప్పక తప్పదు. ఇప్పుడు ఆయన ప్రధానమంత్రి కార్యాలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలకు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు దిశానిర్దేశం చేస్తారనడంలో సందేహంలేదు.

శక్తికాంత దాస్‌కు ముందు రిజర్వు బ్యాంకు గవర్నర్‌లుగా ఉన్న వై.వేణుగోపాల్ రెడ్డి, దువ్వూరి సుబ్బారావు, రఘురామ రాజన్, ఊర్జిత్ పటేల్ బ్యాంకు స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడేందుకు తీవ్ర యత్నాలు చేశారు. పెద్ద నోట్ల రద్దు గురించి పార్లమెంటరీ కమిటీలో చర్చకు వచ్చినప్పుడు 'ఈ నిర్ణయం గురించి మీతో ప్రభుత్వం చర్చించిందా?' అని ఆ కమిటీ చైర్మన్‌గా ఉన్న కాంగ్రెస్ ఎంపీ వీరప్ప మొయిలీ ఊర్జిత్ పటేల్‌ను ప్రశ్నించారు. ఊర్జిత్ పటేల్ జవాబివ్వకముందే ఆ కమిటీలో సభ్యుడుగా ఉన్నమాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జోక్యం చేసుకుని 'ఈ ప్రశ్నకు మీరు సమాధానమివ్వనక్కర్లేదు' అని స్పష్టంగా చెప్పారు. తాను ఒక సంస్థగా రిజర్వు బ్యాంకు ప్రతిష్ఠను కాపాడేందుకే అలా చేశానని మన్మోహన్ సింగ్ వివరించారు. మన్మోహన్ సింగ్ కూడా ఒకప్పుడు రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా ఉన్నందువల్ల సంస్థ పరువు కాపాడాలని భావించారు. కాని సంస్థల పరువు ప్రతిష్ఠల గురించి ఇప్పుడెవరు పట్టించుకుంటారు?

ఎన్నికల రాజకీయాలకు అనుగుణంగా చర్యలు తీసుకునే ప్రభుత్వాధినేతలు ఉన్నంత వరకూ ప్రభుత్వానికి పెద్దగా ఆర్థికవేత్తలతో పని ఉండదు. ఆర్థికవేత్తలు ఆర్థిక సుస్థిరత గురించి ఆలోచిస్తారు. రిజర్వు బ్యాంకు సంస్థాగత స్వతంత్రత కోల్పోయిందని ప్రముఖ ఆర్థికవేత్త, రిజర్వు బ్యాంకు మాజీ ఛైర్మన్ యాగా వేణుగోపాల్‌రెడ్డి ఒక సందర్భంలో ఆవేదన వ్యక్తపరిచారు. స్వతంత్రత అంటే ప్రభుత్వం నుంచి స్వతంత్రత కాదని, ప్రభుత్వ వ్యవస్థల్లో భాగంగా స్వతంత్రంగా వ్యవహరించాలనే నెహ్రూ నిర్వచనాన్ని అంగీకరించిన వేణుగోపాల్‌రెడ్డి ప్రపంచమంతా బ్యాంకింగ్ వ్యవస్థ సంక్షోభాన్ని ఎదుర్కొన్నా భారతదేశంలో పెద్దగా సమస్యలు లేకుండా చూశారు. రికార్డు స్థాయిలో మూడేళ్ల పాటు 9.5 శాతం జీడీపీని సాధించారు. ద్రవ్యోల్బణం 4.4 శాతం నుంచి 6.6 శాతం మధ్య ఉండేలా చూశారు.' అమెరికా సెంట్రల్ బ్యాంకుకు కూడా ఇలాంటి అధినేత ఉంటే మా ఆర్థిక వ్యవస్థ ఇంత గందరగోళంగా ఉండేది కాదు' అని ఆ దేశ ఆర్థికవేత్త జోసెఫ్ స్టిగ్లిజ్ సైతం వేణుగోపాల్‌రెడ్డిని ప్రశంసించారు. చిదంబరం, అరుణ్ జైట్లీ లాంటి వారితో కూడా స్పష్టంగా విభేదిస్తూ ఏది సరైనదో చెప్పగలిగిన వేణుగోపాల్‌రెడ్డి లాంటి ఐఏఎస్ అధికారులు చాలా అరుదుగా కనిపిస్తారు.

నిజానికి తమతో విభేదించినా అధికారులు సరైన విధంగా సలహా ఇస్తే స్వీకరించే ఉదాత్త వ్యక్తిత్వం గల నాయకులు కూడా రోజురోజుకూ తక్కువైపోతున్నారు. అంజయ్య హయాంలో సెక్రటరీగా ఉన్న యుబి రాఘవేంద్రరావుతో సమర్థులైన బృందాన్ని ఎన్టీఆర్ విశ్వాసంలోకి తీసుకుని తన ఆలోచనా విధానాలకు అనుగుణంగా పనిచేయించుకున్నారు. అధికారులు కూడా నిర్భయంగా ఆయన వద్ద తమ ఆలోచనలను పంచుకునేవారు. ఒక సమావేశంలో ఎన్టీఆర్ భారీ వార్షిక ప్రణాళిక కావాలనుకున్నారు. అందుకు అదనపు పన్నులు విధించాల్సి ఉంటుందని ప్రణాళికా బోర్డు డిప్యూటీ చైర్మన్‌గా ఉన్న విఠల్ చెప్పారట. ఎన్టీఆర్ అందుకు అంగీకరించలేదు. విఠల్ చేసిన సూచనలేవీ ఎన్టీఆర్‌కు నచ్చలేదు. 'విఠల్ గారూ, మీరు ప్రతిభాశాలి. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఆర్థిక నిపుణులు. మీరు కొత్త ఆలోచన లేవీ చెప్పలేరా.. లేదా ఎవరినైనా మంచి ఆలోచనలు చెప్పే వారిని సూచించండి' అని ఎన్టీఆర్ అడిగారు. 'అలా ఒక్కరే చేయగలరు..' అని విఠల్ అన్నారు. 'ఎవరాయన?' అని ఎన్టీఆర్ ఆశ్చర్యంతో అడిగారు. 'మీ వెనుకే ఉన్నారు చూడండి' అని అనేసరికి ఎన్టీఆర్ వెనక్కి తిరిగి చూశారట. వెనక గోడకు పటంలో వేంకటేశ్వరస్వామి మందహాసం చేస్తూ కనిపించారు! అలా ప్రధానమంత్రికి గానీ, ముఖ్యమంత్రులకు గానీ స్వేచ్ఛగా చెప్పగలిగిన అధికారులు ఎవరైనా ఉన్నారా?

రాజకీయ నాయకులు సరైన నిర్ణయాలు తీసుకునే విధంగా ఫైల్ నోట్స్ తయారు చేసి వివరించే అధికారులు తక్కువయిపోతున్నారని, పైగా తప్పులు చేసేందుకు నేతల్ని





సర్దార్ పటేల్ చెప్పినట్లు సివిల్ సర్వీస్‌ను ఒక ఉక్కుచట్రంలా భావించడానికి ఇప్పుడు ఎంతమాత్రమూ వీల్లేదు. అధికార వ్యామోహం లేని, అవినీతికి పాల్పడని ఎస్ఆర్ శంకరన్, యుగంధర్, కె.ఆర్. వేణుగోపాల్, అశోక్ ఖేమ్కా లాంటి అధికారులు వేళ్లపై లెక్కపెట్టగల సంఖ్యలో అప్పుడప్పుడు తటస్థిస్తారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాలనే పూర్తిగా వదుల్చుకోలేకపోతున్న మనకు అప్పటి వ్యవస్థలను వదిలించుకోవడం సాధ్యమా?

ప్రోత్సహించే అధికారులు ఎక్కువయిపోతున్నారని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక ఐఏఎస్ అధికారి ఆత్మకథను ఆవిష్కరిస్తూ వాపోయారు. శిక్షణా కాలంలోనే పంచాయితీలు చేసే అధికారులు కనపడుతున్నారని, ప్రజల్లోకి వెళ్లకుండా ఏసీ రూమ్‌లకే పరిమితమవుతున్నారని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి అయినప్పటి నుంచీ ఎవరు సరైన అధికారులో తేల్చుకోవడం, అందులో ఎవరు పాత ప్రభుత్వానికి అనుగుణంగా పనిచేస్తున్నారో కనిపెట్టడం రేవంత్‌కు సమస్యగా మారినట్లు కనిపిస్తోంది. మరో వైపు ఏపీలో ఎంతో అనుభవం ఉన్న చంద్రబాబునాయుడు తన ఆలోచనా విధానానికి అనుగుణంగా పనిచేసే అధికారులను అన్వేషించేందుకు కొద్ది నెలల నుంచి ప్రయత్నిస్తున్నారు. వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్న అయిదారు మంది సమర్థులైన అధికారులను రాష్ట్రానికి డిప్యూటేషన్‌పై పంపాల్సిందిగా ఆయన గత నవంబర్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లేఖ రాసినా ఫలితం కనపడడం లేదు.

మోదీ కూడా తాను చెప్పినట్లు నడుచుకునే అధికారుల కోసం అధికారంలో వచ్చినప్పటి నుంచీ అనేక ప్రయోగాలు చేస్తూనే ఉన్నారు. అందుకోసం ఆయన అవసరమైతే గుజరాత్ కేడర్ అధికారులపై కూడా ఎక్కువ ఆధారపడ్డారు. పికే మిశ్రా, శక్తికాంత దాస్ లాంటి వారు దొరకడం ఆయనకు కష్టమైపోయింది. అంతా ఐఏఎస్ అధికారులకే అప్పగించాలన్న ఆలోచన మోదీకి ఎప్పుడూ లేదు. కాని ఆయనకు కూడా ఐఏఎస్‌లపై ఆధారపడక తప్పడం లేదు. 'అంతా బాబూ (ఐఏఎస్)లే చేయాలా? ఐఏఎస్ అయితే ఎరువుల ఫ్యాక్టరీలు కూడా నడిపించగలుగుతారా, దేశాన్ని బాబులకు అప్పజెబితే మనమేం చేస్తాం..' అని ఒక సందర్భంలో మోదీ పార్లమెంట్‌లో వాపోయారు. అయినా ఐఆర్‌డిఏ, సెంట్రల్ ఎలెక్ట్రిసిటీ రెగ్యులేటరీ అథారిటీ, ఎన్నికల కమిషన్, సివిసి వంటి అనేక సంస్థలను ఆయన ఐఏఎస్‌లకే అప్పగించారు. కాకపోతే ఐఆర్ఎస్‌లకు పెద్ద పీట వేస్తున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే రాజకీయ నాయకులకు దక్కాల్సిన కీలకమైన మంత్రిపదవులను కూడా ఆయన సివిల్ సర్వీసు నుంచి వచ్చిన అయిదారు మందికి అప్పగించారు. బాబులే అయితే విధేయంగా పనిచేస్తారని, నిబంధనలు విధించడం మాత్రమే కాదు, వాటిని ఎలా ఉల్లంఘించాలో అన్న విషయం కూడా వారికి తెలుసునని మోదీకి తెలియనిది కాదు. మోదీని మెప్పించే ఫైలును ఎలా తయారు చేయాలో అన్న కళను ఢిల్లీలో అధికారులు ఈ పదేళ్లలో క్రమంగా నేర్చుకున్నారు. క్రమంగా దేశ రాజధానిలో వ్యవస్థలు అణకువగా పనిచేయడం అలవాటు చేసుకున్నాయి.

ఐఏఎస్‌లు అవినీతిపరులా కాదా అన్నది పెద్దగా చర్చకు తావులేకుండా పోయింది. ఇటీవల ఒక ముఖ్యమంత్రి సేకరించిన అంతర్గత సమాచారం ప్రకారం అధికారులను సమర్థులు, అసమర్థులు, అవినీతిపరులుగా గుర్తించారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే మూడో కేటగరీలో అత్యధికులు ఉన్నారు. వారికే ఢిల్లీలో ఎక్కువ పలుకుబడి ఉన్నట్లు తేలింది. అధికారుల్లో అవినీతి గురించి తెలంగాణ సిఎం మాట్లాడకముందే రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు తన ఆత్మకథలో 50 శాతం మంది ఐఏఎస్‌లు అసమర్థులని, 25 శాతం మంది సమర్థులని, మిగతా 25 శాతం పూర్తిగా అవినీతిపరులని రాశారు. సర్దార్ పటేల్ చెప్పినట్లు సివిల్ సర్వీస్‌ను ఒక ఉక్కుచట్రంలా భావించడానికి ఇప్పుడు ఎంతమాత్రమూ వీల్లేదు. అధికార వ్యామోహం లేని, అవినీతికి పాల్పడని ఎస్ఆర్ శంకరన్, యుగంధర్, కె.ఆర్. వేణుగోపాల్, అశోక్ ఖేమ్కా లాంటి అధికారులు వేళ్లపై లెక్కపెట్టగల సంఖ్యలో అప్పుడప్పుడు తటస్థిస్తారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాలనే పూర్తిగా వదుల్చుకోలేకపోతున్న మనకు అప్పటి వ్యవస్థలను వదిలించుకోవడం సాధ్యమా?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

# డబుల్ ఇంజిన్ సర్కార్‌ను కోరుకున్న ఢిల్లీ ప్రజలు

భారత ప్రజాస్వామ్యంలో ప్రతి ఎన్నిక ఓ పాఠాన్ని అందిస్తుంది. ప్రజల నాడిని గ్రహించిన పార్టీలు విజయభేరి మోగిస్తాయి. గత దశాబ్ద కాలంగా దేశంలో జరిగిన ఎన్నికల ధోరణులను పరిశీలిస్తే, బీజేపీ విజయాన్ని సాధించడం లేదా ప్రధాన ప్రత్యర్థిగా ఉండటం కనిపిస్తోంది. ఇందుకు ప్రధాన కారణం బీజేపీ సంస్థాగత నిర్మాణం, కార్యకర్తల నిబద్ధత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని అభివృద్ధి దృక్పథం.

27 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత బీజేపీ దేశ రాజధానిలో విజయ బావుటా ఎగురవేసింది. 2014లో ప్రారంభమైన ఈ నూతన శకం, దేశంలో రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చేసింది. ప్రజలు 'డబుల్ ఇంజిన్ సర్కార్' (కేంద్రం–రాష్ట్రం కలిసి పనిచేయడం) ద్వారానే అభివృద్ధి సాధ్యమని విశ్వసిస్తున్నారు. హర్యానా, మహారాష్ట్ర, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లలో బీజేపీ విజయాలు, అలాగే స్థానిక ఎన్నికల్లో సాధించిన మెజారిటీ, ప్రభుత్వ పాలనా విధానంపై ప్రజలు చూపుతున్న విశ్వాసానికి నిదర్శనం. బీజేపీ నాయకత్వం పారదర్శక అభివృద్ధిని, సంక్షేమాన్ని సమతుల్యంగా అమలు చేయడంలో ముందంజలో ఉంది. ఢిల్లీని చాలా సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ పార్టీ, గత కొన్ని ఎన్నికల నుంచి ప్రజల మద్దతు కోల్పోతూ వచ్చింది. దీనికి తోడు I.N.D.I.A కూటమిలోనూ భిన్నాభిప్రాయాలు కనిపిస్తున్నాయి. కూటమి సభ్యులు 'స్నేహం చేసి చెడిపోయాం' అన్న భావనకు లోనవుతూ, తమ భవిష్యత్తుపై సందిగ్ధంలో ఉన్నారు.

ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఒకప్పుడు భారత రాజకీయాల్లో కొత్త మార్పును తీసుకురావడానికి సంకల్పించిన నాయకుడిగా పేరు పొందారు. అవినీతి వ్యతిరేక పోరాటంతో ఆయన రాజకీయాల్లో ప్రవేశించి, ప్రజలకు కొత్త రాజకీయ శైలిని అందిస్తానని వాగ్దానం చేశారు. మొదట్లో ఇది ప్రజలను ఆకర్షించినా, కాలక్రమంలో ఆయన పాలనా విధానాలు, నిర్ణయాలు ఆయనపై నమ్మకాన్ని కోల్పోయేలా చేశాయి. ఢిల్లీ మాదిరిగా పంజాబ్‌లో కూడా తన పార్టీని అధికారంలోకి తెచ్చినా, అక్కడ కూడా సమస్యలు ఉధృతమయ్యాయి. పాలనానుభవం లేకపోవడం వల్ల ఆయన ప్రభుత్వం కీలకమైన మౌలిక వసతుల అభివృద్ధిలో పూర్తిగా విఫలమైంది.



అవినీతి ఆరోపణలు కేజ్రీవాల్ రాజకీయ జీవితానికి మరిన్ని ఇబ్బందుల్ని కలిగించాయి. ముఖ్యంగా, ఢిల్లీలో మద్యం విధానంలో జరిగిన అక్రమాలు పెద్ద రాజకీయ కలకలం రేపాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు కొందరు లైసెన్స్ లబ్ధిదారులకు అనుకూలంగా మారాయని, ప్రజాధనం దుర్వినియోగానికి గురైందని ఆరోపణలు వచ్చాయి. దీనిపై కేంద్ర సంస్థలు విచారణ జరుపుతుండగా, కేజ్రీవాల్ ప్రభుత్వం దీన్ని రాజకీయ కక్షసాధింపు చర్యగా మలిచే ప్రయత్నం చేసింది. కానీ, ప్రజలు మాత్రం ఆయనను నైతికంగా ప్రభుత్వాన్ని నడిపించగలిగే నాయకుడిగా చూడలేకపోయారు. ప్రస్తుతం కేజ్రీవాల్ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఒకప్పుడు బీజేపీకు ప్రత్యామ్నాయంగా ఆప్‌ను చూసినవారు, నేడు ఆ పార్టీని అదే బీజేపీతో పోల్చి చూడడం ప్రారంభించారు. పాలనా వైఫల్యాలు, సంక్షేమ హామీల ఆర్థిక అనిశ్చితి, అవినీతి ఆరోపణలు కేజ్రీవాల్ నాయకత్వాన్ని మరింత దెబ్బతీశాయి. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి, ఢిల్లీలో కేజ్రీవాల్ వంటి ముఖ్యమంత్రులు సంక్షేమ పథకాలను ప్రధాన ఆయుధంగా ఉపయోగించుకుని ప్రజలను మోసగించాలని చూశారు.

బీజేపీ తన నాయకత్వాన్ని సిద్ధాంతం, నిబద్ధత, ప్రజాసేవ అనే మూడు మూలస్తంభాలపై నిర్మిస్తోంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ ఎన్నికల్లో పార్టీ తీసుకున్న సుస్థిర నిర్ణయాలు ప్రజలకు నమ్మకాన్ని కలిగించాయి. దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన ఎన్నికలు రాజకీయ విశ్లేషకులకు అనేక పాఠాలను నేర్పించాయి. గతంలో కొన్ని ఎన్నికల్లో విజయం సాధించలేకపోయినా, ఇప్పుడు బీజేపీకి అనుకూలంగా ఉన్న రాజకీయ వాతావరణం, పార్టీ వ్యవస్థాగత శక్తి, మోదీ నేతృత్వంలోని విశ్వసనీయత వంటి అంశాలు గెలుపునకు దోహదపడ్డాయి. బీజేపీ విజయానికి మొదటినుంచీ ప్రధాన కారణం నరేంద్ర మోదీ నాయకత్వం. ఆయన నాయకత్వంలో పార్టీకి ఉన్న భరోసా ప్రజల్లో మరింత బలపడింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, పారదర్శక పాలన ప్రజల్లో నమ్మకాన్ని పెంచాయి. ఢిల్లీ ప్రజలు కూడా దేశవ్యాప్తంగా ఉన్న అభివృద్ధిని చూసి తమ రాష్ట్రంలో కూడా అదే తరహా పాలనను కోరుకున్నారు. ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా నిలిచిన మరో అంశం సమర్థమైన ఎన్నికల వ్యూహం. ప్రజల్లోకి వెళ్లి నేరుగా వారి సమస్యలు తెలుసుకోవడం, నమ్మకాన్ని పెంచే విధంగా మేనిఫెస్టోను రూపొందించడం వంటివి దోహదపడ్డాయి.

రేఖా గుప్తా ఢిల్లీ రాష్ట్రానికి 9వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి, రాజధాని పాలనలో కొత్త శకాన్ని ప్రారంభించారు. ఆమె తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై, సమర్థ నాయకత్వం, ప్రజాసేవ, పార్టీ పట్ల నిబద్ధత ద్వారా ఉన్నత స్థాయికి ఎదిగారు. కొత్త ప్రభుత్వంపై ఢిల్లీ ప్రజల్లో అంచనాలు పెరిగాయి. రాబోయే రోజుల్లో రేఖా గుప్తా నాయకత్వంలో ఢిల్లీ అభివృద్ధి ఎంతగా ఊపందుకుంటుందో ఆసక్తిగా ఎదురుచూడాల్సిందే.

• రమేశ్‌నాయుడు నాగోతు
బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్

# న్యాయవాదుల నియంత్రణకే ఈ బిల్లు

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'అడ్వకేట్ ఎమెండ్‌మెంట్ బిల్లు 2025' బిల్లు పూర్తిగా అడ్వకేట్ల హక్కులను హరించే విధంగా ఉండడమే గాక న్యాయ వ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని తీసివేసే విధంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం అడ్వకేట్లను తమ చెప్పుచేతల్లో ఉంచుకుంటూ, న్యాయ వ్యవస్థను నియంత్రించే ప్రయత్నంగా దీనిని చూడవచ్చు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్లుగా ముగ్గురు కేంద్ర ప్రభుత్వం నియమించేవారు ఉండాలనే సవరణ బార్ కౌన్సిల్ పైన కేంద్ర ప్రభుత్వ అజమాయిషీ కిందకే వస్తుంది. కేంద్ర ప్రభుత్వం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు సదరు చట్టంలోని నిబంధనలకు సంబంధించిన నియమాలను అమలు చేయాలని ఉత్తర్వులు ఇవ్వవచ్చును అనే సవరణ కూడా బార్ కౌన్సిల్ మీద కేంద్ర ప్రభుత్వ పెత్తనం కిందకే వస్తుంది. ఇవి అభ్యంతరకరం.

ఎవరైనా అడ్వకేట్‌కి మూడేళ్ళ శిక్ష పడి, హైకోర్టు గానీ సుప్రీంకోర్టు గానీ శిక్షను ఖరారు చేసినట్లయితే అతని బార్ కౌన్సిల్ సభ్యత్వం రద్దు అవుతుంది అనే సవరణ చాలా కఠినంగా ఉంది. ఇంతటి కఠిన నిబంధన ఇతర వృత్తులలో ఉన్నవారికి గానీ, రాజకీయ నాయకులకు గానీ లేకపోవడం గమనార్హం. అలాగే ఏ అడ్వకేట్ అయినా మూడేళ్ళ శిక్ష ఉన్న నేరాలలో శిక్ష పడినా లేదా విచారణ ఎదుర్కొంటున్నా, అతను బార్ కౌన్సిల్ మెంబరుగా పోటీ చేయడానికి అనర్హుడు అనే సవరణ అభ్యర్థుల పైన తప్పుడు కేసులు బనాయించడానికి అవకాశం కల్పించేదిగా ఉంది. ఇది బార్ కౌన్సిల్ ఎన్నికలలో హింసకు దారి తీస్తుంది. అడ్వకేట్స్ కోర్టులు బాయ్‌కాట్ చేయడం, కోర్టు వర్క్ చేయకుండా దూరంగా ఉండటం వంటివి చేయకూడదు అనే సవరణ పూర్తిగా అడ్వకేట్ల హక్కులకు భంగకరం, ప్రజాస్వామ్య విరుద్ధం.

అడ్వకేట్స్ బార్ అసోసియేషన్లు క్రింది కోర్టులలో అడ్వకేట్ల సమస్యల పరిష్కారానికి ఏర్పడిన స్వతంత్ర సంస్థలు. ఇప్పటికే వాటి ఎన్నికలను క్రమబద్ధీకరించే పేరుతో, అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్ నియంత్రణ కోసం, బార్ అసోసియేషన్ల పైన బార్ కౌన్సిళ్ళు కొంత ఆధిపత్యం తీసుకున్నాయి. ఇప్పుడు ఈ అడ్వకేట్ ఎమెండ్‌మెంట్ బిల్లు సవరణల ద్వారా బార్ అసోసియేషన్లను పూర్తిగా నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారు. సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ పేరుతో ప్రతి ఐదేళ్ళకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్, ప్లేస్ ఆఫ్ ప్రాక్టీస్, సదరు అడ్వకేట్ రెగ్యులర్ ప్రాక్టీస్ చేస్తున్నాడా లేదా అని వెరిఫికేషన్... ఇవన్నీ అడ్వకేట్ల హక్కులను కాలరాచి అడ్వకేట్లను నియంత్రించే ప్రయత్నంగానే కనపడుతోంది. విదేశీ లా ఫర్మ్‌లను, విదేశీ లాయర్లను అనుమతించే అధికారం బార్ కౌన్సిల్ పరిధిలో కాకుండా కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంచే ప్రయత్నం కూడా ఆమోదయోగ్యం కాదు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఇప్పటికే బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అభ్యంతరాలను కేంద్ర ప్రభుత్వానికి పంపింది. న్యాయవాదుల స్వతంత్రతను, హక్కులను, న్యాయ వ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకోవడానికి ప్రతి బార్ అసోసియేషన్ పూనుకోవాలి. లేనిపక్షంలో న్యాయ వ్యవస్థ తన ఉనికిని కోల్పోతుంది.

– పి.పి. శాస్త్రి, అడ్వకేట్, ఏలూరు

# ఈ వలసల ఆరాటం ఏనాటిదో..!

పంతొమ్మిదవ శతాబ్దపు చివరి దశాబ్దాలకే అమెరికా 'ది న్యూ వరల్డ్' (కొత్త ప్రపంచం)గా ఆవిర్భవించింది. విశాలమైన భూభాగం; దినదిన ప్రవర్ధమానమౌతున్న పారిశ్రామిక రంగం; విస్తరించిన వ్యవసాయ, ఉత్పాదన రంగాలు; ఇబ్బడి ముబ్బడిగా వచ్చిపడుతున్న లాభాలు, పటిష్ఠమైన ప్రజాస్వామ్య, ఉన్నత విద్యా వ్యవస్థలు, అపారమైన వ్యక్తి స్వేచ్ఛ, వేళ్లాను కుంటున్న ఆధునిక జీవనశైలి లాంటి అంశాల దృష్ట్యా అమెరికాను పాశ్చాత్య నాగరికతకు ప్రతీకగా, అవకాశాల పెన్నిధిగా యావత్ ప్రపంచం గుర్తించింది. ప్రపంచం నలుమూలల నుండి ప్రజలు అమెరికాకు వలసపోవడానికి ఉద్యుక్తులయ్యారు. వీరిలో శ్రామికులు, విద్యావంతులు, వ్యాపారులు, వ్యవసాయదారులు ఉండేవారు. అత్యధికులు ఉపాధి అవకాశాల కోసమే అక్కడకు వెళ్ళేవారు.

1790లో ఒక క్రైస్తవ మతబోధకుడితో మొదలైన భారతీయుల అమెరికా వలస పంతొమ్మిదవ శతాబ్దపు నడుమకల్లా పశ్చిమ తీరాన చిన్న చిన్న వ్యాపార స్థావరాల ఏర్పాటుతో ఊపందుకున్నది. వందల సంఖ్యలో పంజాబీలు, ముఖ్యంగా సిక్కులు వివిధ మార్గాల గుండా అమెరికా చేరుకునేవారు. 1910 కల్లా అధికారికంగా భారతీయుల సంఖ్య 3000కు చేరుకోగా అనధికారంగా అమెరికా పౌరులుగా చలామణి అయ్యేవారి సంఖ్య ఎన్నోరెట్లు అధికంగా ఉండేది.

ఆసియా ఖండం నుండి ప్రజల వలసలను నిరోధించడానికి 'ఆసియన్ ఎక్స్‌క్లూజన్ లీగ్' అనే సంస్థ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి 'ఓరియంటల్ ఎక్స్‌క్లూజన్ ఏక్ట్ అఫ్ 1923' అనే చట్టాన్ని ప్రవేశ పెట్టించింది. పెరుగుతున్న జపాన్ ప్రాబల్యం, పారిశ్రామిక ప్రగతిని 1897లో జాక్వెస్ నోవికోవ్ అనే రష్యన్ మేధావి 'ఎల్లో పెరిల్' (పసుపు ప్రమాదం)గా అభివర్ణించగా, రష్యాపై జపాన్ గెలుపు, అదే విధంగా జపాన్, చైనాల నుండి పెరుగుతున్న వలస నేపథ్యంలో 'ఎల్లో పెరిల్'కు మరింత ప్రాచుర్యం లభించింది. పాశ్చాత్య దేశాల అస్తిత్వానికి ఏషియన్లు ప్రమాదకారులన్న ఒక జాత్యహంకార భావన ఇది. వీరి నుండి తమ అవకాశాలకు ముప్పు వాటిల్లనుందని అభద్రతా భావంతో శ్వేతజాతి దురహంకార సంస్థలు జపనీయుల నివాస సముదాయాలపై భౌతిక దాడులు కూడా చేసేవారు. భారతీయులకు పౌరసత్వాన్ని నిరాకరించడానికి ప్రధాన ప్రాతిపదిక వారు తెల్లజాతివారు (కకెసియన్ తెగ) కాకపోవడమే. ఈ కారణంగా యూరోపియన్లకు సునాయాసంగా లభించే పౌరసత్వం భారతీయులకు గగనమయ్యేది.

అమెరికాలో న్యాయ పోరాటం చేసి ఆ దేశ పౌరసత్వాన్ని చేజిక్కించుకున్న మొట్టమొదటి భారతీయుడు భికాజీ బల్సారా. జొరాస్ట్రియన్ (పార్శి) అయిన బల్సారా 1900లో నూలు వర్తకునిగా అమెరికాలో అడుగుపెట్టాడు. న్యూయార్క్‌లో స్థిరపడి 1906లో పౌరసత్వానికై దరఖాస్తు చేసుకోగా అది తిరస్కారానికి గురైంది. అప్పటికి అమలులో ఉన్న దేశీయకరణ చట్టం, 1790, ప్రకారం కేవలం స్వతంత్ర శ్వేత జాతీయులే పౌరసత్వానికి అర్హులు. ఆ నిరాకరణను వలస దేశం నుండి వచ్చిన శ్వేతేతరుడైన బల్సారా న్యూయార్క్ సర్క్యూట్ కోర్టులో సవాలు చేస్తూ తాను పార్శీని గనుక శ్వేత (ఇండో యూరోపియన్ ఆర్య) జాతికే చెందుతానని వాదించాడు. ఈ ప్రాతిపదికపై అతనికి పౌరసత్వాన్ని ఇస్తే పెక్కుమంది ఆఫ్ఘన్లు, హిందువులు, అరబ్బులు కూడా పౌరసత్వానికి అర్హులవుతారని పేర్కొంటూ అతని వ్యాజ్యాన్ని కోర్టు కొట్టివేసింది. అయితే, బల్సారా ఉన్నత వ్యక్తిత్వం కలవాడని, ఆయన సర్క్యూట్ కోర్టుకు అప్పీల్ చేసుకోవచ్చునని సెలవిచ్చింది. సర్క్యూట్ కోర్టు 'శ్వేతజాతి' అంటే, నలుపు, పసుపు, గోధుమ వర్ణ సమూహాలకు చెందనిది కనుక పార్శీలను శ్వేతజాతిగా పరిగణిస్తూ బల్సారాకు 1909లో పౌరసత్వాన్ని ప్రసాదించింది.

ఇక, అమృత్‌సర్ జిల్లాలో పుట్టి పట్టభద్రుడైన భగత్‌సింగ్ థీండ్ ఫిలిప్పైన్స్‌లో కొంత కాలం పనిచేసి మనీలా నుండి కష్టాలు పడి సముద్ర మార్గాన మిన్నెసోటా చేరుకున్నాడు. ప్రయాణం మధ్యలో ఆయన సోదరుడు మరణించాడు. గద్దర్ పార్టీ కార్యకలాపాలలో పాల్గొన్నందుకు బ్రిటిష్ ప్రభుత్వం ఈయనతో పాటు మరొక ఏడువేల మంది పంజాబీలపై నిఘా పెట్టింది. 1918లో ప్రథమ ప్రపంచ సంగ్రామంలో అమెరికన్ సైనికుడిగా వాషింగ్టన్‌లో సేవలందించినందుకు గాను థీండ్‌కు పౌరసత్వ ధ్రువీకరణ పత్రాన్ని 'క్యాంపు లూయిస్' జిల్లా కోర్టు ద్వారా ప్రభుత్వం అందించింది. కానీ థీండ్ హిందువు గనుక శ్వేత జాతి కింద పరిగణించలేమని అతని ధ్రువీకరణపత్రాన్ని 'బ్యూరో ఆఫ్ నేచురలైజేషన్' తృణీకరించింది. అప్పట్లో భారత ఉపఖండం నుండి వలస వెళ్లిన ముస్లిమేతరులందరూ హిందువులుగానే పరిగణింపబడేవారు. వెంటనే థీండ్ స్టేట్ ఆఫ్ ఒరెగాన్‌కు దరఖాస్తు చేయగా ఆయన విద్యార్హతలు, శ్వేతజాతి వారితో ఉన్న సత్సంబంధాలు, ఆయన ఉన్నత కులం (జాట్), ఆయన సత్ప్రవర్తన లాంటి అంశాలను చూపి, బ్యూరో ఆఫ్ నేచురలైజేషన్ అభ్యంతరాలనూ ఆయన బ్రిటిష్ వ్యతిరేక విద్రోహ చర్యలనూ సైతం తోసిపుచ్చి పౌరసత్వానికి అర్హుడిగా ప్రకటించింది. దీనిని కూడా బ్యూరో సుప్రీమ్ కోర్టులో సవాలు చేసి రద్దు చేయించింది. ఇదే సమయంలో డబ్బై మంది భారతీయుల పౌరసత్వం రద్దయింది. అదే తరుణంలో మొదటి ప్రపంచ యుద్ధ వీరులందరికీ పౌరసత్వాన్ని ప్రసాదించవచ్చునన్న చట్టం అమలులోకి వచ్చి థీండ్‌కు పౌరసత్వం లభించింది. తన న్యాయ పోరాటం ఆద్యంతమూ థీండ్ తాను అగ్రకులానికి చెందిన ఆర్యుడిననే వాదిస్తూ వచ్చాడు.

అమెరికా పౌరసత్వానికై భారతీయుల ఆరాటాలూ పోరాటాలకు వందేళ్ళకు పైబడిన చరిత్ర ఉంది. 1965లో వచ్చిన ఇమ్మిగ్రేషన్ యాక్ట్ వలన తెరుచుకున్న అమెరికా ద్వారాలు లక్షల మందికి ప్రవేశాన్ని, ఉపాధిని కల్పించాయి. అగ్రరాజ్యంగా అమెరికా వెలుగొందుతున్నంత కాలం వలసలు కొనసాగుతూనే ఉంటాయి.



అక్షయ కుమార్ మజుందార్ పౌరసత్వ వివాదం కూడా ఆసక్తికరమైనదే. కలకత్తా సమీపంలో ఒక కులీన బ్రాహ్మణ కుటుంబంలో 1881లో జన్మించిన మజుందార్ తత్వశాస్త్రం, ఆధ్యాత్మిక చింతనలో పరిపూర్ణ విజ్ఞానాన్ని సంపాదించాడు. క్రైస్తవాన్ని ఔపోసన పట్టిన ఆయన చైనా జపాన్లలో కొంతకాలం బోధించి 1904లో సీటెల్ చేరుకొని అమెరికాలో తన 'న్యూ థాట్' ఉద్యమాన్ని మేధావి వర్గంలోనికి చొచ్చుకుపోయేలా చేయగలిగాడు. హైందవ క్రైస్తవ భావజాలాన్ని మిళితపరిచి 'క్రిస్టియన్ యోగా'ను అమెరికన్ సమాజానికి పరిచయం చేసాడు. 1930లో ముద్రితమైన ఈయన గ్రంథం 'ది హిందూ హిస్టరీ' ప్రజాదరణ పొందింది. మజుందార్ దేశ స్వాతంత్ర్యాన్ని కాంక్షించేవాడు. ఈయన కూడా బల్సారా, థీండ్‌ల వలె తాను హైందవ సమాజంలో అత్యున్నత స్థాయి కులానికి చెందినవాడిని గనుక ఆర్యుడిగా (కకెసియాన్) పరిగణించాలని స్పోకేన్ జిల్లా కోర్టును ఒప్పించి పౌరసత్వాన్ని పొందాడు. అయితే థీండ్ పౌరసత్వ విషయంలో సుప్రీమ్ కోర్టు తీర్పు ఆధారంగా మజుందార్ పౌరసత్వం రద్దు చేయబడింది. 1946లో తూర్పు భారతదేశం నుండి వలస వచ్చిన వంద మందికి పౌరసత్వ అర్హతను కల్పిస్తూ అమలులోనికి వచ్చిన ల్యూస్ సెల్లర్ చట్టం కింద మజుందార్ 1950లో అమెరికా పౌరుడు కాగలిగాడు.

అమెరికా పౌరసత్వానికై భారతీయుల ఆరాటానికి వందేళ్ళకు పైబడిన చరిత్ర ఉంది. ఇక, 1965లో వచ్చిన ఇమ్మిగ్రేషన్ యాక్ట్ వలన తెరుచుకున్న అమెరికా ద్వారాలు లక్షల మందికి ప్రవేశాన్ని, ఉపాధిని కల్పించాయి. అక్కడి విలాసవంతమైన ఆధునిక జీవన శైలి, అవకాశాలు, అవినీతిరహిత సమాజం, పటిష్ఠమైన ప్రభుత్వ యంత్రాంగం, స్వేచ్ఛ, వినిమయ సంస్కృతి ఆ దేశాన్ని ఆకర్షణీయమైన గమ్యంగా నిలిపాయి. అగ్రరాజ్యంగా అమెరికా వెలుగొందుతున్నంత కాలం వలసలు కొనసాగుతూనే ఉంటాయి.

■ ప్రొ. కొట్టు శేఖర్
మిజోరం యూనివర్సిటీ



# శివోహం

## నేడు మహాశివరాత్రి పర్వదినం
## శైవక్షేత్రాల్లో విస్తృతంగా ఏర్పాట్లు



మహాశివరాత్రిని పురస్కరించుకుని యనమలకుదురులోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందుతోంది. మంగళవారం అర్ధరాత్రి తర్వాత ప్రారంభమైన స్వామి వారి దర్శనానికి మూడు గంటల ముందే భక్తులు క్యూ లైన్లలో బారులుతీరారు. శివనామస్మరణతో ఆలయం మార్మోగింది. అధికారులు, ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇంద్రకీలాద్రిపై ఉన్న మల్లేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో విశేషంగా అలంకరించారు.

-ఆంధ్రజ్యోతి-పెనమలూరు/వన్‌టౌన్



## వంశీ ఆగడాలపై ఫిర్యాదుల వెల్లువ

- పది సెంట్ల స్థలం ఆక్రమించుకున్నారని మహిళ ఆవేదన
- పానకాల చెరువులో అక్రమ మైనింగ్ చేశారని రైతుల ఆగ్రహం
- ఆన్‌లైన్ చేయిస్తామని పొలం కాజేశారని ఆరోపణ

6లో



8లో

## అపవిత్రం

దుర్గాఘాట్‌లో లోపించిన పరిశుభ్రత

### నదిలో కలుస్తున్న మరుగుదొడ్ల వ్యర్థ నీరు

పట్టించుకోని ఆలయ అధికారులు • ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు

# 945 ఎకరాలను 18 ఏళ్లుగా వదిలేశారు

## చిట్యాలలో పశుగణాభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు భూముల కేటాయింపు

### బఫెలో బ్రీడింగ్ సెంటర్, తోళ్ల పరిశ్రమ, మామిడి పరిశోధనా కేంద్రం ఇలా ఎన్నో ప్రతిపాదనలు

- ఏ ఒక్కటి ఏర్పాటు చేయకపోవడంతో నిరుపయోగంగా భూములు
- ఆక్రమించుకునేందుకు సిద్ధమవుతున్న కబ్జాదారులు
- ఎంఎస్‌ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని ప్రజల విజ్ఞప్తి



చిట్యాలలో పశుగణాభివృద్ధి కేంద్రం కోసం కేటాయించిన భూమి

పరిశ్రమల ఏర్పాటు కోసం వందల ఎకరాల భూములు కేటాయించి దశాబ్దంన్నర గడుస్తున్నా ఒక్క పరిశ్రమ కార్యరూపం దాల్చలేదు. బఫెలో బ్రీడింగ్ సెంటర్(పశుగణ ఉత్పత్తి కేంద్రం), తోళ్ల పరిశ్రమ, మామిడి పరిశోధనా కేంద్రం.. ఇలా ఎన్నో ప్రతిపాదనలు చేసినా నేటికీ ఆ దిశగా ఒక్క అడుగు పడలేదు. రోజురోజుకూ విలువ పెరగడంతో ఆ భూములపై అక్రమార్కుల కన్ను పడింది. ఆక్రమిం చేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇంకొంత కాలం ఇలాగే వదిలేస్తే ఈ భూములు కబ్జా రాయుళ్ల చేతుల్లోకి వెళ్లిపోయే ప్రమాదం ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం స్పందించి వెంటనే ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-తిరువూరు): మెట్ట ప్రాంతమైన తిరువూరు నియోజకవర్గంలో ఎక్కువశాతం మంది వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారు. తిరువూరు, విస్సన్నపేట మండలాల్లో వరిసాగు, గంపలగూడెం, ఏ కొండూరు మండలాల్లో పత్తి, మిర్చి సాగు అధికంగా ఉంది. చదువుకున్న యువత సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో సీజన్‌ను బట్టి మిర్చి, మామిడి తోటల్లో పనులకు వెళ్తున్నారు. మరి కొందరు ఉపాధి కోసం హైదరాబాద్, ముంబై వంటి దూరప్రాంతాలకు వెళ్తున్నారు. ఇక్కడి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని 18 ఏళ్ల కిందట పరిశ్రమల ఏర్పాటు కోసం వందలాది ఎకరాలను కేటాయించారు. ఒక్క పరిశ్రమ కూడా స్థాపించకపోవడంతో ఆ భూములు నిరుపయోగంగా మారాయి.

### 2007లో భూముల కేటాయింపు

తిరువూరు మండలంలో పశుగణాభివృద్ధి కేంద్రం ఏర్పాటు నిమిత్తం తిరువూరు విజయవాడ ప్రదాన రహదారిలో సుమారు 945 ఎకరాల భూమిని పశుసంవర్థకశాఖకు కేటాయించారు. చిట్యాల రెవెన్యూలో(అప్పటి సర్వే ప్రకారం) ఆర్‌ఎస్ నెం.211లో 504 ఎకరాలు, అంజనేయపురం రెవెన్యూలో ఆర్‌ఎస్‌నెం.124లో 126 ఎకరాలు, ఆర్‌ఎస్‌నెం.123/3లో 2 ఎకరాలు, 106లో 13 ఎకరాలు, రామన్నపాలెం రెవెన్యూలో ఆర్‌ఎస్‌నెం.230లో 172.77ఎకరాలు, ఆర్‌ఎస్‌నెం.229లో 8.16 ఎకరాలు, ఆర్‌ఎస్ నెం.223లో 38.20 ఎకరాలు, ఆర్‌ఎస్‌నెం.22లో 10 ఎకరాలు, ఆర్‌ఎస్‌నెం.23/1లో 11.36 ఎకరాలు, ఆర్‌ఎస్‌నెం.23/2లో 2.93 ఎకరాలు, ఆర్‌ఎస్‌నెం.7/1లో 17.46 ఎకరాలు, ఆర్‌ఎస్‌నెం.7/2లో 9.12 ఎకరాలు, మొత్తం 945 ఎకరాల భూమిని 2007లో బఫెల్లో బ్రీడింగ్ సెంటర్ నిర్మాణం కోసం పశుసంవర్ధకశాఖకు సుమారు 18 సంవత్సరాల కిందట అప్పటి కలెక్టర్ భట్టాచార్య కేటాయించారు. తొలుత ఈ భూమిలో పశువుల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ట్యాంక్ నిర్మించిన తదుపరి ఈ పథకం వేరే ప్రాంతానికి తరలివెళ్లిపోవడంతో ఈ ప్రాంతాన్ని

మిగతా 6లో..

### పరిశ్రమలు ఏర్పాటు చేయాలి



ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ భూముల్లో వెంటనే పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. యువత ఉపాధి కోసం దూర ప్రాంతాలు వెళ్లకుండా నివారించాలి.

- కొత్తపల్లి ఆనంద్ స్వరూప్, అడ్వకేట్, తిరువూరు

# ప్రచారానికి తెర

## ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

- రేపే కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల పోలింగ్
- ప్రధాన పోటీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, కేఎస్ లక్ష్మణరావు మధ్యే
- విద్యావేత్త, విద్యాదాతల్లో విజయం ఎవరిని వరించేనో..
- కూటమి బలం, ప్రజా సంఘాల మద్దతు ఆధారంగా సమరం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రచారం ముగిసింది. కూటమి బలపర్చిన అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీడీఎఫ్ బలపర్చిన అభ్యర్థిగా కేఎస్ లక్ష్మణరావు మధ్య ప్రధానంగా పోటీ జరగనుంది. ప్రధాన అభ్యర్థులు గత పక్షం రోజులుగా ఆత్మీయ సమ్మేళనాలు, ఆత్మీయ సమావేశాల పేరుతో పతాక స్థాయిలో ప్రచారాన్ని నిర్వహించారు. ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ మండల, డివిజన్, నియోజకవర్గాల స్థాయిలో ఆత్మీయ సమ్మేళనాలు జరిగాయి. కేఎస్ లక్ష్మణరావు కూడా ప్రజా సంఘాలతో కలిసి క్షేత్రస్థాయిలో సుడిగాలి పర్యటనలు చేశారు. ప్రధాన అభ్యర్థుల తరఫున రాజకీయ పార్టీలు, అనుబంధ సంఘాలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు భుజాన వేసుకుని ప్రచారాన్ని పతాక స్థాయికి చేర్చాయి.

### ఆలపాటికి అనేక వర్గాల మద్దతు


ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు తెలుగుదేశం, జనసేన, బీజేపీలు రాజకీయంగా మద్దతును ప్రకటించాయి. ఆలపాటి మాజీ మంత్రిగా కూడా పనిచేశారు. విద్యావేత్తగా ప్రత్యేక ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు. ఈయనకు ఏపీ నిరుద్యోగ జేఏసీ మద్దతు ప్రకటించింది. వ్యాపారులు, యువత, పెన్షనర్లు, రైతు ప్రతినిధులు మద్దతు తెలిపారు. ప్రధానంగా కూటమి ప్రజా ప్రతినిధులు ఆలపాటికి ఎంతో వెన్నుదన్నుగా ఉన్నారు. ఆలపాటి విజయానికి కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు ఏకతాటిపైకి వచ్చి కృషి చేస్తున్నారు. భారీ సభలు నిర్వహిస్తూ ఎన్నికల వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించారు.

### లక్ష్మణరావుకు వామపక్షాల అండ

కేఎస్ లక్ష్మణరావుకు వామపక్షాల అండ ఉంది. ప్రధానంగా యూటీఎఫ్, ఏపీఎంఎస్‌టీఎఫ్, ఏపీపీసీఎల్‌ఏ, పీఎల్‌ఏ, ఏఎన్‌ఈడబ్ల్యూఏ, ఏపీపీజేఎల్‌పీఏ, సీఐటీయూ, ఎల్‌ఐసీ, ఏఎల్‌ఐఈఏ, ఐసీఈయూ, బీఎస్‌ఎన్‌ఎల్, పోస్టల్, ఏపీఎస్‌ఆర్‌టీసీ, ఎస్‌డబ్ల్యూఎఫ్, బ్యాంక్ ఎంప్లాయిస్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, జేవీవీ, కేవీపీఎస్, మెడికల్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్, ఐద్వా తదితర ఉద్యోగ, ప్రజా సంఘాలు మద్దతు పలికాయి.



ఆలపాటి రాజేంద్రప్రసాద్



కేఎస్ లక్ష్మణరావు

### ఇరువురు అభ్యర్థుల రాజకీయ అనుభవం

ఎన్టీఆర్, చంద్రబాబు నాయకత్వంలో పనిచేసిన సీనియర్ నాయకుడిగా, మాజీ మంత్రిగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. 1994, 1999, 2004, 2009, 2014, 2019 ఎన్నికల్లో ఆరు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేయగా మూడు సార్లు గెలుపొందారు. 2024లో తెనాలి సీటును జనసేనకు ఇవ్వాల్సి రావటంతో పోటీ చేయలేదు. దీంతో ఆలపాటికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశం ఇచ్చారు. కేఎస్ లక్ష్మణరావు మూడు సార్లు ఎమ్మెల్సీగా గెలుపొందారు. రెండు సార్లు టీచర్స్ ఎమ్మెల్సీగా, ఒకసారి పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. రెండో సారి పట్టభద్రుల స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఆలపాటి విద్యావేత్త అయితే, కేఎస్ విద్యాదాతగా ఉన్నారు. ఇద్దరూ కూడా విద్యావిషయిక నేపథ్యం కలిగిన వారు కావటం గమనార్హం. ఇద్దరిది కూడా గుంటూరు జిల్లా అయినప్పటికీ వారికి ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలతో కూడా అనుబంధం ఉంది. కేఎస్ లక్ష్మణరావును ఓడించేందుకు ఆలపాటి ప్రత్యేక వ్యూహాలతో ముందుకు వెళుతుండగా.. కేఎస్ కూడా ఆలపాటిని ఓడించటానికి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఇద్దరు ఉద్దండులు తలపడటంతో ఎమ్మెల్సీ ఎన్నికలు ఉత్కంఠగా మారాయి. నిర్ణయాత్మక పోరు నేపథ్యంలో పట్టభద్రులకు ప్రధాన అభ్యర్థులు ఇద్దరూ కూడా తమ మ్యానిఫెస్టోలను ప్రకటించారు. విస్తృతంగా వాటిపై ప్రచారం చేశారు. విజయం ఎవర్ని వరించేనో వేచిచూడాలి.

## ఇద్దరి ఉసురు తీసిన అతివేగం

### కంచికచర్ల మండలంలో డివైడర్‌ను ఢీకొన్న బైక్

### ఇద్దరు యువకులు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

హైదరాబాద్ నుంచి విజయవాడ వస్తుండగా ఘటన





ఇమ్రాన్, కరిముల్లా మృతదేహాలు

కంచికచర్ల రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్‌జిల్లా కంచికచర్ల మండల పరిధిలోని ఎన్.ఎస్.పీ కెనాల్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా, మరో యువకుడు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే... ఉయ్యూరు చెందిన ఫరీద్ బేగ్ హైదరాబాద్‌లో ఉంటున్నారు. తన బంధువు మృతి చెందడంతో బైక్‌పై హైదరాబాద్ నుంచి సోమవారం రాత్రి స్నేహితులతో కలిసి ఉయ్యూరుకు ప్రయాణం అయ్యారు. నిద్రమత్తులో అతివేగంగా వెళ్తూ డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో రంగారెడ్డి జిల్లా చింతల్‌మేట్‌కు చెందిన అబ్దుల్ ఇమ్రాన్ (25), కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలం చిన్నపాండ్రిక గ్రామానికి చెందిన హుస్సేన్ కరిముల్లా మృతి చెందారు. ఫరీద్ బేగ్ తీవ్రంగా గాయపడటంతో అతడ్ని నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరు యువకులు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వారి కుటుంబాలకు వీరే ఆధారం కావడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# ఇంకెన్నేళ్లు?

## గొల్లపూడి గ్రామ పంచాయతీలో ప్రత్యేక పాలన

- పంచాయతీ బోర్డు లేక అభివృద్ధి నిర్ణయాలకు దూరం
- గ్రామాన్ని మూడు ముక్కలుగా విభజిస్తూ వైసీపీ ప్రభుత్వంలో జీవో జారీ
- అప్పటి నుంచి ప్రత్యేక అధికారులతోనే నెట్టుకొస్తున్న ప్రభుత్వం



గొల్లపూడి గ్రామ ఏరియల్ వ్యూ

గొల్లపూడి గ్రామ పంచాయతీలో ప్రత్యేక అధికారుల పాలన ఇంకెన్నేళ్లు అంటూ గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. బెజవాడను అనుకుని ఉండే గొల్లపూడి సిటీతో సమానంగా శరవేగంగా విస్తరిస్తున్నా.. దానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోలేని దుస్థితి ఏర్పడింది. టీడీపీకి కంచుకోటగా ఉందన్న ఉద్దేశంతో గ్రామాన్ని ముక్కలు చేయటానికి గత వైసీపీ ప్రభుత్వం జీవో తెచ్చింది. ఫలితంగా ప్రత్యేక అధికారుల పాలనలో కొన్నేళ్లుగా పంచాయతీ నలిగిపోతోంది. పాలకవర్గం లేకపోవటంతో అభివృద్ధి నిర్ణయాలకు బ్రేక్ పడింది. ఫైనాన్స్ నిధులను కూడా అందుకోలేని స్థితికి చేరింది.

### జీవోను రద్దు చేయిస్తాం



వైసీపీ పాలనలో ప్రజలకు వ్యతిరేకంగా తెచ్చిన జీవోను రద్దు చేయించి, రానున్న పంచాయతీ ఎన్నికల్లో గ్రామంలో ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతాం. ఐదేళ్ల గ్రామంలో జరిగిన అవినీతిని కూడా అతి త్వరలో బయటపెడతాం. గొల్లపూడి గ్రామాభివృద్ధికి పాలకవర్గం లేకపోవటం సమస్యగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో అతి త్వరలోనే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

-బొమ్మసాని సుబ్బారావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

(ఆంధ్రజ్యోతి, గొల్లపూడి): అత్యధిక ఆదాయం కలిగిన పంచాయతీల్లో ఎన్టీఆర్ జిల్లాలోనే ఒకటిగా ఉన్న గొల్లపూడి గ్రామపంచాయితీ కొన్నేళ్లుగా ప్రత్యేక అధికారి పాలనలో మగ్గుతోంది. గత వైసీపీ పాలనలో టీడీపీ ప్రాబల్యం ఉన్న గొల్లపూడి గ్రామ పంచాయతీని మూడు ముక్కలుగా విడదీసే జీవోను తీసుకువచ్చారు. ఈ జీవో కారణంగా గత ఐదేళ్లలో గ్రామాన్ని అభివృద్ధికి దూరం చేశారని అధికార పార్టీ నాయకులు అప్పట్లోనే తీవ్రంగా వ్యతిరేకించారు. సర్పంచ్, పంచాయతీ బోర్డు లేకపోవడం, ప్రత్యేక పాలనలో గ్రామం ఉండటంతో 15వ ఫైనాన్స్ నిధులు సుమారు రూ.6 కోట్ల నుంచి 7 కోట్ల వరకు ఆగిపోయాయి. దీంతో గ్రామ అభివృద్ధి నిలిచిపోయింది. ఇంటి పన్నుల ద్వారానే గొల్లపూడిలో పంచాయతీకి ఐదున్నర కోట్ల రూపాయల వరకు ఆదాయం వస్తుంది. ఇంత పెద్ద ఆదాయం కలిగి ఉండి కూడా ప్రజా ప్రతినిధులు లేకపోవడంతో ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. వార్డు సభ్యులు, సర్పంచ్ ఉంటే తమ సమస్యలను వార్డులోనే ప్రజాప్రతినిధులకు చెప్పుకొని పరిష్కరించుకునే వాళ్లమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామంలోని టీడీపీ నాయకులు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వైసీపీ తెచ్చిన జీవోను రద్దు చేయించాలని కోరుతున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గొల్లపూడి గ్రామానికి ఎన్నికలు జరిగే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృష్టి సారించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

## భక్తులకు ఆటంకాలు రానీయొద్దు

- మహా శివరాత్రికి పకడ్బందీగా ఏర్పాట్లు
- నిరంతరం అధికారుల పర్యవేక్షణ ఉండాలి
- కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాలు

6లో

## నేడు దుర్గగుడిపై శివయ్య కల్యాణం

8లో

## ఈవీఎంలకు పటిష్ఠ భద్రత

- కలెక్టర్ లక్ష్మీశ


ఈవీఎం గోదాము తనిఖీ చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

## ఈవీఎంలకు పటిష్ఠ భద్రత

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

**కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) :** ఈవీఎం, వీవీప్యాట్‌ల భద్రతపై పోలీస్ సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా వుండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ గోదామును అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి మంగళవారం పరిశీలించారు. సీసీ కెమేరాల పనితీరు, అగ్నిమాపక శాఖ పరికరాలు తదితరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్‌లు భద్రపరిచిన గోదామును ఎప్పటికప్పుడు తనిఖీ చేసి సమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్టు వెల్లడించారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా వుంటూ సీసీ కెమేరాల పర్యవేక్షణతో గట్టి నిఘా వుంచాలన్నారు. కలెక్టర్ వెంట డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సిబ్బంది తదితరులున్నారు.

## హాట్‌స్పాట్‌లపై గట్టి నిఘా పెట్టండి

**కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) :** మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి సమన్వయ శాఖలు, స్వచ్ఛంద సంస్థల సమష్టి కృషి అవసరమని, మాదక ద్రవ్యాల వినియోగానికి సంబంధించిన 149 హాట్‌స్పాట్‌లపై గట్టి నిఘా పెట్టాలని, ఈ విషయంలో ఈగల్ బృందాలు కీలకంగా పనిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నియంత్రణ, దుష్ప్రభావాలు, అవగాహన కార్యక్రమాల నిర్వహణ, కౌన్సెలింగ్ సేవలు తదితరాలపై మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఇందుకు విద్యాసంస్థల్లో క్యాంపస్ అంబాసిడర్లను గుర్తించి, వారికి అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. అధికారులు నిఘా పెట్టి జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాల వినియోగాన్ని జిల్లాలో పూర్తిగా అణిచివేసేందుకు కృషిచేయాలని, ప్రధానంగా మూలాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. జిల్లాలో 10 ఈగల్ వాహనాలు ఉన్నందున, ఈ బృందాల ప్రణాళికాయుత చర్యల ద్వారా మంచి ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు. జిల్లాను మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు అధికార యంత్రాంగం చొరవకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్, ఈగల్ బృందాలు తీసుకొంటున్న చర్యలను డీసీపీ కేజీవీ సరిత వివరించారు. సమావేశంలో విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయోవృద్ధుల సంక్షేమ అధికారి వాడ్రేవు కామరాజు, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, డీఈవో యూవీ సుబ్బారావు, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సీఎస్ఎస్ఎన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పదోన్నతులకు అనుమతివ్వండి

» లేకుంటే మార్చిలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం

» ఆర్టీసీ ఎండీకి యూనియన్ రాష్ట్ర నేతల లేఖ

**బస్‌స్టేషన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) :** ఆర్టీసీలో పెండింగ్‌లో ఉన్న సుమారు మూడువేల పదోన్నతులకు ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోతే మార్చి నెలలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని ప్రజారవాణా సంస్థ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్యలు మంగళవారం ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు లేఖ అందజేశారు. అర్హతలు ఉండి కూడా పదోన్నతులు పొందకుండా చాలామంది పదవీ విరమణలు చేశారన్నారు. 30 సంవత్సరాల పైబడి సర్వీసు ఉన్న సీనియర్ ఉద్యోగులు ఆరేళ్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారన్నారు. జూనియర్ స్కేల్ ఆఫీసర్ల నుంచి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల వరకు సుమారు 60మంది రాష్ట్రంలో ఇన్‌చార్జ్‌లుగా విధులు నిర్వహిస్తున్నా సమస్యలను పరిష్కరించకుండా వదిలేస్తున్నారన్నారు. పదోన్నతులపై ప్రభుత్వ పెద్దలు, సంబంధిత మంత్రి చొరవ తీసుకుని పరిష్కరించాలన్నారు. అలాగే ప్రభుత్వశాఖల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా విధుల్లో వెసులుబాటు కల్పించటంతో పాటు స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను మంజూరు చేయాలన్నారు. అన్ని డిపో యూనిట్లు, జిల్లా కేంద్రాలలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించాలన్నారు.

## 14న అమరావతిలో శ్రీనివాస కల్యాణం

**తిరుమల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో మార్చి 14న శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహిస్తామని టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మంతో కలిసి మంగళవారం సమీక్షించారు. అమరావతికి సమీపంలోని వెంకటపాలెంలో ఉన్న టీటీడీ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో శ్రీనివాస కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఏర్పాట్లు గడువులోపు పూర్తిచేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం చంద్రబాబు హాజరుకానున్న నేపథ్యంలో అవసరమైన భద్రత, భక్తులకు క్యూలైన్లు, కల్యాణం రోజున భక్తులు వీక్షించేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అమరావతి పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేసేందుకు వీలుగా సంబంధిత జిల్లా అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కళా బృందాలు, ఆకట్టుకునేలా విద్యుత్, పుష్పాలంకరణలు, అన్న ప్రసాదాలు పంపిణీ ఏర్పాట్లు చేయాలని కోరారు.

# భక్తులకు ఆటంకాలు రానీయొద్దు

» మహా శివరాత్రికి పకడ్బందీగా ఏర్పాట్లు

» నిరంతరం అధికారుల పర్యవేక్షణ ఉండాలి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాలు

**కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) :** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి, దుర్గామల్లేశ్వర స్వామిని దర్శించుకోనున్న నేపథ్యంలో ఆలయ పరిసర ప్రాంతాల్లో పటిష్ఠ ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. మంగళవారం దేవస్థానం అధికారులతో పాటు రెవెన్యూ, పోలీస్, వీఎంసీ, మత్స్య, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులకు ఏర్పాట్లపై మార్గనిర్దేశనం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఘాట్ల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసశాఖ బందోబస్తు చేసినట్టు చెప్పారు. నిరంతర గస్తీతో పాటు క్యూలైన్లు, బ్యారికేడింగ్ పైనా ప్రత్యేకంగా దృష్టిసారించి, పోలీస్ పికెట్‌తో పాటు సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఘాట్ల వద్ద జల్లు స్నానాలు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు వసతులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తాగునీరు, మొబైల్ టాయిలెట్లు, నిరంతర పారిశుధ్యం ఏర్పాట్లు వుంటాయన్నారు. వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలతో పాటు అవసరమైన మందులు అందుబాటులో వుంటాయన్నారు. ఘాట్‌ల వద్ద నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

సుశిక్షితులైన గజ ఈతగాళ్లు అందుబాటులో వుంటారని తెలిపారు. గొల్లపూడి, సూరాయపాలెం, పవిత్ర సంగమం వద్ద ఎలాంటి ఇబ్బంది లేకుండా భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించేందుకు సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, అధికారులకు ఇప్పటికే ఆదేశాలిచ్చినట్టు కలెక్టర్ తెలిపారు.

### ఆలయాల వద్ద పటిష్ఠ బందోబస్తు : సీపీ

గుణదల : మహా శివరాత్రిని పురస్కరించుకుని కృష్ణా స్నానఘాట్ల వద్ద, అలాగే యనమలకుదురు శివాలయం వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేసినట్టు నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్‌బాబు తెలిపారు. పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు వాహనాల రద్దీని పరిశీలించాలని చెప్పారు. కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద సిబ్బంది, పోలీసు అధికారులకు ట్రాఫిక్ నియంత్రణపై దిశా నిర్దేశం చేశారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం కృష్ణా ఎస్పీ ఆర్.గంగాధర్‌తో కలిసి యనమలకుదురు వద్ద బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు రద్దీని పరిశీలించాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో డీసీపీలు గౌతమి శాలి, కృష్ణమూర్తి నాయుడు, ఏడీసీపీ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.


కమాండ్ కంట్రోల్ రూమ్ బందోబస్తు పర్యవేక్షణను అధికారులకు వివరిస్తున్న సీపీ రాజశేఖర్‌బాబు

## తెలంగాణ టాపర్‌గా విజయవాడ యువతి

» వైద్య విద్యలో డాక్టర్ జాహ్నవికి ఫస్ట్ ర్యాంక్



**పాయకాపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) :** ఈ ఏడాది జనవరిలో తెలంగాణా ప్రభుత్వం నిర్వహించిన మూడో సంవత్సరం మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ (ఎంఎస్ ఓబీజీ) పరీక్షల్లో విజయవాడకు చెందిన యువతి డాక్టర్ అయినపురి జాహ్నవి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. గాంధీజీ మెడికల్ కాలేజీలో పీజీ చేస్తున్న జాహ్నవి 78.75 శాతంతో తెలంగాణ టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా డాక్టర్ జాహ్నవిని పలువురు అభినందించారు.

## రేపు ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్

**కలెక్టరేట్ :** కృష్ణా-గుంటూరు జిల్లాల శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఓటుహక్కు వినియోగించుకొనేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రకటించినట్టు కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక, ఇతర సంస్థలు తమ ఉద్యోగులు, కార్మికులు ఓటు హక్కును వినియోగించుకొనేందుకు విధుల సమయాన్ని తగ్గించడం లేదా షిఫ్ట్‌ల వెసులుబాటు కల్పించాలని కలెక్టర్ సూచించారు.

## ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) :** జిల్లాలో ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు కృష్ణాజిల్లా అధికారి సాల్మన్‌రాజు పేర్కొన్నారు. జిల్లాలో 63 పరీక్షా కేంద్రాల్లో 45,530 మంది పరీక్షలకు హాజరు కానుండగా.. మొదటి సంవత్సరం 24,557 మంది, రెండో సంవత్సరం 20,873 మంది పరీక్ష రాయనున్నారు. జిల్లాను 14 జోన్‌లుగా విభజించి 63 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 63మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 600మంది ఇన్విజిలేటర్లను నియమించారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో పదిపరీక్షా కేంద్రాల్లో 3151మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. మార్చి 1 నుంచి 15 వరకు పరీక్షలు జరగనున్నాయి.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

» పోలింగ్ జరిగే ప్రాంతాల్లో రెండు రోజుల పాటు విద్యాసంస్థలకు సెలవు

» 42 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు

» కృష్ణా కలెక్టర్ బాలాజీ

**మచిలీపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) :** కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్టు కలెక్టర్ బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 27వ తేదీ ఉదయం 8గంటలనుంచి సాయంత్రం 4గంటలవరకు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ జరుగుతుందన్నారు. జిల్లాలో 63,114 మంది ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. పోలింగ్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 48గంటలపాటు 144సెక్షన్‌ను అమలులో ఉంటుందన్నారు. 31ప్రాంతాల్లో 77పోలింగ్ కేంద్రాలను


మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

ఏర్పాటు చేశామని, 477మంది అధికారులు, సిబ్బందిని కేటాయించామని తెలిపారు. వీరిలో 94మంది పీవోలు, 92మంది ఏపీవోలు, 199మంది ఓపీవోలు, 92మంది మైక్రో అబ్జర్వర్లు ఉన్నట్టు తెలిపారు. మార్చి 3న గుంటూరులో ఓట్లలెక్కింపు ప్రక్రియ ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 42సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అక్కడ పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశామని తెలిపారు.

### నేడు మెటీరియల్ అందజేత

ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని మచిలీపట్నం నోబుల్‌కళాశాలలో, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవో కార్యాలయాలవద్దఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల వద్ద పోలింగ్ మెటిరియల్‌ను బుధవారం అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ ముగిసిన తరువాత రిసెప్షన్ కేంద్రాలవద్ద పోలింగ్ సిబ్బంది నుంచి మెటిరియల్‌ను స్వీకరిస్తారని తెలిపారు. ఇందుకోసం పూర్తిస్థాయిలో వాహనాలను అందుబాటులో ఉంచామన్నారు. పోలింగ్ కేంద్రాలవద్ద పటిష్ఠ పోలీస్‌బందోబస్తును ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. పోలింగ్ కేంద్రాలలోకి పోలింగ్ ఏజెంట్లు, సిబ్బంది సెల్‌పోన్‌లను తమవెంట తీసుకుని వెళ్లకూడదన్నారు. పోలింగ్ జరిగే 77 పోలింగ్ కేంద్రాలలో ఉన్న పాఠశాలలకు 26, 27తేదీలలో సెలవు ప్రకటించామన్నారు. ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునే సమయంలో 1, 2, 3అంకెలను సూచిస్తూ ప్రాధాన్యతాక్రమంలో అంకెలు వేయాలన్నారు. ఓటర్లుగా ఉన్న కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్ర ఎన్నికల సంఘం 27 తేదీన స్పెషల్ క్యాజువల్ లీవ్‌గా ప్రకటించిందని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు సక్రమంగా జరిగేలా రాజకీయపార్టీల నాయకులు సహకరించాలని రాజకీయపార్టీల నాయకులతో కలెక్టర్ కోరారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# వంశీ ఆగడాలపై ఫిర్యాదుల వెల్లువ

**గన్నవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) :** గన్నవరం పట్టణంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న తన పది సెంట్ల ఖాళీ స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే వంశీ ప్రోద్బలంతో అతడి అనుచరులు రాయించుకున్నారని విజయవాడకు చెందిన సుంకర సీతామహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుంకర సీతామహాలక్ష్మి పట్టణంలోని గాంధీ బొమ్మసెంటర్ సమీపంలో 2004లో పదిసెంట్ల ఖాళీ స్థలాన్ని రూ.4,11,500లకు బొప్పన చౌడేశ్వరి నుంచి అగ్రిమెంట్ ఆఫ్ సేల్ కం జనరల్ పవర్ ఆఫ్ అటర్నీడీడ్‌గా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రిజిస్ట్రేషన్ అనంతరం స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదే ఏడాది 30న చౌడేశ్వరి చెల్లెలు మూల్పూరి విజయ తులసిరాణి, చల్లపల్లి జయశ్రీలు సదరు స్థలం వారి స్వాధీనంలో ఉందని ఆపై, తనకు అమ్మిన చౌడేశ్వరిపై ఇంజక్షన్ దావా వేశారు. దీనిపై గుడివాడ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు స్టాటస్‌కో ఇచ్చారు. 2010లో చౌడేశ్వరి గన్నవరం రిజిస్ట్రార్ కార్యాలయంలో సేల్‌డీడ్ దస్తావేజును రాసి సీతామహాలక్ష్మికి ఇచ్చారు. దావా కొనసాగుతున్న తరుణంలో 2019లో రెండోసారి వంశీని తులసిరాణి, జయశ్రీలు ఆశ్రయించారు. 2021లో వంశీ తనను పిలవగా తన భర్త కృష్ణమూర్తి, దేవిరెడ్డి రవీందర్‌రెడ్డి, సుబ్బరాజులతో కలిసి వెళ్లారు. అక్కడ వంశీ చౌడేశ్వరీ వద్ద కొన్న స్థలంను ఆ రేటుకు అమ్మమని డిమాండ్ చేయగా అందుకు నిరాకరించారు. వంశీ ఆఫీస్‌లో ఉన్న బీబీగూడెంకు చెందిన నల్లబాబు, రంగా, ఎంపీపీ అనగాని రవిలతో నువ్వు ఎలా ఆ స్థలంలోకి వెళతావో చూస్తామని, నిన్ను చంపైనా ఆ స్థలం ఆక్రమించుకుంటామని బెదిరించారని ఫిర్యాదులో సీతామహాలక్ష్మి పేర్కొన్నారు. 2022లో చౌడేశ్వరీ రిజిస్ట్రేషన్ స్థలంలో వంశీ ప్రోద్బలంతో తులసి రాణి, జయశ్రీలు పదిసెంట్ల స్థలాన్ని దొంగ ఈసీ సహాయంతో వంశీ ప్రధాన అనుచరులైన సూరపనేని అనిల్‌కుమార్, ఎస్‌వీఎస్ రామకృష్ణకు ఐదు సెంట్ల చొప్పున రిజిస్ట్రేషన్ చేయించారు. స్థలంలో గోడ నిర్మాణం చేస్తుండగా వంశీ అనుచరులైన మేచినేనిబాబు, టీవీ నరసింహారెడ్డి, అనిల్‌కుమార్, రంగా, ఎంపీపీ అనగాని రవి, ఎస్‌వీఎస్ రామకృష్ణ మరికొంత మందితో వచ్చి కర్రలు, రాళ్లు, మరణాయుధాలతో దాడి చేయగా అక్కడి నుంచి పారిపోయానని, మరుసటి రోజు స్థలం అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న అనిల్ కుమార్, రామకృష్ణలు, పదిసెంట్ల స్థలాన్ని వంశీ అనుచరుడైన మేచినేనిబాబు కుమారుడు ఎంవీఎస్ రవితేజ పేరున తప్పుడు ఈసీ తయారు చేసి ఎస్ఆర్‌వోకు ఫేక్ సమాచారం ఇచ్చి రిజిస్ట్రేషన్ చేశారని సీతామహాలక్ష్మి ఫిర్యాదులో పేర్కొన్నారు. వంశీ, అతని అనుచరులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు. సీతామహాలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### పాలకాల చెరువు తవ్వకాలపై..

గన్నవరం శివారు మర్లపాలెంలోని పాలకాలు చెరువును అభివృద్ధి చేస్తామని మాయమాటలు చెప్పి నెల రోజులపాటు10, 12 జేసీబీలు, ఎక్స్‌కవేటర్‌లతో 15అడుగుల లోతు అక్రమ మైనింగ్ చేశారని పలువురు రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వల్లభనేని వంశీ, మేచినేనిబాబు, అనగాని రవి, ఓలుపల్లి మోహనరంగా, కాట్రు శేషులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### బిల్లులు ఎగ్గొట్టడంపై మరో కేసు..

చంద్రబాబు ప్రమాణాస్వీకారం నాడు ఆ ప్రాంతంలో ఓలుపల్లి మోహనరంగా బినామి అయిన కడియాల సతీష్, లింగమనేని కిషోర్‌లు ఒక క్వారీ నుంచి గ్రావెల్‌ను తీసుకువచ్చి మట్టి ఫిల్లింగ్ చేశారు. బిల్లులు చేయించుకుని క్వారీ యజమానికి నగదు చెల్లించకపోవటంతో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### వంశీ, అనుచరులపై ఛీటింగ్ కేసు

**ఉంగుటూరు :** అగ్రిమెంట్ చేసిన పొలాన్ని అన్‌లైన్ చేయిస్తానని నమ్మించి, డాక్యుమెంట్లు, పాస్‌బుక్స్ తీసుకుని మోసంచేయడమే కాకుండా, అదేమని అడిగినందుకు బెదిరించి, కుట్రపూరితంగా తప్పుడు పత్రాలు సృష్టించి ఒక వ్యక్తికి చెందవలసిన ఆస్తిని నకిలీ పత్రాలు సృష్టించి వేరే వాళ్లకు రిజిస్ట్రేషన్ చేయించి, బాధితునికి తీవ్ర అన్యాయం చేసిన వల్లభనేని వంశీతో పాటు అతడి అనుచరులపై ఆత్కూరు పోలీస్‌స్టేషన్లో ఛీటింగ్ కేసు నమోదైంది.

కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, తేలప్రోలు గ్రామానికి చెందిన శనగల శ్రీధర్‌రెడ్డి(52) రైల్వే కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో ఉంగుటూరుకు చెందిన షేక్ కతీజాబేగం అలియాస్ సుగుణాబాయమ్మ కుమారుడు ఉద్దండు రాజీవ్ పరిచయమయ్యాడు. వ్యాపారంలో పెట్టుబడి నిమిత్తం శ్రీధర్‌రెడ్డిని డబ్బులు అప్పుగా అడుగ్గా వింతా కృష్ణారెడ్డి అనే వ్యక్తితో హామీ సంతకంపెట్టించి 10లక్షలు అప్పుగా ఇచ్చాడు. తర్వాత రాజీవ్ అనారోగ్యానికి చికిత్సకోసమని, కుటుంబఅవసరాలకోసమని దఫాలుగా శ్రీధర్‌రెడ్డి దగ్గర తీసుకున్న అప్పు 2016 నాటికి 89లక్షలకు చేరింది. ఈక్రమంలో అప్పు తీసుకున్న రాజీవ్ హఠాత్తుగా చనిపోవడంతో అతని తల్లి కతీజాబేగంను కలిసి తనకు ఇవ్వాల్సిన డబ్బులు గురించి శ్రీధర్‌రెడ్డి అడిగాడు. దీంతో కతీజాబేగం ఉంగుటూరులో తనకు వారసత్వంగా సంక్రమించిన 124/22, 23, 24, 25, 26, 30, 31, 32, 33, 34, 40, 41, 42, 43, 198/1, 2, 187/1, 114/2, 3, 4 5ఏ, 5బి సర్వేనెంబర్లలో గల వ్యవసాయభూమి ఎ8.91సెంట్లను అగ్రిమెంట్ చేసి ఒరిజినల్ పాస్‌బుక్‌లు, డాక్యుమెంట్లు శ్రీధర్‌రెడ్డికి అప్పగించింది. ఆ తర్వాత 2016 సెప్టెంబర్ 2న హఠాత్తుగా కతీజాబేగం కూడా మరణించింది. దీంతో గ్రామానికి చెందిన భీమవరపు యతేంద్ర రామకృష్ణ అలియాస్ తేలప్రోలు రాము శ్రీధర్‌రెడ్డిని కలిసి కతీజాబేగం రిజిస్ట్రేషన్ చేయకుండానే చనిపోయిందని తనకు తెలుసునని, రెవెన్యూఅధికార్లతో మాట్లాడి ఆమె అగ్రిమెంట్‌చేసిన భూమిని రిజిస్ట్రేషన్ చేయించి ఆన్‌లైన్ కూడా చేయిస్తానని చెప్పి శ్రీధర్‌రెడ్డి దగ్గర వున్న ఒరిజినల్ డాక్యుమెంట్లు, పాస్‌బుక్‌లు, ప్రాంసరీ నోట్లు తీసుకున్నాడు. నెలలు గడుస్తున్నా ఎటువంటి సమాచారం లేకపోవడంతో శ్రీధర్‌రెడ్డి నేరుగా రాముని కలిసి రిజిస్ట్రేషన్ గురించి ఆరాతీశాడు, ఆవిషయం స్వయంగా అప్పటి ఎమ్మెల్యే వంశీ పర్సనల్‌గా చూస్తున్నారని, ప్రస్తుతం ఆయన బిజీగా వున్నారంటూ రాము మాట దాటేశాడు. శ్రీధర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో వంశీ పీఏగా వున్న ఓలుపల్లి రంగా శ్రీధర్‌రెడ్డికి ఫోన్‌చేసి మాట్లాడాలి ఆఫీస్‌కు రమ్మని చెప్పాడు. గన్నవరంలోని ఆఫీసుకు వెళ్లిన శ్రీధర్‌రెడ్డిని చూసిన వంశీ కోపంతో రగిలిపోతూ ఏంటి రాము మీద కంప్లైంట్ ఇస్తానన్నావంట ఏమనుకుంటున్నావు అసలు కతీజాబేగంను నువ్వేచంపావని పోలీస్‌స్టేషన్లో కంప్లైంట్ ఇచ్చి, నీమీద మర్డర్ కేసు కట్టిస్తాను.. జీవితాంతం బయటకురావని బెదిరించడంతో ఇదేమి అన్యాయమని అడిగిన శ్రీధర్‌రెడ్డిని అక్కడే వున్న రంగా, రాము, సూరపనేని అనిల్, మేచినేనిబాబు అలియాస్ సత్యనారాయణ, అనగాని రవి, కాట్రు శేషుకుమార్, వీర్రాజు అలియాస్ రాజాలు కలగజేసుకుని గొడవ చేయకుండా సైలెంట్‌గా వుంటే ప్రాణాలన్నా మిగులుతాయ్, లేదంటే చస్తావ్, సార్.(వంశీ)చెప్పిన మాట విను అంటూ భయపెట్టారని, జరిగిన మోసాన్ని ఎవరికి చెప్పినా ఫలితం లేకపోవడంతో తన డాక్యుమెంట్లు, పత్రాలు తనకు ఇప్పించమని అనేకసార్లు వంశీ అనుచరులను బ్రతిమిలాడినట్టు శ్రీధర్‌రెడ్డి తెలిపాడు. అయినా కనికరించని వంశీ అనుచరులు చనిపోయిన కతీజా బేగంకు వారసుడు వున్నట్టు కొన్ని తప్పుడు ఫ్యామిలీమెంబర్ సర్టిఫికెట్లు సృష్టించి, నకిలీ డాక్యుమెంట్లు తయారుచేయించి, నర్రా వెంకటసాయికృష్ణ, నక్కా వెంకటేశ్వరరావు, నర్రా సర్వేశ్‌కుమార్, నక్కా కోటేశ్వరరావు, ఇతరులు కొంతమందికి సేల్ రిజిస్ట్రేషన్ చేశారు. జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదుచేసేందుకు ప్రాణభయంతో వెనుకాడిన శ్రీధర్‌రెడ్డి వంశీ జైలుపాలు కావడంతో ధైర్యంచేసి సోమవారం ఆత్కూరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఛీటింగ్ చేసి తన కుటుంబానికి తీరని అన్యాయం చేసిన వంశీ, అతని అనుచరులతోపాటు, ఫోర్జరీకి సహకరించిన విగతా వారందరికీ చట్టప్రకారం శిక్ష విధించాలంటూ పోలీసులకు విజ్ఞప్తిచేశాడు. దీంతో వంశీ, అతని అనుచరులపై ఎస్సై సురేష్ ఛీటింగ్ కేసు నమోదుచేశారు.

## 945 ఎకరాలను 18 ఏళ్లుగా వదిలేశారు

(5వ పేజీ తరువాయి)

నిరుపయోగంగా వదిలివేశారు. గతంలో నిర్మించిన ట్యాంక్ సైతం తొలగించారు. అప్పటి ఉపముఖ్యమంత్రి కోనేరు రంగారావు ఈ స్థలంలో మామిడి పరిశోధన కేంద్రం కోసం ప్రతిపాదన చేయగా.. ఇది నూజివీడుకు తరలింది. తోళ్ల పరిశ్రమ సైతం మరో ప్రాంతానికి వెళ్లిపోవడంతో నిరుపయోగంగా ఉన్న ఈ భూమిపై కొందరు పెద్దలు కన్నేశారు. ఈ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

### పరిశ్రమల రాకతో అభివృద్ధి

పరిశ్రమల రాకతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

-మాలపాటి ఉదయ్, సీపీఐ పట్టణ కార్యదర్శి, తిరువూరు

### భూములను సద్వినియోగం చేసుకోవాలి

పరిశ్రమల కోసం కేటాయించిన భూములను సద్వినియోగం చేసుకోవాలి. పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలి. తద్వారా ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలి.

-ముదిగొండ దుర్గాప్రసాద్, తిరువూరు

# పేట్రేగిపోతున్న మట్టి మాఫియా!

మండలంలో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. అధికారులకు ముడుపులు చెల్లిస్తే చాలు ఇక్కడ పనులు జరిగిపోతున్నాయి. అనుమతులు లేకుండా చెరువులు తవ్వుతూ మట్టిని తరలించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి కొడుతున్నారు. కోట్లలో చేతులుమారుతున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో కోట్లు కొల్లగొట్టిన మట్టి మాఫియా కూటమి ప్రభుత్వంలోనూ యథేచ్ఛగా తవ్వకాలు కొనసాగిస్తోంది. ప్రభుత్వం మారినా అధికారులప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని స్థానికులు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

» అధికారులకు ముడుపులు.. యథేచ్ఛగా తవ్వకాలు » భారీస్థాయిలో ప్రభుత్వ ఆదాయానికి గండి » ప్రభుత్వం చర్యలు శూన్యం

(బంటుమిల్లి - ఆంధ్రజ్యోతి)

మండలంలోని ముల్లపర్రు రెవెన్యూ పరిధిలో రామన్నమోడీ ప్రాంతంలో ఎక్కువ విస్తీర్ణంలో చెరువులు తవ్వుతూ మట్టిని ట్రక్కు రూ.1500 నుంచి రూ.2000 వరకు విక్రయిస్తున్నారు. దూరాన్ని బట్టి దీని ధర మారుతుంటుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు చెరువు తవ్వాలంటే తప్పనిసరిగా అనుమతి పొందాలి. నిబంధనల మేరకు చెరువులు తవ్వి మట్టిని విక్రయించాలంటే ప్రభుత్వానికి పన్నులు కట్టాలి. అయితే మండలంలో మట్టి మాఫియా అనుమతులు లేకుం


ముల్లపర్రు రెవెన్యూ పరిధిలో చెరువు తవ్వకాలు

డానే చెరువులు తవ్వేస్తున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు భారీగా ముడుపులు చెల్లించి మట్టిని అమ్మేసుకుంటున్నారు. బంటుమిల్లి మండలంలో అధికార పార్టీ అండతో మట్టి మాఫియా చెలరేగిపోతున్నది. మట్టి తోలకాలపై ఎవరైనా అధికారులకు ఫిర్యాదు చేస్తే పనులు ఆపి.. మరలా ప్రారంభిస్తారు. వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై రెవెన్యూ సిబ్బంది తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్నట్టు సమాచారం. బంటుమిల్లి, పెందుర్రు, రామన్నమోడీ, మణిమేశ్వరం తదితర గ్రామాల్లో మట్టిని ఇతర ప్రాంతాలకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. రైతు చెరువు తవ్వాలంటే మట్టి మాఫియాను సంప్రదిస్తున్నారు. ఈ మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీని నిమిత్తం అధికారులకు భారీస్థాయిలో ముడుపులు చెల్లిస్తున్నారు. దీనిపై ఇన్‌చార్జ్ తహసీల్దార్ పూర్ణచంద్రరావును వివరణ కోరగా.. గత రెండురోజుల క్రితం మట్టి కోసం చెరువు తవ్వుతున్నట్టు సమాచారం వచ్చిందని, పనులు నిలిపివేశామని చెప్పారు. ఇదిలా వుంటే చెరువు తవ్వకాలు, మట్టి తోలకాలపై ప్రశ్నించిన విలేకరిపైనా మాఫియా ముఠా బెదిరింపులకు పాల్పడుతున్నట్టు తెలిసింది.


మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు

**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 90, 99, 110 |
| చికెన్ విత్ స్కిన్ | 170 |
| చికెన్ స్కిన్‌లెస్ | 180 |

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 485

## దివ్యాంగ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ



భారతీనగర్: చెన్నైలోని హెల్ప్ ది బ్లైండ్ ఫౌండేషన్ సహకారంతో మంగళవారం ఆంధ్ర లయోలా కళాశాలలో దృష్టిలోపం ఉన్న 15 మంది విద్యార్థులకు స్కాలర్ షిప్‌ను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఫాదర్ సగయరాజ్ పాల్గొని విజయవాడ, గుంటూరులోని వివిధ కళాశాల నుంచి వచ్చిన 15 మంది విద్యార్థులకు రూ.1.9 లక్షలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త సహాయభాస్కరన్, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆలపాటిని గెలిపించుకుందాం

### ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

**భారతీనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి కృష్ణా గుంటూరు పట్టభద్రులు నియోజకవర్గానికి కూటమి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఎమ్మెల్సీగా గెలిపించుకుని రాష్ట్రాభివృద్ధికి బాటలు వేద్దామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం గురునానక్ నగర్‌లోని ఒక ప్రైవేట్ హోటల్‌లో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శాసన మండలి ఎన్నికల పోలింగ్ ఏజెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించి రాష్ట్రాభివృద్ధికి సహకారం అందించాలన్నారు. ఎన్నికల విధానాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎన్నికల కోఆర్డినేటర్ కృష్ణారావుకు, పోలింగ్ బూత్‌లోని ఏజెంట్లకు పలు సూచనలు చేశారు. జనసేన పార్టీ తూర్పు ఇన్‌చార్జ్ అమ్మిశెట్టివాసు మాట్లాడుతూ సమర్థత ఉన్న నాయకుడు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోలపల్లి గణేష్, టీడీపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, ఉషారాణి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, అమ్మిశెట్టి వాసు , కోలపల్లి గణేష్, తదితరులు

**ఆలపాటికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించండి**

ఆంధ్రా లయోలా కళాశాలలోని వాకర్స్‌ను మంగళవారం శాప్ చైర్మన్ రవినాయుడు, గద్దె క్రాంతి కుమార్ కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజక వర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేరు పక్కన ఒకటి అంకె వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపు నిచ్చారు.

**ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించాలి**

**కృష్ణలంక:** రాష్ట్ర విభజన జరిగినప్పుడు ఆంధ్ర రాష్ట్రానికి నష్టం జరిగిందని అప్పటికంటే కూడా 2019-24 మధ్య జగన్ విధ్వంసపాలనలో రాష్ట్రానికి జరిగిన నష్టమే ఎక్కువని జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ తెలిపారు.మంగళవారం కృష్ణలంక 21వ డివిజన్ పరిధిలోని కృష్ణచైతన్య స్కూల్‌లో ఉపాధ్యాయులను కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ గద్దె అనురాధ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యలు పరిష్కరించేందుకు ఆలపాటి రాజా కృషి చేస్తారన్నారు.

**రాణిగారితోట:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ బలపరిచిన లక్ష్మణరావుకు ఓటు వేస్తే జగన్‌కు వేసినట్టే అవుతుందని 18వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వేముల దుర్గారావు అన్నారు. డివిజన్‌లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేధావులు, విద్యావంతులు ఆలోచించి సౌమ్యుడు, న్యాయవాది, రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.



ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గద్దె అనురాధ

# గ్రామీణాభివృద్ధికి కృషి చేయండి

### మార్చి ఒకటి నుంచి పంచాయతీ చాంపియన్లు గ్రామాల్లో పర్యటించాలి: ఎంపీ కేశినేని శివనాథ్

**వన్‌టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):** పంచాయతీ చాంపియన్లు మార్చి ఒకటో తేదీ నుంచి గ్రామాల్లో పర్యటించి సమస్యలను గుర్తించాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సూచించారు. సమగ్ర గ్రామీణాభివృద్ధి కోసం పంచాయతీ చాంపియన్లు కృషి చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను గ్రామీణులకు లబ్ధి చేకూర్చడంలో సహకరించేందుకు ఈనెల 10 నుంచి 16 వరకు హైదరాబాద్‌లోని ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్) శిక్షణ పొందిన 32 పంచాయతీ చాంపియన్లతో మంగళవారం గురునానక్ కాలనీలోని తన కార్యాలయంలో ఎంపీ సమావేశం నిర్వహించారు. వీరందరికీ తమ సొంత నిధులతోనే ఎంపీ శిక్షణ ఇప్పించారు. ఈ సందర్భంగా రానున్న మూడు నెలల కాలంలో గ్రామాలలో ఏవిధంగా పనిచేయాలన్న దానిపై చాంపియన్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారికి టీ షర్టులుఅందించి మాట్లాడారు. ఒక మండలానికిచెందిన ఎనిమిది మంది బృందంగా ఏర్పడి రెండు రోజులు పర్యటించాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలన్నారు. నెలకు రూ.10వేలు చొప్పున పంచాయతీ చాంపియన్లకు కేశినేని ఫౌండేషన్ ద్వారా ఉపకార వేతనం అందు తుందని చెప్పారు. సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. నాలుగు మండలాల్లో ఎంపిక చేసిన 24 గ్రామాల్లో క్రికెట్ బృందాలను తయారు చేయాలన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో మరికొంత మందికి శిక్షణ ఇప్పించ నున్నట్లు పేర్కొన్నారు. ఎన్ఐఆర్‌డీపీఆర్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్‌లు సొంగా సంజయ్‌వర్మ, జి.వి. నరసింహారావు, తిరువూరు, ఎ.కొండూరు, జి.కొండూరు, జగ్గయ్యపేట రూరల్, వీరులపాడు మండలాల నుంచి శిక్షణ పొందిన చాంపియన్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

## ఎన్‌ఎస్‌ఎం వాకర్స్ మహాపాదయాత్ర

**పటమట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):** ఎన్‌ఎస్‌ఎం వాకర్స్ పటమట ఎన్‌ఎస్‌ఎం పబ్లిక్ స్కూల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వయా బెంజిసర్కిల్ మీదుగా కనకదుర్గ అమ్మవారి గుడికి మంగళవారం మహా పాదయాత్రగా వెళ్లారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు సహకారంతో ఈ పాదయాత్ర నిర్వహించినట్లు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నిమ్మగడ్డ అశోక్‌బాబు తెలియచేశారు. మాక్స్ సెక్యూరిటీ అధినేత మోహన్ ఆధ్వర్యంలో అల్పాహారం అందించారు. ఈమేరకు ఎమ్మెల్యేకు వాకర్స్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లూరి సుబ్బారావు, ఎన్.సుబ్బారావు, యోగా గురువు శంకర్రావు, మహిళా సభ్యులు సుశీల, శ్రీదేవి, బోస్ తదితరులు పాల్గొన్నారు.




## కృష్ణలంక సర్వీసురోడ్డులో ఆక్రమణల తొలగింపు

**కృష్ణలంక, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) :** కృష్ణలంక 20వ డివిజన్‌లోని సర్వీసురోడ్డులో ఆక్రమణలను మంగళవారం టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. సర్వీసురోడ్డులో హైవే రిటైనింగ్ వాల్‌ను ఆనుకొని కొందరు బడ్డీలు పెట్టి వ్యాపారాలు చేసుకొంటున్నారు. వారిలో కొందరు తమ బడ్డీ పక్కనే కొంత జాగాను ఆక్రమించి మరో బడ్డీని పెట్టి వేరొకరికి అద్దెకు ఇవ్వడం, లేదంటే స్థలాన్ని కబ్జా చేసి పందిర్లు వేసి వ్యాపారాలు చేసుకొంటున్నారు. స్థానికులు ఎంతో కాలంగా వీరి ఆగడాలపై ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది బడ్డీలను తొలగించారు. పందిర్లు తొలగించారు. భవిష్యత్తులో ఎవరైనా తిరిగి ఆక్రమణలకు పాల్పడితే చర్యలు ఉంటాయని టౌన్ ప్లానింగ్ అధికారులు హెచ్చరించారు.



ఆక్రమణలను తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది





మీ సేవ వద్ద రోడ్డు మీదే పార్క్ చేసిన ద్విచక్రవాహనాలు

## పటమట సెంటర్లో ట్రాఫిక్ ఇక్కట్లు

**పటమట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):** పటమట సెంటర్ నుంచి ఎన్‌ఎస్‌ఎం పబ్లిక్ స్కూల్‌కు వెళ్లే దారిలో మీ సేవ కార్యాలయం వద్ద రోడ్డు మీదే ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేయడం వల్ల తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఈ మార్గంలో సర్కిల్ త్రీ కార్యాలయం, పలు కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలలు ఉండటం వల్ల తల్లిదండ్రులు పిల్లలను తీసుకువచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

# హెల్మెట్‌ధారణతో సురక్షిత ప్రయాణం

### ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు

**మొగల్రాజపురం,ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):** వాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధారణపై నిర్లక్ష్యం వద్దని, హెల్మెట్ ధారణతోనే ప్రయాణం సురక్షిత మని ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు తెలిపారు. అమరావతి కార్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టిఎస్ దివాకర్, కార్యదర్శి చంటి ఆధ్వర్యంలో కార్ టింకరింగ్ వర్కర్స్ స్ప్రే పెయింటర్స్, కార్ ఏసీ, కార్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోయేషన్‌ల ఆధ్వర్యంలో హెల్మెట్‌ధారణపై అవగాహన నిమిత్తం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని బెంజిసర్కిల్ వద్ద మంగళవారం ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో, హైవేలో అయినా హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనంపై ప్రయాణం చేయడం సురక్షితం అన్నారు. ట్రాఫిక్ సీఐ రవి కుమార్ మాట్లాడుతూ హెల్మెట్‌లో ఫోన్ పెట్టుకుని కొంత మంది మాట్లాడుతూ వాహనం నడుపుతున్నారని, ఇది డ్రైవింగ్ ఏకాగ్రతను దెబ్బ తీస్తుందన్నారు. అనంతరం బెంజిసర్కిల్ నుంచి ఎంజీ రోడ్డు మీదుగా కంట్రోల్ రూం వరకు అక్కడి నుంచి బెంజిసర్కిల్ వరకు ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో హెల్మెట్ ధారణపై స్లోగన్స్ ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గౌస్ బాషా, నారాయణ, షమ్మీ, నాగూర్ నాలుగు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీసీపీ కృష్ణమూర్తినాయుడు, సీఐ రవికుమార్ తదితరులు

## విజయదుర్గ దేవస్థానంలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**వన్‌టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):** విజయదుర్గ రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భీమనవారిపేట మిల్క్ ప్రాజెక్టు ఎదురుగా ఉన్న స్వామివారి దేవస్థానంలో మంగళవారం స్వామి, అమ్మవారిని పెళ్లికుమారుడిని, పెళ్లికుమార్తెను చేశారు. ప్రాతఃకాలం నుంచే మంగళస్నానాలు, గణపతి పూజ, పుణ్యాహవచన, కంకణధారణ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



# విజ్ఞాన పెంపునకు సైన్స్ ఎగ్జిబిషన్లు

### ఎస్ఆర్ఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి



సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి

**గుణదల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):** యువతలో దాగివున్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి, వారిలో మరింతగా విజ్ఞానాన్ని పెంపొందించడానికి సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతగానో దోహదపడతాయని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను మంగళవారం నిర్వహించారు. మొత్తంగా 200 నమూనాలు ప్రదర్శించారు. సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకించేందుకు నగరంలోని పలు ప్రైవేటు పాఠశాలల నుంచి బాలబాలికలు తరలివచ్చారు. భౌతికశాస్త్రం, ఎలక్ట్రానిక్స్ శాఖ నుంచి అత్యవసర సమయాల్లో ఉపయోగించే సెన్సార్ ఆధారిత నీటి స్ప్రింక్లర్లు, ఎలక్ట్రానిక్ పియానో, ఆటోమేటిక్ డస్ట్‌బిన్, కూలర్, సౌరవ్యవస్థ నమూనాలు ఆకర్షించాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాలన్నారు. ఎగ్జిబిషన్‌కు సమన్వయకర్తగా డాక్టర్ కె.నాగేశ్వరరావు వ్యవహరించారు.

# చికెన్ తినటం వల్ల అనారోగ్య సమస్యలు ఉండవు

### ఏపీ పశుసంవర్థక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు

**వన్‌టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):** చికెన్ తినటం వలన ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉండవని పశుసంవర్థక శాఖ సంచాలకుడు టి.దామోదర్ నాయుడు తెలిపారు. ఇటీవల బర్డ్ ఫ్లూ వచ్చి కోళ్లు చనిపోతున్న నేపథ్యంలో చికెన్ తినకూడదని జరిగిన ప్రచారాన్ని పురస్కరించుకుని రాష్ట్ర పశుసంవర్థక శాఖ సంచాలకుడు టి.దామోదర్ నాయుడు మంగళవారం లబ్బీపేటలోని ఎస్ఎస్‌వీహెచ్ క్యాంపస్‌లో బర్డ్ ఫ్లూ పై అవగాహన సదస్సు, చికెన్, ఎగ్‌మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టి. దామోదర్ నాయుడు మాట్లాడుతూ చికెన్, ఎగ్ వినియోగం వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్నవారికి చికెన్, ఎగ్‌తో తయారుచేసిన రకరకాల రుచికరమైన పదార్థాలను ఉచితంగా అందచేశారు. ఆంధ్రప్రదేశ్ పశుసంవర్థక శాఖ జిల్లా, పౌల్ట్రీ ఫెడరేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పశుసంవర్థక శాఖ సంచాలకుడు టి.దామోదర్ నాయుడు

## చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ

**గుణదల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):** సమాజంలోని ప్రతి ఒక్కరూ చెత్త నుంచి సంపద తయారు చేసే విధానంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఈవోపీఆర్డీ దుర్గాప్రసాద్ తెలిపారు. విజయవాడ రూరల్ మండలంలోనినున్న పంచాయతీ పరిధిలో వర్మీ కంపోస్టు తయారీ కేంద్రం వద్ద పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్-1 నుంచి 6 వరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, క్లాప్ మిత్రలకు చెత్త నుంచి సంపద తయారీ అనే అంశంపై మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణా కార్యక్రమానికి విజయవాడ రూరల్ మండలం, జి.కొండూరు మండలం, విసన్నపేట మండలాల నుంచి అధికారులు హాజరయ్యారు. క్లాప్ మిత్రాలు వాడే పనిముట్లు గురించి, తడి చెత్త పొడి చెత్త వేరు చేయు విధానం, తడి చెత్తను వర్మీగా తయారు చేయు విధానం తెలియజేశారు. తడి చెత్త, పొడి చెత్తను సేకరించే విషయమై ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు ప్రతి ఒక్క పంచాయతీ అధికారి దృష్టి సారించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ మండల ఎంపీడీవో పి.మురళి కృష్ణ ప్రసాద్, విసన్నపేట మండలం నుంచి కె.హరికృష్ణ, జి.కొండూరు మండలం నుంచి కె.శ్రీనివాస్, పంచాయతీ రాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు అసౌకర్యం కలగకూడదు

### నగర కమిషనర్ ధ్యానచంద్ర

**వన్‌టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):** మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు.

మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యంకలగకుండా చూసుకోవాలని మంగళవారం టెలికాన్ఫరెన్స్‌లో శాఖాధిపతులతో, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మహాశివరాత్రి రోజున వచ్చే భక్తులకు ఘాట్ల వద్ద జల్లు స్నానాలకు, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు, దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక రూమ్‌లు కల్పించి, నిరంతరం పారిశుధ్య మెరుగుదలకు కృషి చేయాలన్నారు. డ్రోన్ల సహాయంతో నిరంతరం పర్యవేక్షిస్తూ ఎక్కడ లోపాలు ఉన్నా వెనువెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

టెలికాన్ఫరెన్స్‌లో శాఖాధిపతులు, ప్రజారోగ్య సిబ్బంది, ఇంజనీరింగ్ సిబ్బంది, పాల్గొన్నారు.


దేవస్థానం ఏర్పాటు చేసిన బాత్‌రూమ్స్..


బాత్‌రూమ్స్ బయటికి వస్తున్న మురుగు..


మెట్లపై నుంచి జారుతున్న మురుగు..


మురుగు కాలువలా ఘాట్ పరిసరాలు..


పై నుంచి వచ్చిన మురుగు నదిలోకి..


స్నానాలు చేయాల్సింది ఈ మురుగులోనే..


స్నానాలు ఆచరిస్తున్న భక్తులు


మహిళల కోసం ఏర్పాటు చేసిన గదుల పక్కనే వ్యాపార దుకాణాలు

దుర్గగుడి, కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్య వైఖరితో పవిత్రమైన దుర్గాఘాట్ కలుషితంగా మారుతోంది. బాత్రూమ్‌ల నుంచి వచ్చే వ్యర్థపు నీరంతా ఘాట్‌లోకి పోతోంది. అక్కడే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారు. ఎంతో పవిత్రంగా భావించే దుర్గాఘాట్ కాస్తా కలుషితంగా మారి నల్లగా తయారై దుర్గంధం వెదజల్లుతోంది. భక్తులు ఈ నీటిలోనే స్నానం చేసి అమ్మవారి దర్శనానికి వెళుతున్నారు. ఇది ఎంత అపచారమో అధికారులు ఆలోచించాలి. దూర ప్రాంతాల నుంచి నిత్యం భక్తులు భారీగా వస్తుంటారు. ఈ అపరిశుభ్రత చూస్తే ఎవరి పరువు పోతుంది? పేరుకు రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద పుణ్యక్షేత్రం కానీ వసతులు చూస్తే నాసికరం. ప్రతిరోజూ దుర్గమ్మ దర్శనానికి వందల సంఖ్యలో భక్తులు దుర్గాఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. తర్వాత కాలినడకన ఘాట్ మార్గంలోనూ, మహామండపం ద్వారా దేవస్థానానికి చేరుకుంటారు. ఎంతో భక్తితో వచ్చే భక్తులకిచ్చే గౌరవం ఇదేనా?

ఆంధ్రజ్యోతి పరిశీలన

- దేవస్థానం, కార్పొరేషన్ అధికారుల నిర్లిప్తత
- మరుగుదొడ్ల వ్యర్థ నీరంతా దుర్గాఘాట్‌లోకే..
- నల్లగా మారుతున్నవైనం అక్కడే పుణ్యస్నానాలంటే ఎలా?
- భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ఇవేం పనులు..?
- మహిళలు బట్టలు మార్చుకోవటానికీ ఇబ్బందులే!

# గలీజ్ ఘాట్

## దుర్గాఘాట్‌పై ఎందుకింత నిర్లక్ష్యం?



ఆంధ్రజ్యోతి-విజయవాడ: దుర్గాఘాట్‌లో ఏర్పాటు చేసిన బాత్రూమ్‌ల నుంచి వ్యర్థపు నీరంతా దుర్గాఘాట్‌లోకి వస్తోంది. అక్కడ కాళ్లు, చేతులు కడిగిన నీరు, మూత్ర విసర్జన చేసిన సమయంలో కొట్టిన నీళ్లు, స్నానం చేసిన నీళ్లన్నీ పక్కనే ఓ మురుగు కాలువలా ఏర్పడి ఘాట్‌లోకి వచ్చి కలుస్తోంది. బాత్రూమ్‌లో ఉపయోగించిన నీరు కూడా మెట్ల మీదుగా ఘాట్‌లోకి చేరుకుంటోంది. ఇదే ఘాట్‌లో భక్తులు స్నానం చేస్తున్నారు. ఎలా ఉంటుందో ఒక్కసారి ఆలోచించుకుకోవాలి. ఇలాంటి దుర్గంధంతో కూడిన ఘాట్‌లో చేసిన స్నానాలను పవిత్ర స్నానాలు అనగలరా?

### బాత్రూమ్‌ల ఏర్పాటు ఇలాగేనా?

ఎంతో పవిత్రమైన దుర్గాఘాట్‌లో యూరినల్స్, టాయ్‌లెట్లకు శాశ్వత ఏర్పాట్లు లేవు. ఘాట్‌పైనే ప్లాస్టిక్‌తో కూడిన రెడీమేడ్ టాయ్‌లెట్స్‌ను ఉంచారు. అదీనూ ఘాట్‌పై కావటం గమనార్హం. యూరినల్స్, టాయ్‌లెట్స్ అనేవి ఘాట్‌కు ఓ పక్కగా శాశ్వత ప్రాతిపదికన నిర్వహించాలి. వాటికి సిబ్బందిని పెట్టుకుని కొంత రుసుం వసూలు చేస్తే మెరిసిపోయేలా నిర్వహించవచ్చు. ఎక్కడేం చేయాలో అధికారులకు పట్టడం లేదు. దుర్గాఘాట్‌ను సందర్శించిన వీఎంసీ కమిషనర్ ఏం గుర్తించారో తెలియదు. కానీ రాష్ట్ర, జాతీయ స్థాయిలో బెజవాడ పరువు తీసే ఇలాంటి పనులకు అధికారులు బాధ్యత తీసుకోవాలి.

### మహిళలకు అరకొర ఏర్పాట్లు

దుర్గాఘాట్‌లో మహిళలు దుస్తులు మార్చుకోవటానికి సరైన వసతులు లేవు. పైన ఓ మూల రేకుల షెడ్లు వేశారు. మహిళలు స్నానాల తరువాత దుస్తులు శరీరానికి అతుక్కుపోతాయి. ఇలా తడిచిన బట్టలతో పైనున్న బట్టలు మార్చుకునే గదులకు వెళ్లలేని పరిస్థితి. ఆ మార్గంలో విక్రయాలు జరిపేవారుండటంతో మహిళలు సిగ్గుపడుతున్నారు. పైగా అవేమైనా గొప్ప గదులా అంటే అదీ కాదు. కేవలం రేకుల షెడ్లు. పైగా వీటికి గ్రిల్స్ ఉంటాయి. ఆ మెస్‌కు షామియానా క్లాత్ కట్టారు. ఒక గది ఉన్నా దాని తలుపు స్థానంలో గ్రిల్స్ డోర్ ఉంది. ఇలాంటి అసౌకర్యపు బట్టలు మార్చుకునే గదుల ఏర్పాటుతో ఎవరికి ప్రయోజనమో అధికారులకే తెలియాలి. మహిళలు దుస్తులు మార్చుకోవటానికి బాత్రూమ్‌ల తరహాలో ఉండే సింటెక్స్ బాక్స్‌ను ఘాట్ దగ్గర క్రమ పద్ధతిలో ఉంచితే సౌకర్యంగా ఉంటుంది.

### సందర్శనీయ ప్రాంతంగా తీర్చిదిద్దాలి

దుర్గాఘాట్ అనేది ఓ సందర్శనీయ ప్రాంతం. దీన్ని అభివృద్ధికి ఆమడ దూరంలో వదిలేశారు. చాలాచోట్ల ధ్వంసమైంది. కొంతభాగంలో మట్టి ఉంది. ఈ మట్టిపై మొక్కలను లాన్‌లా పెంచితే అందంగా ఉంటుంది. ఘాట్‌లో ఎక్కడికక్కడ అపరిశుభ్రత తాండవిస్తోంది. పరిశుభ్రత కనపడదు. ఎక్కడ పడితే అక్కడ తాళ్లు కట్టి ఉంటాయి. కాగితాలు, పాలిథిన్ బ్యాగులు ఎక్కడ పడితే అక్కడ పారేసి ఉంటాయి. దుర్గాఘాట్‌కు వచ్చిన వారు ఎప్పుడు వెళ్లిపోతామా అనుకునేవాళ్లే తప్ప కాసేపు గడిపే పరిస్థితి లేదు. ఘాట్‌లోకి వస్తే కృష్ణమ్మ పరవళ్లు, ప్రకాశం బ్యారేజీ కంటికి ఇంపుగా కనిపిస్తాయి. దూరంగా భవానీ ఐల్యాండ్ కనిపిస్తుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దుర్గాఘాట్‌ను చైనా సంస్థతో డిజైన్స్ చేయించి వినూత్నంగా నిర్మించారు. ఘాట్లన్నింటినీ రివర్‌ఫ్రంట్ ఘాట్లుగా తీర్చిదిద్దాలని చేశారు. వీటన్నింటినీ అధికారులు మరిచిపోవటం బాధాకరం. ఇప్పటికైనా రివర్ ఫ్రంట్ ఘాట్‌ల అభివృద్ధిపై అధికారులు దృష్టి పెట్టాలని భక్తులు కోరుతున్నారు.

## జగన్‌ను ప్రజలే తిరస్కరించారు

- మంత్రులు కొల్లు, వాసంశెట్టి

చల్లపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్ వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డిపై మండిపడ్డారు. మంగళవారం చల్లపల్లిలో జరిగిన ప్రచార సభల్లో వారు పాల్గొన్నారు. ప్రతిపక్ష హోదాకోసం ప్లకార్డులు పట్టుకుని గవర్నర్ ప్రసంగానికి అడ్డుతగలటంపై కొల్లు రవీంద్ర మండిపడ్డారు. ప్రతిపక్ష హోదా కోసం అడుక్కోవటం ఏంటని ప్రశ్నించారు. ప్రజలే జగన్‌ను తిరస్కరించారన్నారు.

## హైటెక్ వ్యభిచారం కేసులో మరో నిందితుడి అరెస్టు

విజయవాడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వెటర్నరీ కాలనీ ఫీడర్ రోడ్డులో స్టూడియో 9 స్పా ముసుగులో జరుగుతున్న హైటెక్ వ్యభిచారం కేసులో మరో నిందితుడిని మాచవరం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు చలసాని ప్రసన్న భార్గవ్ ఇప్పటికే పరారీలో ఉండి ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇదిలా ఉండగా ప్రసన్న భార్గవ్‌కు కస్టమర్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న గాలి గోపీచంద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పెనుగంచిప్రోలుకు చెందిన గోపీచంద్ విజయవాడ సిద్ధార్థ నగర్ నాలుగో లైన్‌లో ఉంటున్నాడు. అందమైన అమ్మాయిలతో సర్వీసు కావాలనుకునే వారిని గోపీచంద్, భార్గవ్‌కు చెందిన స్పాకు పంపుతుంటాడు. ఇలా పంపినందుకు వారానికి రూ.30 నుంచి 40వేలను గోపీచంద్‌కు భార్గవ్ చెల్లిస్తుంటాడు. ఈ మొత్తం లావాదేవీలు గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా జరిగాయని పోలీసులు గుర్తించారు. గోపీచంద్‌ను అరెస్టుతోపాటు అతడి ఫోన్‌ను పోలీసులు సీజ్ చేశారు.

# ప్రతిష్ఠ దిగజార్చే పనులు సహించం

- కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని
- సమితి ప్రయోజనాలకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తున్న అధ్యక్షులపై చర్యలు
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల తీర్మానం
- ప్లాంట్‌లో వజ్రోత్సవ పైలాన్ ఆవిష్కరణ


నెయ్యి బాటిళ్లను ఆవిష్కరిస్తున్న చలసాని ఆంజనేయులు, దాసరి బాలవర్ధనరావు, తదితరులు

వన్‌టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎందరో మహానుభావుల దూరదృష్టి, పాడి రైతుల కృషితో దినదిన ప్రవర్ధమానం చెందుతూ శరవేగంగా విస్తరిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ ప్రతిష్ఠను దిగజార్చే చర్యలను సహించేది లేదని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. రైతుల భాగస్వామ్యంతో నడుస్తున్న సంస్థ తాను నిర్దేశించుకున్న బైలా ప్రకారం పనిచేస్తుందే తప్ప కొందరి స్వార్థ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయదని, అలాంటి తప్పు కృష్ణా మిల్క్ యూనియన్ ఎప్పుడూ చేయదన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ 60వ వార్షికోత్సవం సందర్భంగా విజయవాడలోని మిల్క్ ఫ్యాక్టరీ ఆవరణలో మంగళవారం సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా 60 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవ పైలాన్‌ను చైర్మన్ ఆంజనేయులు, సంఘ అధ్యక్షులు, సమితి సిబ్బంది సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ ఏర్పాటు దగ్గర నుంచి సంస్థ పురోగతికి కృషి చేసిన మహనీయులను గుర్తు చేసుకున్నారు. 20 ఏళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న 28 మంది మిల్క్ యూనియన్ అధ్యక్షులను ఘనంగా సత్కరించారు. ఇటీవల మిల్క్ యూనియన్ ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యవహరిస్తూ సమితి ప్రయోజనాలను భంగం కలిగేలా ప్రవర్తిస్తున్న సంఘ అధ్యక్షులపై చర్య తీసుకోవాలని సమావేశం తీర్మానించింది. ఇదే సమయంలో గేదె, ఆవు పాల నుంచి తయారు చేసిన నెయ్యి లీటరు, అర లీటరు, 200 ఎంఎల్, 100 ఎంఎల్ పెట్ జార్ బాటిళ్లను ఆవిష్కరించారు.

### ఎన్టీఆర్ చలవతోనే సంస్థ ఉజ్వలం

కృష్ణా మిల్క్ యూనియన్ ఇంత ఉజ్వలంగా ఉండటానికి 1995లో మ్యాక్స్ చట్టం (పరస్పర సహాయ సహకారం సంఘం)ను తీసుకువచ్చి టీడీపీ అధినేత, నాటి ముఖ్యమంత్రి, ఎన్టీఆర్ కానుకగా ఇచ్చారని సంస్థ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. సంస్థకు స్వయం ప్రతిపత్తి కల్పించి పాడి రైతుల సర్వతోముఖాభివృద్ధికి కారణభూతుడుగా నిలిచారన్నారు. 1997లో వేతనాలు చెల్లించలేని పరిస్థితుల్లో నాటి సీఎం చంద్రబాబు ప్రభుత్వ నిధుల నుంచి నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు రాష్ట్ర ప్రభుత్వ పూచీకత్తుపై రూ.4.12 కోట్లు గ్రాంట్‌గా, డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు గ్రాంట్‌గా రూ.4.12లక్షలు ఇప్పించడంతో ఆర్థిక కష్టాల నుంచి బయట పడ్డామన్నారు. ముక్కాల రాజు, మండవ జానకీరామయ్య, ఎన్టీఆర్, చంద్రబాబు కృషితో విల్క్ యూనియన్ ఎంతగానో బలోపేతం చెందిందన్నారు.

## అగ్నిప్రమాదంలో పెసర పైరు దగ్ధం



ఉంగుటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చెన్నై-కోల్‌కతా జాతీయరహదారి పక్కన పొట్టిపాడు టోల్‌ప్లాజా సమీపంలోని పొలాల్లో మంగళవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడెకరాల పెసరపైరు దగ్ధం కాగా, సుమారు రూ.లక్ష మేర పంట నష్టం జరిగింది. గన్నవరం ఫైర్ ఆఫీసర్ షేక్ జాన్ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన భూక్యా బాలాజీనాయక్ పదెకరాలు కౌలుకు తీసుకుని పెసరపైరు సాగుచేశాడు. ప్రస్తుతం పైరు కాయదశలో ఉంది. మరో 10రోజుల్లో పంట చేతికొస్తుంది. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 2గంటల సమయంలో పెసరపైరుకు హఠాత్తుగా నిప్పంటుకుని తగలబడి పోతోందని పక్క రైతు చెప్పటంతో బాలాజీనాయక్ తన కుమారుడు భూక్యా ప్రేమ్‌కుమార్ నాయక్‌ను వెంటపెట్టుకుని హడావుడిగా పొలానికి చేరుకున్నాడు, అప్పటికే పొలమంతా పొగలు, మంటలు వ్యాపించడంతో వెంటనే గన్నవరం ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేశాడు, అగ్నిమాపకాధికారి నేతృత్వంలో హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకున్న ఫైర్‌సిబ్బంది పి.సుధాకర్, ఎ.శివారెడ్డి, కే.సుధాకర్‌రావు, ఎం.వేణు మంటలు పక్కపైర్లకు వ్యాపించకుండా అదుపుచేశారు. నిర్లక్ష్యంగా తాగి పారేసిన సిగరెట్ లేదా బీడీ వల్ల అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని ఫైర్ ఆఫీసర్ తెలిపారు. అందినచోటల్లా అప్పులు తెచ్చి పెసరపైరుకు పెట్టుబడి పెట్టానని, ప్రతి మొక్కకు గుత్తులుగా విరగకాచిన కాయలను చూసి ఎకరాకు 4 బస్తాల చొప్పున దిగుబడులు వస్తాయని ఆశించానని, మరో 10 రోజుల్లో పైరు చేతికి వస్తుందనుకున్న తరుణంలో అగ్నికి ఆహుతవడం తీవ్ర ఆవేదనను మిగిల్చిందని, కౌలు రైతు బాలాజీనాయక్ వాపోయాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

# ఆలపాటిని అత్యధిక ఓట్లతో గెలిపించాలి

- విజయవాడలో ఎంపీ శివనాథ్, ఆలపాటి ముమ్మర ప్రచారం



ప్రచారం చేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్

వన్‌టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపు కోసం విజయవాడలో విస్తృత ప్రచారం జరిగింది. పోలింగ్‌కు 48 గంటల ముందర ప్రచారాన్ని ముగించాలన్న నిబంధన ఉండటంతో టీడీపీ, కూటమి నేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. విజయవాడ కార్పొరేషన్ కార్యాలయంలో రాజేంద్ర ప్రసాద్ పర్యటించి ఉద్యోగులను తనకు ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. గ్రాడ్యుయేట్‌లు, ఉపాధ్యాయులతో నేతలతో సమావేశాలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రంతో ప్రచారం ముగిసింది. ఉదయం నుంచి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ పశ్చిమలోని విద్యాధరపురం, అప్పలస్వామి క్వారీ రోడ్డులోని కేసీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో మంగళవారం ఎంపీ శివనాథ్ సమావేశమై సమస్యలు పరిష్కరించే నేత రాజేంద్రప్రసాద్‌ను ఎన్నుకోవాలంటూ కోరారు. అలాగే సెయింట్ జోన్స్ స్కూల్‌లో ఉపాధ్యాయులతో సమావేశమైన ఎంపీ కేశినేని శివనాథ్ ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇదే విధంగా అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మంగళవారం వీఎంసీ కార్యాలయంలో ప్రచారం నిర్వహించారు. ఉద్యోగులను కలిసి తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటు ఇచ్చి గెలిపించాలని కోరారు. 48వ డివిజన్‌లో రాంజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ ప్రైవేట్ స్కూళ్లలో తెలుగు యువత పశ్చిమ అధ్యక్షుడు ఆర్.మాధవ ప్రచారం చేశారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు మద్దతు ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్, కె.సి హైస్కూల్ ప్రిన్సిపాల్ హర్షవర్ధన్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతావుల్లా, బీసీ గౌడ సాధికారిక కన్వీనర్ పామర్తి కిషోర్ బాబు, తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు ఆషా, టీడీపీ ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, జాస్తి సాంబశివరావు, చెన్నుపాటి ఉషారాణి, వీరమాచినేని లలిత, చెన్నుపాటి క్రాంతిశ్రీ, దేవినేని అపర్ణ, పొట్లూరి శివసాయి ప్రసాద్, మైలవరపు రత్నకుమారి, బుల్లా విజయ్‌కుమార్, గుడివాడ నరేంద్ర, మరుపిళ్ల రాజేష్, మహదేవ్ అప్పాజీ, వీఎంసీ మినిస్ట్రీరియల్, ఆల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.వి.ఎస్.చలం పలువురు కార్పొరేటర్లు, డివిజన్ల ఇన్‌చార్జ్‌లతో పాటు జనసేన నేత వి.నాగరాజు, బీజేపీ నేత హరిప్రసాద్, తెలుగు యువత నేతలు గూడేల రాము, ఇందుకూరి యువరాజ్, బొవిడ్డి త్రినాథ్, జ్యోతికిరణ్ పాల్గొన్నారు.


కూటమి అభ్యర్థులకు మద్దతు తెలుపుతున్న ఏపీ నిరుద్యోగ జేఏసీ నేతలు

### ఏపీ నిరుద్యోగ జేఏసీ మద్దతు

మొగల్రాజపురం: కూటమి బలపరచిన పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థులకు ఏపీ నిరుద్యోగ జేఏసీ సంపూర్ణ మద్దతు అందిస్తోందని అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ ప్రకటించారు. మంగళవారం పిన్నమనేని రోడ్డులో ఒక హోటల్‌లో కృష్ణా గుంటూరు, ఈస్ట్‌వెస్ట్, పట్టభద్రుల నియోజకవర్గం అభ్యర్థులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, పేరాబత్తుల రాజశేఖర్, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మద్దతుగా నిర్వహించిన మీడియా సమావేశం అభ్యర్థులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. అందుకే ఈసారి చంద్రబాబుపై నమ్మకంతో కూటమి అభ్యర్థులకు మద్దతిస్తున్నామన్నారు. కూటమి అభ్యర్థులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, పేరాబత్తుల రాజశేఖర్, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ పాల్గొన్నారు.

### కూటమి ప్రభుత్వంపై నమ్మకం ఉంది

జగన్ ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-2 జీవో నెంబరు 77ను హైకోర్టు సూచనలతో సుమోటాగా సవరించమని, కూటమి నేతలిచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తారని, ఎమ్మెల్సీ కోడ్ అనంతరం మెగా డీఎస్సీ ప్రకటిస్తారని, జీవో నెంబరు 117 వల్ల జరిగిన అన్యాయం గుర్తించి దాన్నిరద్దు చేస్తారని, గ్రూప్-2 అభ్యర్థులకున్న అపోహలను తొలగిస్తారని నమ్మకంతో ఉన్నారన్నారు. ఏపీ నిరుద్యోగ జేఏసీ ఉపాధ్యక్షుడు ఉమ్మడి మహేష్, సభ్యులు వాస్పలి రాము, మజ్జి పార్వతి, ఏ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు దుర్గగుడిలో శివయ్య కల్యాణం



ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన మల్లేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ పూజాధికాలను నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, 10 నుంచి 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు త్రికాల అభిషేకాలు జరుగుతాయి. రాత్రి 9 గంటల నుంచి మహాన్యాసం అనంతరం లింగోద్భవ కాలాభిషేకాన్ని నిర్వహిస్తారు. అనంతరం పూజాది ప్రక్రియలు ముగించి గంగా, పార్వతీ, మల్లేశ్వరస్వామి దివ్య లీలా కల్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తారు. అలాగపాంచాహ్నిక దీక్షతో జరిగే కార్యక్రమాల క్రమంలో మంటప పూజలు, మూలమంత్ర హవనాలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను దివ్యంగా అలంకరించారు. పట్టువస్త్రాలను ధరింపజేసి ఆభరణాలను అలంకరించారు. చందనాది దివ్య సుగంధ ద్రవ్యాలను సమర్పించి కల్యాణ క్రతువు ప్రారంభానికి ముందు అనుసరించాల్సిన వేదోక్త, శాస్త్రోక్త ప్రక్రియలను నిర్వహించారు. ఎదురుకోలోత్సవంలో పండితులు పాల్గొని అటు మల్లేశ్వర స్వామి తరపున, ఇటు గంగా, పార్వతీ అమ్మవార్ల తరపున మహోన్నత ప్రతిభ, విశేష మహత్యాలను, వారి వంశాల క్రమాన్ని వర్ణించారు.

### ఇకపై పాదరక్షలకు రుసుము లేదు

దేవస్థానంలో భక్తులు పాదరక్షలు భద్రపరచుకునేందుకు బుధవారం నుంచి రుసుము వసూలు చేయబోవడం లేదని ఈవో రామచంద్ర మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానమే పాదరక్షలను భద్రపరిచే స్టాల్‌ను నిర్వహిస్తుందన్నారు. భక్తులు ఉచితంగా తమ పాదరక్షలను భద్రపరచుకోవచ్చునన్నారు. ఇప్పటి వరకు కాంట్రాక్టర్ పాదరక్షల జతకు రూ.2 చొప్పున వసూలు చేస్తున్నాడని, అయితే లీజు కాలం ముగిసిపోవటంతో కనకదుర్గానగర్, ఘాట్ రోడ్డు వైపు గల పాదరక్షలు భద్రపరిచే స్టాండ్‌లను దేవస్థానం నిర్వహిస్తుందని తెలిపారు.


శ్రీకాళహస్తీశ్వరుడికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న దుర్గగుడి ఈవో

## కాళహస్తీశ్వరుడికి దుర్గగుడి నుంచి పట్టువస్త్రాలు

వన్‌టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని కాళహస్తిలో కొలువైన జ్ఞానప్రసూనాంబికా సమేత కాళహస్తీశ్వరుడికి మంగళవారం విజయవాడ దుర్గామల్లేశ్వర దేవస్థానం తరపున ఈవో, దేవదాయ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ పట్టువస్త్రాలు సమర్పించారు. విజయవాడ నుంచి వెళ్లిన బృందానికి కాళహస్తి దేవస్థానం ఈవో టి.బాపిరెడ్డి, వేద పండితులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కాళహస్తీరుడికి, జ్ఞాన ప్రసూనాంబకు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రామచంద్రమోహన్ బృందానికి వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. దుర్గగుడి స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకుడు ఎల్. దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## మార్చి 5న జిల్లా కేంద్రాల్లో 10న గుంటూరులో నిరసన దీక్షలు

### ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి

గాంధీనగర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు మార్చి 5న జిల్లా కేంద్రాల్లో, మార్చి 10న గుంటూరులో నిరసన దీక్ష నిర్వహించాలని ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి తీర్మానించింది. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సమితి సమావేశం కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వడ్డే మాట్లాడుతూ రైతులు పండించిన అన్ని పంటలకు సీ2+50 శాతం కలిపి మద్దతు ధరలు ప్రకటించి దానికి చట్టబద్ధత కల్పించాలని, దేశవ్యాప్తంగా రైతులు, కౌలు రైతులు ఒక పర్యాయం తీసుకున్న పంట రుణాలు మాఫీ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2018లో ప్రకటించిన పీఎం కిసాన్ పథకానికి నిధులు పెంచాలని, పెరుగుతున్న సాగు ఖర్చుల దృష్ట్యా పెట్టుబడి సాయాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. సీనియర్ రైతు నేత వై.కేశవరావు మాట్లాడుతూ సెకి విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు డిమాండ్ చేసిన సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చాక అదే ఒప్పందాన్ని కొనసాగించడం దుర్మార్గమన్నారు. కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ధరల వ్యత్యాస పథకం మోసపూరిత పథమన్నారు. జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ హంద్రీ-నివా సుజల స్రవంతి, తెలుగు గంగా ప్రాజెక్టు, పూల సుబ్బయ్య వెలుగోడు ప్రాజెక్టులకు అవసరమైన నిధులు కేటాయించి వాటి నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. సింహాద్రీ ఝాన్సీ, పి.జమలయ్య, అక్కినేని భవానీప్రసాద్, డి.హరినాథ్, మర్రెడ్డి వెంకటరెడ్డి, రైతు నేతలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
# నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 26 ఫిబ్రవరి 2025



పర్వదినం

సాధారణంగా పండుగలు, పర్వదినాలు అనగానే... కుటుంబ సభ్యులు, సన్నిహితుల కలయికలు, విందులు, వినోదాల్లాంటి వేడుకలు ఉంటాయి. కానీ మహా శివరాత్రినాడు ఇవేవీ కనిపించవు. ఉపవాసం, జాగారాలు, పూజలు, అభిషేకాలు, భజనలు, ప్రార్థనలతో రోజంతా గడిపే పండుగ ఇది.

# శివ సామీప్యాన్ని అనుభూతి చెందే రోజు

*మాఘ కృష్ణ చతుర్దశ్యా*
*మాదిదేవో మహానిశి*
*శివలింగ తయోద్భూతః*
*కోటి సూర్య సమప్రభః*

కోటి సూర్యులతో సమానంగా ప్రకాశించే మహా శివుడి లింగోద్భవం జరిగిన రోజును మాఘ బహుళ చతుర్దశిగా, మహా శివరాత్రిగా పురాణాలు పేర్కొన్నాయి. ఈ రోజు అనుసరించాల్సిన విధి, విధానాలను పేర్కొంటూ... వాటి ప్రాధాన్యతను, ఆవశ్యకతను కూడా వివరించాయి. శివరాత్రి నాడు చాలామంది భక్తులు పూర్తి ఉపవాసం పాటిస్తారు. ఏ రకమైన ఆహారాన్ని తీసుకోరు, కొందరు మంచి నీరు కూడా తాగకుండా ఉంటారు. రాత్రంతా శివారాధన చేసిన తరువాత... మరునాడు ఉదయం ఆహారాన్ని తీసుకుంటారు. వీటన్నిటివల్లా శరీరం, మనసు పరిశుద్ధమవుతాయని, దృష్టి ఆధ్యాత్మికత మీద కేంద్రీకృతం అవుతుందని పూర్వులు పేర్కొన్నారు. అలాగే రాత్రంతా మేల్కొని, శివ పూజలో నిమగ్నం కావడం కూడా అనాదిగా వస్తున్న సంప్రదాయం. 'జాగరణ' అంటే మేలుకోవడం. మనలో ఉన్న దైవిక శక్తులను మేలుకొలపడానికి, ప్రతికూల వైఖరులను విడిచిపెట్టి... సానుకూల దృక్పథాన్ని పొందడానికి శివరాత్రి ఎంతో అనుకూలమైన రోజు.

అలాగే యోగ సాధకులకు కూడా శివరాత్రి ఎంతో ప్రత్యేకమైనది. యోగ, ధ్యానాలకు శివుడు అధిపతి. ఈ రోజున పలువురు యోగులు, భక్తులు ధ్యానం, యోగా చేస్తారు. రాత్రంతా ధ్యానం చెయ్యడం చాలా శక్తిమంతమైనదనీ, ఆధ్యాత్మిక వృద్ధికి, జ్ఞానానికి దోహదం చేసేదనీ యోగ గురువులు చెబుతారు. ఇక, శివరాత్రి నాడు అభిషేకాలకు, అర్చనలకు, ప్రార్థనలకు, భజనలకు అత్యంత ప్రాధాన్యం ఉంది. ఆలయ సందర్శనలు, దాన ధర్మాలు కూడా హిందూ సంప్రదాయంలో భాగమే.

పౌరాణికంగా చూస్తే... శివుడు అగ్నిలింగంగా ఉద్భవించిన రాత్రిగా, తాండవ నృత్యాన్ని ప్రదర్శించిన రాత్రిగా, శివపార్వతుల కళ్యాణం జరిగిన రోజుగా, సముద్ర మథనంలో హాలాహలం ఉద్భవించినప్పుడు... దాన్ని తన గళాన నిలిపి సమస్త లోకాలను శివుడు కాపాడిన రోజుగా... ఇలా అనేక కథలు కనిపిస్తాయి. కాగా, తాత్త్వికమైన దృష్టిలో శివరాత్రికి భిన్నమైన ప్రాధాన్యం ఉంది. ఇది దేవుడితో జీవుడు ఏకత్వాన్ని కనుగొనే రోజు. శివుడి సామీప్యాన్ని అనుభూతి చెందే రోజు. 'శివుడు, నేను వేరు వేరు కాదు...' అనే సత్యాన్ని గ్రహించి, మనలో ఉన్న శివుణ్ణి మేల్కొలిపే రోజు.






# 'మూడో కన్ను' తెరుద్దాం!

మానవులతో సహా అన్ని జీవులకూ పరిమితులు ఉన్నాయి. ఉదాహరణకు... ఏదైనా వస్తువును మనం చూస్తున్నామంటే... అది కాంతిని నిరోధించి, పరావర్తనం చెందడమే కారణం. గాలిని మనం చూడలేం. ఎందుకంటే అది కాంతిని అడ్డుకోలేదు. అదే గాలిలో కొద్దిగా పొగ ఉంటే... అది మనకు కనిపిస్తుంది. కాంతిని తనలో నుంచీ వెళ్ళనిచ్చే దేన్నీ మనం చూడలేం. ఇంద్రియాలైన మన రెండు కళ్ళ స్వభావం అది. ఈ ఇంద్రియనేత్రాలు భౌతికమైనవాటినే చూడగలుగుతాయి. మరి భౌతికం కాని వాటిని ఎలా చూడాలి? దానికి మూడో కన్ను కావాలి. కానీ ఎలా?

**ఆ కథ అంతరార్థం...**

శివుడు తన మూడో కన్ను తెరవడం గురించి ఒక ప్రసిద్ధమైన కథ ఉంది. కామదేవుడైన మన్మథుణ్ణి జ్వలించే తన మూడో కంటితో శివుడు భస్మం చేసిన కథ అది. ఈ కథకు యోగాకు సంబంధించిన మరో కోణం ఉంది. శివుడు యోగ మార్గంలో కృషి చేస్తున్నాడు. అంటే కేవలం పరిపూర్ణత్వం కోసం కాదు, అపరిమితత్వం కోసం ఆయన ఆ కృషి సాగిస్తున్నాడు. తనలో కామం పెరగడాన్ని ఆయన గ్రహించాడు. ఇక్కడ 'కామం' అంటే అర్థం కేవలం శృంగారపరమైనది అని మాత్రమే కాదు. మనలో కలిగే ప్రతి కోరికా కామమే. అది అధికారం కోసం కావచ్చు, పదవి కోసం కావచ్చు, డబ్బు కోసం కావచ్చు... ఇలా దేని గురించైనా కావచ్చు. మీలో ఒక అసంపూర్ణ భావన ఉంటుంది. 'నాకు అది లేకపోతే... నేను సంపూర్ణం కాదు' అనే భావనతో తపించిపోవడమే కామం. తనలో అలాంటి భావన కలగడంతో... దాన్ని శివుడు దహించాడు. మూడో కన్ను తెరవడం ద్వారా... ఆయన తనలో భౌతికతకు అతీతమైన ఒక పార్శ్వాన్ని చూశాడు. ఇక భౌతికతకు సంబంధించిన నిర్బంధాలన్నీ చెదిరిపోయాయి.

**ఉన్నది ఉన్నట్టుగా ఎలా చూడాలి?**

మూడో కన్ను అనేది... భౌతికమైనది కానిదాన్ని చూడగలిగే కంటిని సూచిస్తుంది. భౌతికం కాని వాటిని చూడాలంటే మనకు ఒకే ఒక మార్గం... మనం అంతర్ముఖులం కావడం. ఇక్కడ 'మూడో కన్ను' అనే మాట కేవలం ప్రతీక మాత్రమే. అది నుదుటి మీద మొలిచేదో, పొడుచుకువచ్చేదో కాదు. భౌతికతకు అతీతమైన దాన్ని గ్రహించగలిగే దృష్టి కోణం. మరో అంశం ఏమిటంటే... ఇంద్రియ నేత్రాలు కర్మ కారణంగా కలుషితమై ఉంటాయి. 'కర్మ' అంటే గత చర్యల తాలూకు మిగిలిపోయిన జ్ఞాపకం. మీరు చూసే ప్రతిదీ ఆ కర్మ స్మృతులతో ప్రభావితం అవుతుంది. అది జరగకుండా మనం చెయ్యలేం. ఎవరినైనా మనం చూసినప్పుడు... 'అతను బాగున్నాడు, ఇతను బాగోలేడు, అతను మంచివాడు, ఇతను మంచివాడు కాదు' అని ఆలోచిస్తాం. ఉన్నది ఉన్నట్టుగా మనం దేన్నీ చూడలేం. ఎందుకంటే మన దృష్టినీ, మనం చూడగలిగే సామర్థ్యాన్నీ కర్మ స్మృతి ప్రభావితం చేస్తుంది. ప్రతిదాన్నీ ఉన్నది ఉన్నట్టుగా చూడాలంటే... లోతులకు చొచ్చుకుపోగలిగేదీ, జ్ఞాపకాలతో కలుషితం కానిదీ అయిన ఒక కన్ను తెరుచుకోవాలి. సంప్రదాయపరంగా... భారతదేశంలో జ్ఞానం అంటే పుస్తకాలు చదవడం కాదు, ఎవరి మాటలనో వినడం కాదు, సమాచారాన్ని పోగు చేసుకోవడం కాదు. మనం ఏమిటనేది గ్రహించడం కోసం కొత్త దృష్టిని లేదా అంతర్ దృష్టిని తెరవడం. మనకు సంపూర్ణమైన స్పష్టత వచ్చేది... అంతర్ దృష్టి ఏర్పడినప్పుడు మాత్రమే. అప్పుడు మనలోని స్పష్టతను ప్రపంచంలో ఏ వ్యక్తి, ఏ పరిస్థితి చెదరగొట్టడం సాధ్యం కాదు. అదే నిజమైన జ్ఞానం. అది కలగాలంటే... మనలో మూడో కన్ను తెరుచుకోవాలి. అదే శివుడి మూడో కన్ను మనకు ఇచ్చే సందేశం. శివరాత్రి సందర్భంగా... మీలో 'మూడో కన్ను' తెరుచుకోవడానికి సాధన ప్రారంభించండి.

• సద్గురు జగ్గీవాసుదేవ్

కడుపు మాడ్చితే, శక్తి కోసం శరీరం కొవ్వును కరిగించుకుంటుంది. జీర్ణవ్యవస్థ సేద తీరి, కొత్త శక్తి పుంజుకుంటుంది. ఉపవాసంతో దక్కే ఇలాంటి ఆరోగ్య ప్రయోజనాలు కోకొల్లలు. అయితే ఉపవాసం చేసినా, ఆ సమయంలో ఓపిక సన్నగిల్లకుండా ఉండడం కోసం కూడా కొన్ని నియమాలు పాటించాలి.

# ఉపవాసం... ఆరోగ్యం..!

ఉపవాస దీక్షలో భాగంగా పరిమిత ఆహార నియమానికి కట్టుబడటం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయనీ, జబ్బులకు దారితీసే దుష్ప్రభావాలూ తగ్గుతాయని పరిశోధనల్లో తేలింది. మధుమేహం, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్‌లు తగ్గుతాయని పరిశోధకులు గ్రహించారు. శరీరంలో చోటుచేసుకునే ఈ మార్పుల ఫలితంగా గుండె జబ్బులు, పక్షవాతం వంటి వ్యాధులకు గురయ్యే అవకాశాలు తగ్గుతాయి. అంతే కాకుండా ఉపవాసంతో ఒరిగే మరికొన్ని ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. అవేంటంటే...

- **ఇన్‌ఫ్లమేషన్ అదుపు:** ఇన్‌ఫ్లమేషన్‌కూ... గుండె జబ్బులు, క్యాన్సర్, కీళ్లనొప్పులకూ అవినాభావ సంబంధం ఉంటుంది. ఉపవాసంతో శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ అదుపులోకొస్తుంది కాబట్టి, ఉపవాసంతో ఈ ఆరోగ్య సమస్యలను అదుపులో పెట్టుకోవచ్చు.
- **గుండెకు మేలు:** అధిక కొలెస్ట్రాల్‌తో గుండెకు చేటు జరుగుతుందనే విషయం మనందరికీ తెలిసిందే! ఉపవాసంతో కొలెస్ట్రాల్ తగ్గుతుంది కాబట్టి గుండెకు రక్షణ దక్కుతుంది. ఉపవాసంతో అధిక రక్తపోటు అదుపులోకి రావడంతో పాటు, ఎల్‌డిఎల్ అనే చెడు కొలెస్ట్రాల్ మోతాదు తగ్గుతుంది.
- **శక్తి ఖర్చు:** ఉపవాసంలో శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం పెరుగుతుంది. పరిమితంగా క్యాలరీలు తీసుకునే వారితో పోలిస్తే, రోజంతా ఉపవాసం ఉన్నవాళ్లలో శరీరం మొత్తంలోని కొవ్వుతో పాటు ప్రత్యేకించి పొట్ట దగ్గరి కొవ్వు త్వరితంగా కరుగుతుంది.

**ఈ లక్షణాలు సహజం**

ఉపవాసం సమయంలో ఛాతీలో మంట, మలబద్ధకం, తలనొప్పి లాంటి సమస్యలు తలెత్తవచ్చు. ఈ లక్షణాలు సహజం. వీటిని నివారించాలంటే...
- రోజు మొత్తంలో కనీసం రెండు నుంచి మూడు లీటర్ల నీళ్లు తాగాలి
- పెప్టిక్ అల్సర్లు, మధుమేహులు పళ్లు, కూరగాయ ముక్కలు తినాలి
- గర్భవతులు, పాలిస్తున్న తల్లులు, హృద్రోగులు,



పెద్దలు ఉపవాసం చేయకపోవటమే మంచిది
- శారీరక బలహీనత కలిగినవారు, ఆహారానికి సంబంధించిన సమస్యలున్నవారు (ఈటింగ్ డిజార్డర్), ఇతరత్రా తీవ్ర ఆరోగ్య సమస్యలున్నవాళ్లు ఉపవాసానికి ముందు వైద్యుల సలహా తీసుకోవాలి
- ఉపవాస సమయంలో ఎక్కువ నూనె, నెయ్యిలతో చేసిన పదార్థాలు, తీపి వంటలకు దూరంగా ఉండాలి

**ఇలా ముగించాలి**

ఉపవాసంతో కడుపు నకనకలాడుతున్నా, చేతికందిన పదార్థాలతో ఉపవాసం ముగించకూడదు. మరీ ముఖ్యంగా పిండి వంటలు తినకూడదు. కోలాలు, రెడీమేడ్ పళ్ల రసాలు, స్వీట్లు, సమోసాల జోలికి వెళ్లకూడదు. ఉపవాసం ముగించేటప్పుడు తీసుకునే ఆహారం తేలికగా అరిగేదై ఉండాలి. చిరుధాన్యాలతో చేసిన రొట్టెలు, ఆకుపచ్చని కూరగాయలు, పాలు, పెరుగు, వేయించిన లేదా ఉడికించిన గింజలతో ఉపవాసం ముగించటం ఆరోగ్యకరం.

**విశ్రాంతి కూడా అవసరమే!**

ఉపవాసం జీవక్రియలను నెమ్మదింపజేస్తుంది. ఉపవాసంతో శరీరంలోని ద్రవాల్లో హెచ్చుతగ్గులు చోటు చేసుకుంటాయి. కాబట్టి అలసట కలిగించే, ఎక్కువ శారీరక శ్రమతో కూడుకున్న పనులు చేయకూడదు. ఆహార వేళలు కచ్చితంగా పాటిస్తూ, మితంగా మొదలుపెట్టి క్రమేపీ ఆహార పరిమాణం సాధారణ స్థాయికి పెంచాలి.

## పిల్లలను బడికి పంపేటప్పుడు...

పిల్లలు ఉన్న ఇంట్లో ప్రతిరోజూ ఉదయం హడావిడిగానే ఉంటుంది. అయినప్పటికీ తల్లిదండ్రులు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటూ సహనంతో వ్యవహరిస్తే పిల్లలు ఆనందంగా బడికి వెళతారని నిపుణులు చెబుతున్నారు.

- పిల్లలు శారీరకంగా ఆరోగ్యంగా ఎదగడమే కాకుండా మానసికంగా దృఢంగా ఉండేలా చూసుకోవాలి. వాళ్ల భావోద్వేగాలను నిర్లక్ష్యం చేయకూడదు. ఉదయం లేవగానే వాళ్లు చెప్పే మాటలను ఓపికగా విని అర్థం చేసుకోవాలి.
- గట్టిగా మాట్లాడడం, పెద్దగా అరవడం వల్ల పిల్లలు భయాందోళనలకు గురవుతారు. తల్లిదండ్రులు మెల్లగా, మృదు స్వరంతో మాట్లాడుతూ వాళ్లకి అర్థమయ్యే రీతిలో నచ్చచెప్పాలి.
- పిల్లలు ఉదయాన్నే నిద్ర లేవడానికి ఇష్టపడరు. వాళ్లని మెల్లగా తడుతూ మేల్కొలపాలి. ఆలస్యంగా లేవడం వల్ల కలిగే సమయాభావ పరిస్థితులను నిదానంగా వివరించాలి. సమయానికి



బడికి వెళ్లేలా అలవాటు చేయాలి.
- ఉదయం వంట పూర్తవగానే భోజనం, స్నాక్స్ తదితరాలను చక్కగా బాక్సుల్లో సర్దాలి. వాటర్ బాటిల్ నింపి పెట్టాలి. పిల్లలు పెరుగుతున్న క్రమంలో ఈ పనులు పూర్తి చేయడానికి వాళ్ల సహాయం తీసుకోవాలి.
- బడికి వెళ్లేముందు టైమ్ టేబుల్ ప్రకారం పుస్తకాలు సర్దుకోవడం, యూనిఫామ్ వేసుకోవడం, షూ పాలిష్ లాంటి పనులు సొంతంగా చేసుకోవడాన్ని పిల్లలకు నేర్పించాలి.
- పిల్లలకు ఉదయాన్నే పాలు తాగడం, అల్పాహారం తీసుకోవడం అలవాటు చేయాలి.
- పిల్లలు బడికి బయలుదేరేముందు తల్లిదండ్రులు ప్రశాంత వదనంతో వీడ్కోలు చెప్పాలి.
- బడి నుంచి ఇంటికి రాగానే కొంత సమయం విరామం ఇచ్చి పిల్లల చేత హోమ్‌వర్క్ పూర్తి చేయిస్తే ఉదయం లేవగానే ఆందోళన ఉండదు.
- పరీక్షలప్పుడు పిల్లలు ఒత్తిడికి గురికాకుండా ప్రోత్సాహకరమైన మాటలు చెబితే వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.
- స్పష్టమైన పదాలతో తేలికపాటి సూచనలు చేస్తూ ఉంటే పిల్లలు అన్ని పనులూ సులభంగానే నేర్చుకుంటారు.

సంకల్పం



# గౌరమ్మ తెచ్చిన గంగమ్మ

**మహాకుంభ మేళాకు వెళ్లి గంగలో మునకేయాలనేది ఆమె కోరిక. ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో ఆ ప్రయత్నం విరమించుకున్నారు. కానీ... ఒంటరిగా శ్రమించి గంగమ్మనే తన ఇంటికి తెచ్చారు. మహాసంకల్పంతో పెరట్లో భావిని తవ్వి... మహాశివరాత్రినాడు అందులో పవిత్ర స్నానం ఆచరించేందుకు సిద్ధమయ్యారు యాభై ఏడేళ్ల కర్ణాటక మహిళ... గౌరీచంద్రశేఖర్. గంగమ్మను భువికి తెచ్చిన గౌరమ్మ కథ ఇది.**

'ప్రయాగరాజ్ మహాకుంభ మేళాకు వెళ్లాలంటే అదృష్టం ఉండాలి. నాకు అంతటి అదృష్టం లేదు. కారణం... నా ఆర్థిక పరిస్థితి. అందుకే ఆ గంగమ్మనే ఇక్కడకు తేవాలనుకున్నాను. దాని కోసం మా ఇంటి వెనుక భావి తవ్వాలని నిర్ణయించుకున్నాను' అంటున్న గౌరీది కర్ణాటక రాష్ట్రం ఉత్తర కన్నడ జిల్లా సిర్సీ గ్రామం. అక్కడ ఆమెకు చిన్నపాటి వ్యవసాయ క్షేత్రం ఉంది. దానిపై వచ్చే ఆదాయంతో ఇల్లు గడవడమే కష్టమైపోవడంతో కొబ్బరి తోటలో కూలి పనికి వెళుతున్నారు. గౌరీకి మహాకుంభ మేళ గురించి గత ఏడాది డిసెంబరులో తెలిసింది. ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లి త్రివేణి సంగమంలో మునగాలని తొలుత భావించారు. అయితే ఖర్చుల లెక్కలు వేసుకొంటే అది తనవల్ల అయ్యే పని కాదని తెలిసి, ప్రయాణం విరమించుకున్నారు.

అలాగని అంతటితో వదిలేయలేదు. గంగ దగ్గరకు తను వెళ్లలేకపోవచ్చు. కానీ ఆ గంగనే తన ఇంటికి రప్పించి తన కోరిక నెరవేర్చుకోవాలని అనుకున్నారు. వెంటనే రంగంలోకి దిగారు. డిసెంబరు 15న భావి తవ్వడం ప్రారంభించారు. రోజుకు ఎనిమిది గంటల చొప్పున శ్రమించారు. తవ్వడం, తవ్విన మట్టిని బయటకు తోడేయడం... వేరొకరి సాయం లేకుండా అన్నీ తానే చేసుకున్నారు. రెండు నెలలు కష్టపడి... 40 అడుగుల లోతు వరకు తవ్వారు. చివరకు ఈ నెల 15న పని పూర్తి చేసి, భువి నుంచి గంగమ్మను పరవళ్లు తొక్కించారు.

'మహాశివరాత్రి పర్వదినాన ఈ గంగలో పవిత్ర స్నానం చేస్తాను' అంటూ ఎంతో ఉద్వేగంగా చెప్పారు గౌరీ. ఎవరి సాయం లేకుండా బావులు తవ్వడం ఆమెకు ఇదే మొదటి సారి కాదు. గతంలో మూడు బావులు తవ్వారు. ఒకటి సాగు కోసం... తన వ్యవసాయ క్షేత్రంలో. మరొకటి తన గ్రామంలో... ప్రజల దప్పిక తీర్చడానికి. మూడోది అంగన్‌వాడీ పాఠశాలలో... విద్యార్థుల కోసం.

**ప్రతిఘటనలు తిప్పికొట్టి...**

విద్యార్థులు, టీచర్ల కోసం అంగన్‌వాడీ స్కూల్‌లో బావి తవ్వే క్రమంలో ఆమెకు జిల్లా అధికారుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఇక్కడ అందుకు అనుమతి లేదని, తక్షణమే పనులు ఆపేయాలని డిప్యూటీ కమిషనర్ ఆదేశించారు. బావి తవ్వకం ప్రారంభ సమయంలో వచ్చి, గౌరీని అభినందించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఆ తరువాత అభ్యంతరం వ్యక్తం చేశారు. తవ్వడానికి వీల్లేదని మాట మార్చారు. కానీ గౌరీ ఇవేవీ పట్టించుకోలేదు. నలు



గురికీ ఉపయోగపడే ఒక మంచి పని కోసం వెనకడుగు వేసేది లేదని ఆమె తేల్చి చెప్పారు. అప్పటి స్థానిక ఎంపీ అనంత్‌కుమార్ హెగ్డే మద్దతుతో 45 అడుగుల లోతు వరకు తవ్వి, బావి పూర్తి చేశారు. అందులో నీటి ఊట చూశాక తన మనసు ఆనందంతో ఉప్పొంగిందంటారు గౌరీ. సమాజం కోసం ఆమె చేస్తున్న అలుపెరుగని కృషికి ప్రజలు, ప్రభుత్వం, పలు సంస్థల నుంచి ఎన్నో ప్రశంసలు, అభినందనలు, గౌరవ సత్కారాలు అందుకున్నారు.



ఫ్యాషన్

సంప్రదాయ వేడుకల్లో తెలుగుతనం ఉట్టిపడాలంటే ఇతరత్రా ఆభరణాలతో పాటు పాదాలకు 'పాయల్' కూడా ధరిస్తూ ఉండాలి. వాటిలో తాజాగా మగువల మనసులను దోచుకుంటున్న డిజైన్లు, మోడల్స్ ఇవే!


# గజ్జె ఘల్లుమన్నది



**వెండి వెలుగులు:** మువ్వల పట్టీలు అనగానే కళ్లముందు వెండి పట్టీలే మెదులుతాయి. అయితే తాజాగా పాత కాలంనాటి వెడల్పాటి పట్టీల ట్రెండ్ మళ్లీ పునరావృతమైంది. కాబట్టి ఒకటిన్నర అంగుళం వెడల్పు ఉండే పట్టీలు ఎంచుకోవాలి. ఆక్సిడైజ్ చేసినవైనా, చేయనివైనా పరవాలేదు. మరింత ఆకర్షణీయంగా కనిపించడం కోసం ఎనామిల్ లేదా రాళ్లు పొదిగిన పట్టీలు ఎంచుకుంటే చాలు!



**ఆధునిక అలంకరణ:** ఆధునిక వస్త్రధారణకు కాలి పట్టీల అలంకరణ నప్పదేమో అనుకోవలసిన అవసరం లేదు. ఇలాంటి దుస్తులకు నప్పేలా 'సింగిల్ చైన్ యాంక్లెట్స్' కూడా తయారవుతున్నాయి. సన్నగా, మెరుపులీనే నగిషీలతో కూడిన ఈ రకం పట్టీలు ఎంతో సొగసుగా కనిపిస్తాయి. 10 నుంచి 25 గ్రాముల బరువులో దొరికే ఈ పట్టీలు కొనేటప్పుడు లింకులు బలంగా ఉన్నాయో లేదో సరి చూసుకోవాలి. అలాగే రెండు చివర్లూ కలిపే కొక్కెం దృఢంగా ఉండేలా చూసుకోవాలి.



**ముత్యాల పట్టీలు:** మధ్యస్తంగా ఉండే ముత్యాలతో తయారయ్యే ఈ రకం కాలి పట్టీలు నేటి తరం అమ్మాయిలకు చక్కగా నప్పుతాయి. ముత్యాల మధ్యలో వెండి లేదా బంగారంతో తయారైన గుండ్లు జోడించి తయారుచేసే ఈ పట్టీలు అటు సంప్రదాయ వేడుకలకూ, ఇటు ఆధునిక విందు వినోదాల్లో ధరించడానికి అనువుగా ఉంటాయి.

# బిజినెస్



## బీఈ నుంచి చికున్‌గున్యా వ్యాక్సిన్

### బవేరియన్ నార్డిక్‌తో కంపెనీ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న బయోలాజికల్-ఈ (బీఈ) లిమిటెడ్. చికున్‌గున్యా వ్యాక్సిన్ తయారీకి సిద్ధమవుతోంది. ఇందు కోసం డెన్మార్క్‌కు చెందిన బవేరియన్ నార్డిక్ కంపెనీతో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద బవేరియన్ నార్డిక్.. చికున్‌గున్యా వ్యాక్సిన్ తయారీకి అవసరమైన టెక్నాలజీ, తయారీ ప్రక్రియలను అందజేస్తుంది. ఈ టెక్నాలజీ ఆధారంగా బయోలాజికల్-ఈ లిమిటెడ్ జినోమ్ వ్యాలీలోని తన ప్లాంటులో ఈ వ్యాక్సిన్లు తయారు చేస్తుంది. దీని ద్వారా మరో 300 మందికి ఈ ప్లాంటులో ఉద్యోగావకాశాలు ఏర్పడతాయి. ఇక్కడ తయారు చేసే చికున్‌గున్యా వ్యాక్సిన్లను అల్పాదాయ, మధ్య రకం ఆదాయం ఉన్న దేశాలకు సరఫరా చేస్తారు.

### అమర రాజా ఇన్‌ఫ్రాకు 300 మెగావాట్ల

## సోలార్ పీవీ ప్రాజెక్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమరా రాజా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ మరో భారీ ఈపీసీ కాంట్రాక్టును దక్కించుకుంది. ఆంధ్రప్రదేశ్, శ్రీసత్య సాయి జిల్లాలోని రామగిరి వద్ద సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) ఏర్పాటు చేసే 300 మెగావాట్ల సోలార్ పీవీ ప్రాజెక్ట్ కాంట్రాక్టు కంపెనీకి దక్కింది. ఈ కాంట్రాక్టు కింద అమర రాజా ఇన్‌ఫ్రా ఈ ప్రాజెక్టుకు అవసరమైన బ్యాలెన్స్ ఆఫ్ సిస్టమ్స్ (బీఓఎస్), 220 కేవీ పూలింగ్ సబ్‌స్టేషన్, 220 కేవీ పవర్ ట్రాన్స్‌మిషన్ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తుంది. మొత్తం 1,100 ఎకరాల్లో ఏర్పాటు చేసే ఈ ప్రాజెక్టును అమర రాజా ఇన్‌ఫ్రా 12 నెలల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది.

### 2047 నాటికి భారత ఫార్మా పరిశ్రమ

# రూ.43 లక్షల కోట్లకు..

### ఆర్ అండ్ డీ, ఇన్నోవేషన్ వ్యయాలకు ప్రోత్సాహకాలివ్వాలి.. జీ 20 షెర్పా అమితాబ్ కాంత్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రపంచానికి జెనరిక్ ఔషధాలు అందించడంలో ముందువరుసలో ఉన్న భారత ఫార్మా రంగం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ), ఇన్నోవేషన్‌పై అధికంగా పెట్టుబడులు పెట్టాలని జీ 20 షెర్పా అమితాబ్ కాంత్ అన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న బయో ఏషియా సదస్సులో మంగళవారం ప్రధానోపన్యాసం ఇస్తూ ప్రస్తుతం 5,000 కోట్ల డాలర్లున్న (రూ.4.3 లక్షల కోట్లు) భారత ఫార్మా రంగం 2047 నాటికి 50,000 కోట్ల డాలర్లకు (రూ.43 లక్షల కోట్లు) చేరుతుందని అంచనా అని చెప్పారు. ఫార్మా ఎగుమతులు 2019 నాటికి 1,900 కోట్ల డాలర్లుండగా (రూ.1.63 లక్షల కోట్లు) 2024 నాటికి 2,800 కోట్ల డాలర్లకు (రూ.2.41 లక్షల కోట్లు) చేరాయన్నారు. ఔషధ పరిశోధన, ఉత్పత్తిలో భారతదేశ సామర్థ్యాలేమిటన్నది కొవిడ్-19 సమయంలో ప్రపంచానికి తెలిసిందని ఆయన చెప్పారు. ఔషధాల ఉత్పత్తిలో పరిమాణపరంగా మన దేశం ప్రపంచంలో మూడో స్థానంలోను, విలువపరంగా 12వ స్థానంలోను నిలుస్తోందని తెలిపారు. అమెరికాలో వినియోగించే చేసే ప్రతి మూడు ఔషధాల్లో ఒకటి, బ్రిటన్‌లో ప్రతి నాలుగింటిలోనూ ఒకటి భారత్‌లో ఉత్పత్తి అవుతున్నవేనని కాంత్ చెప్పారు.

#### బయోసిమిలర్స్‌కు మంచి అవకాశాలు

ప్రపంచంలో నాన్ కమ్యూనికబుల్ వ్యాధులు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో మన ఔషధ కంపెనీలు బయోలాజికల్స్, బయోసిమిలర్స్‌పై దృష్టి సారించాలని కాంత్ సూచించారు. 2030 నాటికి ఈ వ్యాధులు మరింతగా విజృంభిస్తాయన్న అంచనాల నడుమ మన ఫార్మా కంపెనీలకు చక్కని వృద్ధి అవకాశాలున్న ఈ విభాగంపై దృష్టి సారించాలని సూచించారు మన ఫార్మా కంపెనీలు కేవలం తయారీదారులుగా కాకుండా ఇన్నోవేటర్లుగా ఎదగాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పారు. అయితే ఇలాంటి పెట్టుబడుల్లో రిస్క్ అధికంగా ఉంటుందంటూ ఇందుకు కంపెనీలు ముందుకు రావాలంటే అభివృద్ధి దశలోని ఔషధాలు, ఆర్ అండ్ డీ వ్యయాలపై ప్రభుత్వం తగినన్ని ప్రోత్సాహకాలివ్వడం అవసరమని సూచించారు. డిస్కవరీ ఆధారిత ఇన్నోవేషన్‌లో కార్పొరేట్ పెట్టుబడులకు జీఎస్‌టీ మినహాయింపులు కల్పించే విషయం కూడా పరిశీలించాలన్నారు. అలాగే ఈ తరహా ఇన్నోవేషన్‌కు అనుకూల వాతావరణం కల్పించడం కూడా అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. నియంత్రణలు మరింతగా సడలించాలని, అనవసరమైన నిబంధనలు రద్దు చేసి తద్వారా నియంత్రణ యంత్రాంగాన్ని పరిశ్రమకు సహాయకారిగా ఉండేలా చూడాలని ఆయన సూచించారు. బయో ఏషియా సదస్సులో ఈ అంశాలన్నింటినీ సమూలంగా చర్చించి తగు సూచనలతో ముందుకు వచ్చినట్టయితే ఇన్నోవేషన్‌కు అనుకూలమైన చర్యలు తీసుకునేలా ప్రభుత్వంతో సంప్రదింపులు జరపవచ్చని కాంత్ చెప్పారు.

### ఇన్నోవేషన్‌లో రిస్క్ అధికం

ఇన్నోవేషన్ అత్యంత రిస్క్‌తో కూడుకున్న అంశమని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ కో చైర్మన్ జీవీ ప్రసాద్ అన్నారు. 1994లో డ్రగ్ డిస్కవరీలో ప్రవేశించిన తాము 30 సంవత్సరాల పాటు శ్రమపడినా ఆశించిన ఫలితాలు సాధించలేకపోయామని చెప్పారు. మంగళవారం సాయంత్రం జరిగిన సీఈఓ కాంక్లేవ్‌లో ఆయన మాట్లాడుతూ.. ఇన్నోవేషన్ విభాగంలో కంపెనీలు అధికంగా పెట్టుబడులు పెట్టాలంటే ఆ విభాగంతో ముడిపడి ఉన్న రిస్క్‌లకు సంసిద్ధమై నిధులందించే వెంచర్ క్యాపిటలిస్టులు రావడం కూడా అవసరమని పేర్కొన్నారు. చైనాతో పోల్చితే మన ఇన్నోవేషన్ వ్యవస్థ కూడా చాలా బలహీనంగా ఉన్నదని ప్రసాద్ చెప్పారు. కేవలం దశాబ్ది కాలంలో ఇన్నోవేషన్‌లో చైనా ప్రపంచంలో రెండో స్థానానికి ఎదిగిందని ఆయన అన్నారు. చైనా అనుసరిస్తున్న సానుకూల విధానాలే అందుకు కారణమని ప్రసాద్ చెప్పారు.

## మరింత కట్టుదిట్టంగా ఈక్విటీ డెరివేటివ్స్:సెబీ

న్యూఢిల్లీ: ఈక్విటీ డెరివేటివ్స్‌లో ట్రేడింగ్‌ను మరింత కట్టుదిట్టం చేయాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ భావిస్తోంది. ఇందుకోసం కొన్ని ప్రతిపాదనలతో ఒక చర్చా పత్రం విడుదల చేసింది. ఈ చర్చా పత్రంపై సంబంధిత వర్గాలు వచ్చే నెల 17వ తేదీలోగా తమ సూచనలు, అభిప్రాయాలు తెలియజేయాలని కోరింది. ఎఫ్ అండ్ ఓ, ఓపెన్ ఇంట్రెస్ట్ (ఓఐ) విభాగాల్లో ట్రేడింగ్ సామర్థ్యం, వెసులుబాటు పెంచడం, రియల్ టైమ్ సమాచారం ఆధారంగా ఎప్పటికప్పుడు నష్ట భయ (రిస్క్) పర్యవేక్షణను మరింత పటిష్ఠం చేసే కృషిలో భాగంగా సెబీ ఈ చర్చా పత్రం విడుదల చేసింది. ఈ ప్రతిపాదనలు అమల్లోకి వస్తే ఎఫ్ అండ్ ఓ, ఓఐ పొజిషన్లపై మదుపరులు రియల్ టైమ్ సమాచారం ఆధారంగా సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు. దీనికి తోడు నష్టభయాలను సమర్థవంతంగా నిర్వహించుకోవడంతో పాటు మేలైన నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

## ఐదు రోజుల నష్టాలకు బ్రేక్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం మిశ్రమంగా ముగిసాయి. సెన్సెక్స్ ఐదు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. ఫైనాన్షియల్, ఎఫ్ఎంసీజీ కంపెనీల షేర్ల లాభాలతో 147.71 పాయింట్ల లాభంతో సెన్సెక్స్ 74,602.12 వద్ద ముగిసింది. ట్రేడింగ్ చివర్లో ఫార్మా, మెటల్, ఐటీ కంపెనీల షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో నిఫ్టీ మాత్రం వరుసగా ఆరో రోజూ స్వల్పంగా 5.8 పాయింట్లు నష్టపోయి 22,547.55 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల షేర్లలో 17 కంపెనీల షేర్లు లాభాలతో, 13 కంపెనీల షేర్లు నష్టాలతో ముగిశాయి. ఆసియా, అమెరికా మార్కెట్లు బలహీనంగా ఉండడం, కొనసాగుతున్న ఎఫ్‌పీఐల అమ్మకాలతో మదుపరులెవరూ కొనుగోళ్లపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనం, ట్రంప్ సుంకాల హెచ్చరికలు కూడా ఇందుకు దోహదం చేస్తున్నాయి. కాగా జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ మంగళవారం నాన్ కన్వర్టబుల్ బాండ్ల జారీ ద్వారా రూ.1,100 కోట్లు సమీకరించింది.

#### నేడు మార్కెట్లకు సెలవు

మహా శివరాత్రి సందర్భంగా బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజీలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు ప్రకటించారు. ఫారెక్స్, బులియన్ మార్కెట్లు కూడా పనిచేయవు. గురువారం మార్కెట్లు యథావిధిగా పనిచేస్తాయి.

#### 'బేర్'మన్న రూపాయి

ఫారెక్స్ మార్కెట్లో రూపాయి మారకం రేటు మరోసారి 'బేర్'మంది. మంగళవారం ఉదయం డాలర్‌తో 11 పైసల నష్టంతో రూ.86.83 వద్ద ప్రారంభమైన రూపాయి చివరికి 47 పైసల నష్టంతో రూ.87.19 వద్ద ముగిసింది. వచ్చే కొద్ది రోజుల్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు రూ.86.85-87.40 మధ్య ట్రేడయ్యే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. ముడి చమురు ధర మరింత తగ్గితే తప్ప ఇప్పట్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు పుంజుకునే అవకాశం కనిపించడం లేదు.

## మరో పదేళ్లలో రూ.2.2 లక్షల కోట్ల స్థాయికి..

» భారత సీఆర్‌డీఎంఓ మార్కెట్‌పై బీసీజీ గ్రూప్ అంచనా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కాంట్రాక్ట్ పద్ధతిలో జరిగే పరిశోధన, అభివృద్ధి, తయారీ (సీఆర్‌డీఎంఓ) విభాగాల్లో భారత ఔషధ పరిశ్రమకు మంచి భవిష్యత్ కనిపిస్తోంది. ప్రస్తుతం ప్రపంచ సీఆర్‌డీఎంఓ మార్కెట్ పరిమాణం 14,000 కోట్ల డాలర్లుగా ఉంది. ఇందులో భారత్ వాటా 2 నుంచి 3 శాతం మాత్రమే. అయితే ప్రస్తుతం భారత సీఆర్‌డీఎంఓ మార్కెట్ ఏటా సగటున 15 శాతం చొప్పున పెరుగుతోంది. వృద్ధి రేటు ఇలానే కొనసాగితే 2035 నాటికి భారత సీఆర్‌డీఎంఓ మార్కెట్ 2,200 కోట్ల డాలర్ల నుంచి 2,500 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.2 లక్షల కోట్లు) స్థాయికి చేరే అవకాశం ఉందని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) ఒక నివేదికలో తెలిపింది. తక్కువ ఖర్చుతో చిన్నచిన్న మాలిక్యూల్స్ అభివృద్ధి, సరికొత్త బయోలాజిక్స్ అభివృద్ధి చేయడంలో భారత కంపెనీలకు ఉన్న సామర్థ్యం ఇందుకు కలిసి వస్తుందని బీసీజీ అంచనా. పశ్చిమ దేశాల ఫార్మా కంపెనీలు చైనాకు ప్రత్యామ్నాయ సరఫరా మార్గాల కోసం చేస్తున్న అన్వేషణ కూడా భారత సీఆర్‌డీఎంఓ కంపెనీలకు 1,000 కోట్ల డాలర్ల వ్యాపారం తెచ్చిపెట్టనుంది. యాంటీ డ్రగ్ కాంజుగేట్స్ (ఏడీసీ), డీఎన్ఏ, ఆర్ఎన్ఏ చికిత్సా విధానాలు, సీఆర్‌డీఎంఓ ప్రోత్సాహం కోసం ప్రభుత్వం కేటాయించిన రూ.25,000 కోట్ల ప్రత్యేక నిధి ఇందుకు మరింత దోహదం చేస్తాయని బీసీజీ పేర్కొంది.

## వారానికి 47.5 పని గంటలు చాలు

» క్యాప్‌జెమినీ సీఈఓ అశ్విన్



ముంబై: ఉద్యోగులు వారానికి 70 నుంచి 90 గంటలు పని చేయాలనే వాదనని ప్రముఖ ఐటీ సేవల కంపెనీ క్యాప్‌జెమినీ ఇండియా సీఈఓ అశ్విన్ యార్డి తోసిపుచ్చారు. రోజుకు 9.5 గంటల చొప్పున వారంలో ఐదు రోజుల పని చేస్తే చాలన్నారు. వారాంతాల్లో ఆఫీసు పని కోసం ఉద్యోగులకు ఈ-మెయిల్స్ పంపే విధానానికీ తాను వ్యతిరేకమన్నారు. నాస్కామ్ టెక్నాలజీ అండ్ లీడర్‌షిప్ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సంపన్న భారత్ కోసం ఉద్యోగులు వారానికి 70 గంటలు పని చేస్తే బాగుంటుందని ఇన్ఫోసిస్ వ్యవస్థాపక చైర్మన్ నారాయణ మూర్తి, కాదు 90 గంటలు పని చేయాలని ఎల్ అండ్ టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రమణియన్ ఇటీవల సూచించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో క్యాప్‌జెమినీ ఇండియా సీఈఓ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. ఉద్యోగులు ఎన్ని గంటలు పని చేశారనిగాక, వారి నుంచి ఎంత ఉత్పాదకత వచ్చిందనేది అత్యంత ముఖ్యమని యార్డి అన్నారు.

## 'స్టార్టప్స్' ఈక్విటీకీ అనుమతించాలి

### ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి

ముంబై: స్టార్టప్ కంపెనీల ఈక్విటీలోనూ బ్యాంకుల పెట్టుబడులను అనుమతించాలని ఎస్‌బీఐ చైర్మన్ సీ శ్రీనివాసులు శెట్టి కోరారు. ముంబైలో జరుగుతున్న నాస్కామ్ టెక్నాలజీ అండ్ లీడర్‌షిప్ సదస్సులో ఆయన ఈ సూచన చేశారు. ప్రస్తుతం తమకు ఈ కంపెనీలకు రుణాలు సమకూర్చే స్వేచ్ఛ తప్ప.. ఈక్విటీలో పెట్టుబడులు పెట్టే స్వేచ్ఛ లేదన్నారు. స్టార్టప్ కంపెనీల ఈక్విటీలోనూ బ్యాంకులు పెట్టుబడులు పెట్టే వాతావరణం దేశంలో ఏర్పడాలని తాను కోరుకుంటున్నట్టు తెలిపారు. స్టార్టప్ కంపెనీలకు రూ.100 కోట్ల వరకు ఇచ్చే రుణాల చెల్లింపులకు ఒక హామీ పథకం తీసుకు వచ్చే యోచనలో కేంద్రం ఉన్నట్టు శెట్టి వెల్లడించారు. స్టార్టప్ కంపెనీల రుణ అవసరాల కోసం ఎస్‌బీఐ దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఏడు ప్రత్యేక శాఖలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

#### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 26వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 445 | విజయవాడ | 485 |
| వరంగల్ | 447 | గోదావరి | 480 |
| చిత్తూరు | 493 | విశాఖపట్నం | 480 |
| | | దజను గుడ్లు రూ. 60 | |

#### ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 70 | విజయవాడ | 71 |
| వరంగల్ | 70 | గుంటూరు | 71 |
| కరీంనగర్ | 70 | ఒంగోలు | 71 |
| మహబూబ్‌నగర్ | 70 | చిత్తూరు | 68 |
| కర్నూలు | 70 | నెల్లూరు | 72 |
| విశాఖపట్నం | 70 | అనంతపురం | 72 |
| గోదావరి | 71 | | |

#### బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 88,090 ▲ | 80,750 ▲ | 1,08,000 ▲ |
| విజయవాడ | 89,500 ▲ | 84,500 ▲ | 99,000 ▲ |
| విశాఖపట్నం | 86,700 ▲ | 79,480 ▲ | 95,840 ▼ |
| రాజమండ్రి | 88,090 ▲ | 80,750 ▲ | 98,800 ▼ |
| ప్రొద్దుటూరు | 88,750 ▲ | 82,140 ▲ | 98,000 ▼ |
| ముంబై | 86,647 ▲ | 79,369 ▲ | 95,769 ▼ |

# స్పోర్ట్స్



## ఒక్క బంతీ పడలేదు..

### ఆసీస్-దక్షిణాఫ్రికా మ్యాచ్ రద్దు — చాంపియన్స్ ట్రోఫీ

రావల్పిండి: చాంపియన్స్ ట్రోఫీకి తొలిసారిగా వరుణుడు అడ్డుపడ్డాడు. దీంతో మంగళవారం జరగాల్సిన ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా గ్రూప్ 'బి' మ్యాచ్ ఒక్క బంతీ పడకుండానే రద్దయ్యింది. సరిగ్గా మ్యాచ్‌కు గంట ముందే వర్షం మొదలవడంతో పిచ్‌ను కవర్లతో కప్పేశారు. కనీసం టాస్ వేసేందుకు కూడా వరుణుడు అవకాశమివ్వలేదు. నిరంతరాయంగా వాన కురుస్తూనే ఉండడంతో 20 ఓవర్ల మ్యాచ్ కూడా వీలుపడలేదు. చివరకు భారత కాలమాన ప్రకారం సాయంత్రం 5.43కు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. ఈ ఫలితంతో ఆసీస్-దక్షిణాఫ్రికా జట్లకు చెరో పాయింట్ లభించింది. మరోవైపు చాంపియన్స్ ట్రోఫీలో ఆస్ట్రేలియా ఆడిన చివరి ఎనిమిది మ్యాచ్‌ల్లో ఫలితం తేలకుండా ముగియడం ఇది నాలుగోసారి.

#### మైదానమంతా కప్పలేరా?

భారీ వర్షం కురుస్తుంటే కేవలం పిచ్ ప్రాంతం మాత్రమే కప్పి, అవుట్ ఫీల్డ్‌ను కప్పకుండా ఎందుకు వదిలేశారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏ మాత్రం ఏర్పాట్లు చేయని పాక్ బోర్డు అసలు ఐసీసీ అందించిన నిధులను సక్రమంగా ఖర్చు చేస్తున్నట్టు లేదని భారత మాజీ ఆటగాడు మహ్మద్ కైఫ్ అన్నాడు.

## మ్యాచ్‌లన్నీ ఒక్కచోటే ఆడిస్తే ఎలా?

### టీమిండియా షెడ్యూల్‌పై మాజీల విమర్శ

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా ఆడే మ్యాచ్‌లన్నింటినీ దుబాయ్‌లోనే నిర్వహించడాన్ని పలువురు మాజీలు తప్పుపడుతున్నారు. రోహిత్ సేన ఎక్కడికీ వెళ్లకుండా ఒకే వేదికపై మ్యాచ్‌లు ఆడడం వారికి లాభిస్తోందని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్లు గుర్తు చేశారు. 'భారత జట్టు కేవలం దుబాయ్‌లోనే మ్యాచ్‌లు ఆడడం వారికి ఎంతో కొంత లాభిస్తుంది' అని మైక్ అథర్టన్ అన్నాడు. అలాగే యూఏఈలో పిచ్‌లు స్పిన్‌కు అనుకూలమనే అంచనాతో భారత జట్టు ఎక్కువ మంది స్పిన్నర్లను తీసుకుందని నాసిర్ హుస్సేన్ చెప్పుకొచ్చాడు. కాగా, 'భారత్ ఇప్పటికే అన్ని విభాగాల్లో బలంగా ఉన్న జట్టు. దీనికి తోడు మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లో ఆడుతుండడం వీరికి మరింత కలిసిరానుంది' అని గాయంతో టోర్నీకి దూరమైన ఆస్ట్రేలియా జట్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ కూడా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్టు మీడియాలో వార్తలు వచ్చాయి.



## కుల్దీప్.. ఫినిషర్

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

భారత పరిమిత ఓవర్ల జట్టులో ఎడమచేతి మణికట్టు మాంత్రికుడు కుల్దీప్ యాదవ్‌ది కీలక స్థానం. అతడి మ్యాజిక్ బంతులను అర్థం చేసుకోలేక ప్రత్యర్థి బ్యాటర్లు బోల్తా పడుతుంటారు. ఆదివారం పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో అతడి బంతుల ప్రభావం అంతా ఇంతా కాదు. ఆ మ్యాచ్‌లో పాక్ ఓ దశలో 200/5తో భారీస్కోరు దిశగా వెళుతోంది. మరో 8 ఓవర్లు కూడా ఉన్నాయి. ఆ సమయంలో కెప్టెన్ రోహిత్ లెగ్గీ కుల్దీప్‌నే నమ్ముకున్నాడు. 43వ ఓవర్‌లో బంతి చేతపట్టిన అతను ఫామ్‌లో ఉన్న సల్మాన్ ఆఘాతో పాటు షహీన్‌ను వరుసగా పెవిలియన్ చేర్చి పాక్‌ను కంగారెత్తించాడు. గూగ్లీలతో పాటు బంతిని కాస్త స్వింగ్ చేయగల వైవిధ్యం కారణంగా కుల్దీప్ చివరి 10 ఓవర్లలోనూ ప్రభావం చూపగలుగుతున్నాడు. వాస్తవానికి అతను గాయం నుంచి కోలుకుని జట్టులోకి వచ్చినా, ఇప్పటివరకు మెరుగైన ప్రదర్శనే కనబర్చాడు. 2015 నుంచి 40-45 ఓవర్ల మధ్య కుల్దీప్ 25 వికెట్లు తీశాడు. రషీద్, జంపా మాత్రమే అతడికన్నా ఎక్కువ వికెట్లు తీయగలిగారు. వైవిధ్యంగా బంతులు వేస్తే స్పిన్నర్లను ఎదుర్కోవడం బ్యాటర్లకు కష్టమని, అందుకే డెత్ ఓవర్లలో రోహిత్ తనను ఎంపిక చేసుకుంటున్నట్టు కుల్దీప్ చెబుతున్నాడు. దుబా య్ వికెట్ కూడా నెమ్మదిగా ఉండడం అతడికి కలిసివస్తోంది. అయితే ఇటీవల మరో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి విశేషంగా రాణిస్తుండడంతో కుల్దీప్‌కు చోటు కష్టమేననే భావన వ్యక్తమైంది. చాంపియన్స్ ట్రోఫీలో జడేజా, అక్షర్‌లకు తోడు వరుణ్ ఉంటాడనే అనుకున్నారంతా. 'వైట్‌బాల్ క్రికెట్‌లో కుల్దీప్ రికార్డు చూడండి. అతడు మ్యాచ్‌లో ఏ దశలోనైనా బౌలింగ్ చేసి పరుగులను కట్టడి చేయగలడు. అలాగే భాగస్వామ్యాలను విడదీసే సామర్థ్యం కూడా ఉంది. అందుకే అతను ఫిట్‌గా ఉంటే తుది జట్టులోకి కచ్చితంగా వస్తాడు' అని ఓ మాజీ స్పిన్నర్.. కుల్దీప్‌నకు మద్దతు పలికాడు. పాక్‌తో మ్యాచ్‌లో కుల్దీప్ తొలి పవర్‌ప్లే నుంచి 45 ఓవర్ల మధ్యలో బౌలింగ్ చేశాడు. అతడి 9 ఓవర్లలో మూడు ఫోర్లు మాత్రమే రాగా, 3 వికెట్లు పడగొట్టాడు. పేసర్ మహ్మద్ షమి, టోర్నీలో ఇంకా ఆడని అర్ష్‌దీప్‌లాంటి చక్కటి యార్కర్ బౌలర్లు కలిగిన జట్టులో మణికట్టు స్పిన్నర్ కుల్దీప్ డెత్ ఓవర్లలో నమ్మదగ్గ ప్లేయర్‌గా మారడం విశేషమే.

## ఒలింపిక్ విజేతకు షాకిచ్చారు

### భారత హాకీ అమ్మాయిల అద్భుత విజయం

భువనేశ్వర్: భారత మహిళల హాకీ జట్టు ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో అద్భుత విజయం సాధించింది. మంగళవారం జరిగిన పోరులో పారిస్ ఒలింపిక్స్ చాంపియన్, ప్రపంచ నెంబర్‌వన్ నెదర్లాండ్స్‌కు షాకిచ్చింది. నిర్ణీత సమయానికి ఇరుజట్లు 2-2 గోల్స్‌తో నిలిచాయి. దీంతో ఫలితం తేల్చే షూటౌట్‌లో దీపిక, ముంతాజ్ చెరో గోల్ సాధించడంతో భారత్ 2-1తో డిఫెండింగ్ చాంప్ నెదర్లాండ్స్‌ను చిత్తుచేసింది. షూటౌట్‌లో డచ్ తరపున ఏకైక గోల్‌ను మార్టిన్ వీన్ చేసింది. వెటరన్ గోల్‌కీపర్ సవిత పూనియా ప్రత్యర్థి నాలుగు గోల్స్ ప్రయత్నాలను సమర్థ వంతంగా అడ్డుకొని భారత్ విజయంలో కీలకపాత్ర పోషించింది.

హెచ్‌ఐ నజరానా: ఒలింపిక్ విజేత నెదర్లాండ్స్‌ను ఓడించిన భారత . జట్టులోని ప్రతి సభ్యురాలికి రూ. లక్ష చొప్పున, సహాయ సిబ్బందికి తలో రూ. 50 వేలు రివార్డు ఇవ్వనున్నట్టు హాకీ ఇండియా (హెచ్‌ఐ) ప్రకటించింది.



## ఓడిన జట్టు ఇంటికే..




**చాంపియన్స్ ట్రోఫీలో నేడు** — ఇంగ్లండ్ X అఫ్ఘానిస్థాన్ — మ.2.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

లాహోర్: చాంపియన్స్ ట్రోఫీలో గ్రూప్ 'ఎ' నుంచి ఇప్పటికే సెమీస్ బెర్త్‌లు ఖరారయ్యాయి. నాలుగు జట్లకు ఇంకా ఒక్కో మ్యాచ్ మిగిలి ఉన్నా భారత్, న్యూజిలాండ్ జట్లు నాకౌట్‌కు అర్హత సాధించిన విషయం తెలిసిందే. ఇక గ్రూప్ 'బి'లో పోరు మాత్రం రసవత్తరంగా మారింది. ఈ గ్రూప్‌లో భాగంగా మంగళవారం జరగాల్సిన ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా మ్యాచ్ రద్దవడంతో ఈ రెండు జట్లు మూడేసి పాయింట్లతో ఉన్నాయి. దీంతో బుధవారం జరిగే ఇంగ్లండ్-అఫ్ఘానిస్థాన్ మ్యాచ్ కీలకం కాబోతోంది. ఎందుకంటే ఈ రెండు జట్లూ తమ తొలి మ్యాచ్‌లో ఓటమితో పాయింట్ల ఖాతానే తెరవలేదు. అంటే.. నేటి మ్యాచ్‌లో గెలిచిన జట్టుకే సెమీస్ అవకాశాలుంటాయి. ఓడిన జట్టు అధికారికంగా టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. స్టార్లతో కూడిన ఇంగ్లండ్ జట్టు ఆసీస్‌పై 351 పరుగులు సాధించినా మ్యాచ్‌ను కాపాడుకోలేకపోయింది. దీనికి తోడు బౌలింగ్ ఆల్‌రౌండర్ బ్రైడన్ కార్స్ గాయంతో టోర్నీకి దూరమయ్యాడు. అతడి స్థానంలో రెహాన్ అహ్మద్‌ను తీసుకున్నారు. డకెట్, రూట్ ఫామ్‌లో ఉండగా సాల్ట్, కెప్టెన్ బట్లర్, బ్రూక్, లివింగ్‌స్టోన్ బ్యాట్లు ఝుళిపిస్తే అఫ్ఘాన్ బౌలర్లు హడలిపోవాల్సిందే. అందుకే స్థాయికి తగ్గ ఆటతీరుతో రాణించి ప్రత్యర్థిపై భారీ విజయం సాధించాలనే కసితో ఇంగ్లండ్ ఉంది. అటు హష్మతుల్లా షాహిది సారథ్యంలోని అఫ్ఘాన్‌ను తేలిగ్గా తీసుకోవడానికి లేదు. ఆ జట్టు గతేడాది టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాకు షాకిచ్చి సెమీస్ చేరిన విషయం మర్చిపోలేం. రహ్మత్ షా, గుర్బాజ్, ఒమర్జాయ్, జద్రాన్ కీలక బ్యాటర్లు. బౌలింగ్‌లో రషీద్, నబీ, నూర్ అహ్మద్‌లతో స్పిన్ విభాగం పటిష్ఠంగా కనిపిస్తోంది. ఏదేమైనా ప్రత్యర్థిపై తమదే పైచేయి కావాలన్న ధ్యేయంతో అఫ్ఘాన్ బరిలోకి దిగుతోంది.

## బి-జట్టుపై కూడా నెగ్గలేరు!

### పాక్ ఆటతీరుపై గవాస్కర్

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీ రేసు నుంచి నాకౌటైన పాకిస్థాన్ జట్టుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భారత్ చేతిలో చిత్తుగా ఓడిన పాక్‌పై మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ సెటైర్లు వేశాడు. భారత ద్వితీయ శ్రేణి జట్టును ఓడించడం కూడా పాక్ వల్లకాదన్నాడు. 'నాకు తెలిసి ప్రస్తుత ఫామ్‌తో భారత్-బి జట్టుపై గెలవడం కూడా పాక్‌కు కష్టమే. సి-టీమ్ విషయం చెప్పలేను. పాక్ రిజర్వు బెంచ్ బలంగా లేకపోవడం ఎంతో ఆశ్చర్యానికి గురి చేస్తోంది' అన్నా డు. కాగా కెప్టెన్‌గా ధోనీని నియమించినా.. పాక్ తలరాతను మార్చలేడని ఆ దేశ మహిళా జట్టు మాజీ కెప్టెన్ సనా మిర్ విమర్శించింది. 'ధోనీ లేదా యూనిస్ ఖాన్‌ను సారథులుగా నియమించినా.. ఈ జట్టుతో ఏమీ చేయలేరు. టోర్నీ కోసం 15 మంది జట్టు సభ్యులను ప్రకటించినప్పుడే ఆశలు వదిలేసుకొన్నా'నని చెప్పింది.

## హైదరాబాద్‌లో రోయింగ్ లీగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా మిషన్‌లో భాగంగా తొలిసారిగా క్రీడాకారిణుల కోసం కేంద్ర క్రీడాశాఖ రోయింగ్ లీగ్‌కు శ్రీకారం చుట్టింది. బుధవారం నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్‌లో అస్మిత రోయింగ్ లీగ్ పేరిట పోటీలను నిర్వహించనున్నారు. ఇందులో మొత్తం ఎనిమిది జట్లు పాల్గొంటున్నాయి. హైదరాబాద్ క్వీన్స్, భోపాల్ వేవ్స్ క్వీన్స్, చెన్నై రాణీస్, కొచ్చిన్ క్వీన్స్, కటక్ రోయింగ్, డెక్కన్ క్వీన్ పుణె, కోల్‌కతా ఆర్-ఓర్స్, లుధియానా టీమ్ రోయింగ్.. జట్లు ఈ లీగ్‌లో పోటీ పడుతున్నాయి.

## దంచేసిన ఢిల్లీ

### జొనాసెన్ అర్ధ శతకం ● 6 వికెట్లతో గుజరాత్ చిత్తు



జొనాసెన్ (61 నాటౌట్)

బెంగళూరు: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఢిల్లీ క్యాపిటల్స్.. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో మూడో విజయాన్ని నమోదు చేసింది. జెస్ జొనాసెన్ (32 బంతుల్లో 61 నాటౌట్) అర్ధ శతకంతోపాటు షఫాలీ (27 బంతుల్లో 44) దూకుడుగా ఆడడంతో.. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 6 వికెట్లతో గుజరాత్ జెయింట్స్‌పై నెగ్గింది. తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 127/9 స్కోరుకే పరిమితమైంది. కాప్, సదర్లాండ్, శిఖా పాండే తలో 2 వికెట్లు పడగొట్టారు. టాపార్డర్ వైఫల్యంతో జట్టు 41/5తో పీకల్లోతు కష్టాల్లో పడిన సమయంలో.. డోటిన్ (26), భారతి ఫుల్మాలి (40 నాటౌట్) ఆదుకున్నారు. తనూజ (16)తో కలసి భారతి ఏడో వికెట్‌కు 51 రన్స్ జోడించడంతో జట్టు స్కోరు సెంచరీ దాటింది. ఓపెనర్ హర్లీన్ డియోల్ (5), లిచ్‌ఫీల్డ్ (0), బెత్ మూనీ (10), కష్వీ గౌతమ్ (0), ఆష్లే గార్డ్‌నర్ (3), సిమ్రన్ నిరాశపరిచారు. ఛేదనలో ఢిల్లీ 15.1 ఓవర్లలో 4 వికెట్లకు 131 రన్స్ చేసి గెలిచింది. ఓపెనర్ షఫాలీ, జొనాసెన్ రెండో వికెట్‌కు 74 పరుగుల భాగస్వామ్యంతో ఢిల్లీని గెలుపు బాటలో నిలబెట్టారు. షఫాలీ వెనుదిరిగినా.. తుదికంటా క్రీజులో నిలిచిన జొనాసెన్ జట్టును గెలిపించింది.

**డబ్ల్యూపీఎల్‌లో నేడు** — ముంబై x యూపీ — రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

#### సంక్షిప్త స్కోర్లు

**గుజరాత్:** 20 ఓవర్లలో 127/9 (భారతి 40 నాటౌట్, డోటిన్ 26; కాప్ 2/17, సదర్లాండ్ 2/20).
**ఢిల్లీ:** 15.1 ఓవర్లలో 131/4 (జొనాసెన్ 61 నాటౌట్, షఫాలీ 44; కష్వీ గౌతమ్ 2/26).

**నేటి నుంచి రంజీ ఫైనల్** — విదర్భ X కేరళ — ఉదయం 9.30 నుంచి

## తాగునీటికే ప్రాధాన్యమివ్వాలి!

- ఆ తర్వాతే సాగునీటికి వినియోగించాలి
- సాగర్, శ్రీశైలం నీటి వినియోగంపై కృష్ణా బోర్డు ఆదేశం
- సాగర్ నుంచి 7 వేల క్యూసెక్కులకు మించి తరలించొద్దు
- ఆంధ్రప్రదేశ్‌ను ఆదేశించిన బోర్డు.. నేడు సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్, శ్రీశైలం రిజర్వాయర్లలో ఉన్న నీటి నిల్వల వినియోగంలో తొలుత తాగునీటి అవసరాలకే ప్రాధాన్యం ఇవ్వాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు స్పష్టం చేసింది. ఆ తర్వాతే సాగునీటి కోసం వినియోగించాలంది. సోమవారం జరిగిన బోర్డు ప్రత్యేక అత్యవసర సమావేశం వివరాలను మంగళవారం విడుదల చేసింది. ఈ నెల 24 నాటికి శ్రీశైలం రిజర్వాయర్ (కనీస నీటి మట్టం 834 అడుగులు)లో 24 టీఎంసీలు, నాగార్జునసాగర్ (కనీస నీటిమట్టం 510 అడుగులు)లో 42.3 టీఎంసీల నిల్వలు ఉన్నాయని బోర్డు తెలిపింది. నీటి కొరత నేపథ్యంలో జూలై 31 దాకా ఈ నిల్వలను తాగునీటి కోసమే వినియోగించాలని తెలుగు రాష్ట్రాలకు స్పష్టం చేసింది. ఒంగోలు చీఫ్ ఇంజనీర్ (ఏపీ), నల్లగొండ చీఫ్ ఇంజనీర్ (తెలంగాణ) సమావేశమై ఏప్రిల్ దాకా సాగునీటి కోసం ఏ మేరకు నీళ్లు అవసరమో చర్చించుకొని, నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. శ్రీశైలం జలాశయం నుంచి నీటి తరలింపును తగ్గించుకోవాలని, నాగార్జునసాగర్ కుడికాలువ నుంచి 7 వేల క్యూసెక్కులకు మించి తరలించరాదని ఏపీకి స్పష్టం చేసింది. తెలుగు రాష్ట్రాలు సమర్పించే నీటి వినియోగ ప్రణాళికపై చర్చించడానికి వీలుగా బుధవారం మధ్యాహ్నం 3:30 గంటలకు కృష్ణా బోర్డు సమావేశం కానుంది. మే 31 దాకా కల్వకుర్తి, నాగార్జునసాగర్ ఎడమ కాలువ, ఏఎమ్మార్పీ కింద 90 టీఎంసీలు, తాగునీటి అవసరాలకు 17 టీఎంసీలు, జూన్ 1 నుంచి జూలై 31 దాకా తాగునీటి అవసరాలకు 9 టీఎంసీలు మొత్తం 116 టీఎంసీల నీటి విడుదలకు ఆదేశాలు ఇవ్వాలని బోర్డును తెలంగాణ కోరింది.

## రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ కిరణ్ సస్పెన్షన్

- భార్య ఫిర్యాదుతో ప్రభుత్వం చర్యలు

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో నెల్లూరు డీఐజీగా ఉన్న వి.కిరణ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కిరణ్ తన భార్యను వేధిస్తున్నట్టు గుంటూరులోని అరండల్‌పేటలో ఎఫ్ఐఆర్ నమోదైందని, గౌరవప్రదమైన ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటూ అనైతిక చర్యలకు పాల్పడుతున్నారంటూ ఆయన భార్య కూడా ఫిర్యాదు చేసినట్టు జీవోలో పేర్కొన్నారు. సస్పెన్షన్ కాలంలో అనుమతి లేకుండా కిరణ్ కుమార్ హెడ్‌క్వార్టర్స్ వదిలివెళ్ల కూడదని ఆదేశించారు.

## అవినీతి అధికారులపై వేటు

- హిందూపురం సీటీఓ, ముగ్గురు డీసీటీఓల సస్పెన్షన్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖలో అవినీతి అధికారులపై వేటు పడింది. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం సర్కిల్‌లో పనిచేస్తున్న వాణిజ్య పన్నుల అధికారి (సీటీఓ) కృష్ణవేణి, ముగ్గురు ఉప వాణిజ్య పన్నుల అధికారు(డీసీటీఓ)లు ఇంతియాజ్, మధుసూదన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డిలను సస్పెండ్ చేస్తూ ఆ శాఖ కమిషనర్ అహ్మద్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. హిందూపురం సర్కిల్ పరిధిలో పట్టుచీరలు, స్క్రాప్ (తుక్కు), డీజిల్, వక్కలకు సంబంధించి జీరో వ్యాపారం సాగుతున్నా ఈ అధికారులందరూ మామూళ్ల మత్తులో అడ్డుకోలేదనే ఆరోపణలపై విచారణ జరిపి ఈ చర్యలు తీసుకున్నారు.

## ఫైబర్‌నెట్ ఇన్‌చార్జి ఎండీగా ప్రవీణ్ ఆదిత్య

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఫైబర్‌నెట్ ఇన్‌చార్జి ఎండీగా మారిటైమ్‌బోర్డు సీఈవో సీవీ ప్రవీణ్ ఆదిత్యను నియమిస్తూ మౌలిక సదుపాయాల కల్పనా శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ డ్రోన్ కార్పొరేషన్, ఏపీ గ్యాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీ బాధ్యతలను కూడా ఆయనకు అప్పగించారు.

# తెలీదు.. మరిచిపోయా.. గుర్తులేదు!

- దర్యాప్తు అధికారుల విచారణలో 'అదుర్స్' చూపించిన వైసీపీ నేత వంశీ

విజయవాడ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పోలీసుల విచారణలో గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీ 'అదుర్స్' సినిమా చూపించారు. వంశీనే నిర్మించిన అదుర్స్ సినిమాలో హీరో కొన్ని సందర్భాల్లో 'తెలీదు.. గుర్తులేదు.. మరిచిపోయా' అని సమాధానాలు చెబుతాడు. ఈ డైలాగులనే పోలీసులు అడిగిన ప్రశ్నలకు.. "తెలీదు, గుర్తులేదు, మరచిపోయా" అని జవాబులు ఇచ్చినట్టు సమాచారం. గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో ఫిర్యాదుదారుడిగా ఉన్న ముదునూరి సత్యవర్ధన్‌ను బెదిరించి, కిడ్నాప్ చేసిన కేసులో ప్రధాన నిందితుడు వల్లభనేని వంశీమోహన్, ఏడో నిందితుడు వెలినేని వెంకట శివరామకృష్ణప్రసాద్, ఎనిమిదో నిందితుడు నిమ్మ లక్ష్మీపతిని విజయవాడ జిల్లా జైలు నుంచి పోలీసులు మంగళవారం ఉదయం కస్టడీకి తీసుకున్నారు. ముందుగా ముగ్గురు నిందితులకు వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం అక్కడి నుంచి కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించారు. ముగ్గురు నిందితులను విచారించడానికి ముగ్గురు ఏసీపీలు రంగంలోకి దిగారు. వల్లభనేని వంశీని సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ విచారించారు. శివరామకృష్ణప్రసాద్‌ను ట్రాఫిక్ ఏసీపీ వంశీధర్ గౌడ్, లక్ష్మీపతిని సీసీఎస్ ఏసీపీ వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. ఒక్కొక్క అధికారి ఒక్కొక్క నిందితుడికి సుమారు 30 ప్రశ్నలు సంధించారు. రెండు గంటల పాటు వారిని విచారించారు. కాగా.. విచారణాధికారి అడిగిన ప్రశ్నలకు కొన్నింటికి మాత్రమే వంశీ సమాధానాలు చెప్పారు. చాలా వాటికి అబద్ధాలు చెప్పారని విచారణాధికారులు భావిస్తున్నారు. సత్యవర్ధన్ తనకు తెలియదని ముందుగా సమాధానమిచ్చారు. విశ్వసనీయ సమాచారం మేరకు విచారణాధికారికి వంశీ చెప్పినజవాబులు ఇవీ..

**అధికారి:** మీరెవరో తెలియకుండా సత్యవర్ధన్ మీ ఇంటికి వచ్చాడా?

**వంశీ:** పదో తేదీ అర్ధరాత్రి తన ఫ్లాట్‌కు వచ్చాడు. రాత్రంతా మా ఫ్లాట్‌లో ఉన్నాడు. 11వ తేదీ ఉదయం వెళ్లిపోయాడు. అయితే, గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో ఫిర్యాదుదారుడు సత్యవర్ధన్ అతనేనని ఆ తర్వాత తెలిసింది.

**అధికారి:** సత్యవర్ధన్‌ను ఎందుకు బెదిరించారు?

**వంశీ:** అతనిని ఎవరూ బలవంతం చేయలేదు. తనంతట తానే కోర్టుకు వెళ్లి న్యాయాధికారి ముందు వాంగ్మూలం ఇచ్చాడు.

**అధికారి:** విజయవాడ నుంచి సత్యవర్ధన్‌ను హైదరాబాద్‌కు తరలించిన కారు మీదే కదా? అదెక్కడ ఉంది?

**వంశీ:** అసలు నాకు కారు లేదు.

**అధికారి:** మైహోం భూజా నుంచి మీకు సంబంధించిన కారుల్లోనే సత్యవర్ధన్‌ను వైజాగ్‌కు తీసుకెళ్లారు కదా?

**వంశీ:** ఆ కార్లు ఎవరివో తెలియదు.

**అధికారి:** పోలీసులు అరెస్టు చేయడానికి ముందు వరకు ఉపయోగించిన ఫోన్ ఎక్కడుంది?

**వంశీ:** దాన్ని ఎక్కడ పెట్టానో గుర్తులేదు. తెలీదు. నేను మూడు ఫోన్లు వాడతా. వాటిని ఎక్కడ పెట్టానో తెలీదు.

**అధికారి:** కారులో మీరూ వైజాగ్ వెళ్లారు కదా?

**వంశీ:** నేను వెళ్లలేదు.

**అధికారి:** ఎర్రంశెట్టి రామాంజనేయులు, కొమ్మా కోట్లు, ఓలుపల్లి మోహనరంగారావు మీ అనుచరులే కదా?

**వంశీ:** ఔను. వాళ్లంతా నా అనుచరులే.

**అధికారి:** సత్యవర్ధన్ కేసులో వాళ్లంతా నిందితులుగా ఉన్నారు. మీరు చెప్తేనే వాళ్లు అతడిని బెదిరించారు కదా?

**వంశీ:** ఆ విషయం నాకు తెలీదు.

### ఆ ఇద్దరూ ఒప్పుకొన్నారు!

ఈ కేసులో మిగిలిన నిందితులు శివరామకృష్ణప్రసాద్, లక్ష్మీపతి మాత్రం వారికి ఎవరెవరు ఏయే బాధ్యతలు అప్పగించారో వారి పేర్లను వెల్లడించినట్టు తెలిసింది. సత్యవర్ధన్ కోర్టులో వాంగ్మూలం ఇచ్చిన తర్వాత తామే అతడిని వంశీ ఫ్లాట్‌కు తీసుకెళ్లినట్టు అంగీకరించారని, కారులో తీసుకువెళ్లినట్టు చెప్పారని సమాచారం.

### భోజనం వద్దు.. నీళ్లు చాలు

పోలీసుల విచారణ సమయంలో ఆహారం ముట్టుకోవడానికి వంశీ ఇష్టపడలేదని తెలిసింది. వంశీని విచారిస్తున్న ఏసీపీ దామోదర్ మధ్యాహ్న సమయంలో భోజనం చేయమని అడిగారు. తాను భోజనం చేయనని వంశీ సమాధానం ఇచ్చారు.

**దర్యాప్తు అధికారి:** ముదునూరి సత్యవర్ధన్‌ను ఎందుకు కిడ్నాప్ చేయించారు?

**వంశీ:** అతనెవరో నాకు తెలీదు

**దర్యాప్తు అధికారి:** సత్యవర్ధన్ ఎవరో తెలియకుండా మీ ఇంటికి ఎందుకు తీసుకెళ్లారు?

**వంశీ:** పదో తేదీ అర్ధరాత్రి గచ్చిబౌలిలోని మై హోం భూజాలో ఉన్న మా ఇంటికి వచ్చాడు. ఆరోజు రాత్రంతా మా ఇంట్లోనే నిద్ర చేశాడు. మర్నాడు ఉదయం వెళ్లిపోయాడు. ఆ తర్వాత అతనే సత్యవర్ధన్ అని తెలిసింది.



వంశీని కస్టడీలోకి తీసుకుంటున్న పోలీసులు

ఏసీపీ రెండు, మూడుసార్లు అడిగినా ఆయన ఇదే సమాధానం చెప్పారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలుమార్లు కాఫీ, టీ తాగుతారా.. అని అడిగినా వద్దని జవాబిచ్చారు. తాగడానికి నీళ్లు మాత్రం ఇవ్వమని కోరారు. మిగిలిన ఇద్దరు నిందితులు భోజనాలు చేశారు. జైలు నుంచి కస్టడీలోకి తీసుకున్న పోలీసులు వంశీని గేటు బయటకు తీసుకురాగానే అక్కడే ఉన్న సిబ్బందికి ఆయన 'గుడ్‌మార్నింగ్' చెప్పారు.

### వంశీ రిమాండ్ పొడిగింపు

జైలులో ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ రిమాండ్ మంగళవారంతో ముగియడంతో దీన్ని మార్చి 11 వరకు పొడిగిస్తున్నట్టు న్యాయాధికారి బీఎస్వీ హిమబిందు తెలిపారు.

### కస్టడీని రద్దు చేయండి: కోర్టులో మెమో

వంశీ మూడు రోజుల కస్టడీని రద్దు చేయాలని కోరుతూ కోర్టులో మంగళవారం మెమో దాఖలైంది. నిందితుల తరఫు న్యాయవాది తానికొండ చిరంజీవి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానంలో ఆ మెమో దాఖలు చేశారు. కోర్టు ఆదేశాల ప్రకారం నిందితులను విచారించే ప్రదేశం ముందుగా వారి తరఫున న్యాయవాదులకు తెలియజేయాలని, విచారణ సమయంలో మూడు నుంచి నాలుగుసార్లు నిందితులతో న్యాయవాదులు మాట్లాడుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ విషయాలను దర్యాప్తు అధికారులు తమకు తెలియజేయలేదని, అందువల్ల పోలీసు కస్టడీని రద్దు చేయాలని కోరారు.

## రాష్ట్రానికి వెయ్యి కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టు కింద డిపార్ట్‌మెంట్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ దేశంలోని ఆరు రాష్ట్రాలకు రూ.615 కోట్లు కేటాయించింది. అందులో ఒక్క ఏపీకే రూ.397 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదించింది. రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం(ఎస్ఏఎస్) కింద ఈ నిధులు ఇవ్వాలని కేంద్ర ఆర్థిక శాఖలోని వ్యయ విభాగానికి కేంద్ర భూ వనరుల విభాగం డిప్యూటీ డైరెక్టర్ నవాల్‌సింగ్ మీనా లేఖ రాశారు. ఈ ప్రతిపాదనకు వ్యయ విభాగం ఆమోదం తెలిపింది. ఇదిలా ఉంటే, డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్(డీఐఎల్ఆర్ఎంపీ) కింద వచ్చే నిధులను రెవెన్యూ రికార్డుల ఆధునికీకరణ, ఆధునిక రికార్డ్ రూమ్‌ల ఏర్పాటు, భూమి రికార్డుల డిజిటలైజేషన్, భూములకు అక్షాంశ, రేఖాంశాలతో కూడిన పొజిషన్‌తో పాటు 12 అంకెల విశిష్ట సంఖ్యను కేటాయించడానికి వినియోగిస్తున్నారు. వాస్తవానికి ఈ ప్రాజెక్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చును సీఎస్ఎస్ కింద కేంద్రం ఇచ్చే నిధులతో సర్దుబాటు చేసుకోవచ్చు. అంటే ముందు ప్రభుత్వం ఖర్చుపెట్టి, ఆ తర్వాత డీఐఎల్ఆర్ఎంపీ, మరో ప్రాజెక్టు కింద నిధులు క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉంది. రాష్ట్రంలోని భూ కమతాలకు 12 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయించడానికి అమలు చేస్తున్న యూలిప్ ప్రాజెక్టును పూర్తిచేయడానికి ఈ నిధులు ఉపయోగపడతాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ డేటా ఆధారంగా పలు కార్యక్రమాలు చేపట్టడానికి వ్యవసాయ శాఖకు కేంద్రం ప్రత్యేక సాయం కింద రూ.605 కోట్లు కేటాయించినట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక వినతి మేరకే ఈ మొత్తం మంజూరయినట్లు సమాచారం. మార్చి మొదటి వారంలోగా రాష్ట్రాలకు ఈ నిధులు ఇస్తామని కేంద్రం ప్రాథమిక సమాచారం ఇచ్చింది. కాగా, కేంద్ర భూ వనరుల విభాగం ఇచ్చే ప్రత్యేక సహాయంలో అత్యధికంగా ఏపీకే రూ.397 కోట్లు వస్తున్నాయని రాష్ట్ర సర్వే డైరెక్టర్, అదనపు సీసీఎల్ఏ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రెవెన్యూ స్పెషల్ సీఎస్ ఆర్.పి. సిసోడియా, సీసీఎల్ఏ జయలక్ష్మిల ప్రత్యేక కృషి, చొరవతోనే ఏపీకి ప్రత్యేక సాయం కింద తొలి పద్దులో భారీగా నిధులు మంజూరయ్యాయని వివరించారు. కేంద్రం ఇచ్చే నిధులతో ఆధునిక రికార్డు రూమ్‌ల నిర్మాణం, గ్రామీణ రెవెన్యూ రికార్డుల ఆధునికీకరణ చేపడతామని చెప్పారు. కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ కింద తహశీల్దార్ ఆఫీసులు, ఇతర రెవెన్యూ కార్యాలయాల నిర్మాణాలకు కేంద్రం అవకాశం ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర పథకాల ద్వారా నిధులు తీసుకురావాలని కూటమి సర్కారు సంకల్పించిన తర్వాత తొలిసారిగా రూ.వెయ్యి కోట్లు రావడంపై అధికార వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

## డేటా అనుసంధానంతో అద్భుత ఫలితాలు

- సీడీటీవోల నియామకాలు తక్షణమే చేపట్టండి
- ఆర్టీజీఎస్ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ఆదేశాలు

అమరావతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల డేటా అనుసంధానంతో అద్భుత ఫలితాలు సాధించవచ్చని ఆర్టీజీఎస్ కార్యదర్శి కాటంనేని భాస్కర్ అన్నారు. ఈ మేరకు అన్ని శాఖలు తమ వద్ద ఉన్న సమాచారాన్ని ఆర్టీజీఎస్‌కు అనుసంధానం చేయాలని ఆదేశించారు. మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొన్ని శాఖల నుంచి అసమగ్రంగా డేటా వస్తోందని అసహనం వ్యక్తం చేశారు. కమ్యూనిటీ డేటాను కూడా ఆర్టీజీఎస్‌కు పంపాలని స్పష్టం చేశారు. అలసత్వం, జాప్యం లేకుండా ప్రజలకు సేవలందించేలా డేటాను పంపాలని కోరారు. ఈ నెలాఖరులోగా గూగుల్‌తో సంప్రదించి ఆర్టీసీ బస్సుల్లో త్వరలో జీపీఎస్ విధానం అమలయ్యేలా చూడాలని భాస్కర్ సూచించారు.




## జపాన్ వెళ్తున్న దేవర



జపాన్‌లో జూనియర్ ఎన్టీఆర్ సినిమాలకు మంచి క్రేజ్ ఉంది. ఇప్పటికే అక్కడ విడుదలైన బాద్‌షా, ఆర్ఆర్ఆర్ చిత్రాలు భారీ కలెక్షన్లు సాధించాయి. ఆర్ఆర్ఆర్ అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రంగా సరికొత్త రికార్డును సృష్టించింది. ఇప్పుడు ఎన్టీఆర్ తాజా చిత్రం 'దేవర' ఈ ఏడాది మార్చి 28న ఇక్కడి థియేటర్లలో సందడి చేయనుంది. ఈ విషయాన్ని స్వయంగా చిత్రబృందం ప్రకటించింది. ఇందులో భాగంగా మార్చి 22న ఎన్టీఆర్ జపాన్ వెళ్లి ఈ చిత్రం ప్రమోషన్ కార్యక్రమాలలో పాల్గొననున్నట్లు తెలిసింది.

## హిట్ ఫిల్మ్ అనే నమ్మకం ఉంది



నక్కిన త్రినాథరావు

'ఇప్పటివరకూ 'మజాకా' చిత్రాన్ని చూసినవాళ్లంతా 'బాగుంద'ని మెచ్చుకున్నారు. నూటికి నూరుశాతం హిట్ ఫిల్మ్ అనే నమ్మకం ఉంది. అది ఏ స్థాయి హిట్‌గా నిలుస్తుందనేది ఫస్ట్‌షో పడ్డాక తెలుస్తుంది' అని దర్శకుడు త్రినాథరావు నక్కిన అన్నారు. సందీప్‌కిషన్, రావు రమేశ్ ప్రధాన పాత్రధారులుగా త్రినాథరావు తెరకెక్కించిన చిత్రమిది. నేడు విడుదలవుతోన్న సందర్భంగా ఆయన మీడియాతో సినిమా విశేషాలను పంచుకున్నారు. "ధమాకా' సమయంలో నాకు ప్రసన్నకుమార్ ఈ కథ చెప్పారు. కథానుసారం రావు రమేశ్ పాత్రకు ప్రాధాన్యం ఉంటుంది. ఆయనది హీరో పాత్రకు సరితూగే పాత్ర. పెళ్లికోసం రావు రమేశ్, సందీప్‌కిషన్ చేసే ప్రయత్నాలు వినోదం పంచుతాయి. పతాకసన్నివేశాల్లో భావోద్వేగాలు ప్రేక్షకులను మెప్పిస్తాయి. నిర్మాతలు రాజేశ్, అనిల్ దర్శకుడిగా నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. రవితేజ గారితో 'డబుల్ ధమాకా' చేసేందుకు కథను సిద్ధం చేసే పనిలో ఉన్నాను' అని చెప్పారు.

చిత్రజ్యోతి
SINCE 1965


## ప్రభాస్ స్పిరిట్.. మరో నాలుగు!




బాలీవుడ్‌లో నిర్మాత భూషణ్‌కుమార్ హవా బాగా నడుస్తోంది. వచ్చే రెండేళ్ల కాలంలో ఏకంగా ఐదు భారీ చిత్రాలు నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు. వీటిల్లో మన ప్రభాస్ నటించే 'స్పిరిట్' ఒకటి. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వం వహించే ఈ సినిమా షూటింగ్ ఇంకా ప్రారంభం కాలేదు. అలాగే భూషణ్ ప్లాన్ చేస్తున్న మరో భారీ ప్రాజెక్ట్ 'ధమాల్ 2'. ఇక నిర్మాణంలో ఆయన చిత్రాల విషయానికి వస్తే అజయ్ దేవగణ్, రకుల్ ప్రీత్ సింగ్ జంటగా నటిస్తున్న 'దే దే ప్యార్ దే 2' షూటింగ్ పాటియాలాలో జరుగుతోంది. అలాగే దర్శకుడు అనురాగ్ సింగ్ రూపొందిస్తున్న 'బోర్డర్ 2' చిత్రం షూటింగ్ ఝాన్సీలో జరుగుతోంది. సన్నీ డియోల్, వరుణ్ ధావన్ ఇందులో నటిస్తున్నారు. ఇక ముంబై అనురాగ్ బసు దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న లవ్‌స్టోరీ షూటింగ్ దశలో ఉంది. కార్తిక్ ఆర్యన్, శ్రీలీల జంటగా నటిస్తున్నారు. మరో చిత్రం 'తేరే ఇష్క్ మే' ఢిల్లీలో షూటింగ్ జరుపుకొంటోంది.








## హాజరు కోసమే అసెంబ్లీకి జగన్: పురందేశ్వరి



రాజమహేంద్రవరం అర్బన్, ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): 'హాజరు కోసమే జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీకి వచ్చారు. ప్రజా సమస్యలను ప్రస్తావించడానికి కాదు' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి రాజమహేంద్రవరంలో వ్యాఖ్యానించారు. వరుసగా ఆరు నెలలపాటు అసెంబ్లీకి వెళ్లకపోతే సభ్యత్వం రద్దయ్యే అవకాశం ఉందని, ఆ భయంతోనే జగన్, వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చారన్నారు. అధికారంలో ఉన్న సమయంలో వైసీపీ నాయకులు, ఎమ్మెల్యేలు అసెంబ్లీలో బూతుల పురాణం తప్ప ఏం చేశారని ప్రశ్నించారు. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అసెంబ్లీని కౌరవ సభలాగా నడిపించారని పురందేశ్వరి ఒంగోలులో ధ్వజమెత్తారు.

## ఫ్లోర్ లీడర్‌కు ప్రతిపక్షనేతకు తేడా తెలియని జగన్: సోమిరెడ్డి

▸ జగన్ వికృత చేష్టలతో కడుపు మండిపోతోంది: విష్ణుకుమార్‌రాజు

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్యేలకు దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై గొంతు వినిపించాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శాసనసభలో సవాల్ విసిరారు. మంగళవారం శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై సోమిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును కాదని ప్రతిపక్ష నాయకుడి హోదా కావాలంటున్నాడు. చంద్రబాబు ఎంత సమయం మాట్లాడితే.. తానూ అంత సమయం మాట్లాడాలని జగన్ డిమాండ్ చేస్తుండటంలో అర్థం లేదు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ శాసనసభలో .. చంద్రబాబు వైపు వేలెత్తి చూపిస్తూ 'మీ దగ్గర నుంచి ఐదారుగురు సభ్యులను లాగేస్తే ప్రతిపక్ష హోదా కూడా ఉండదు' అని ఎద్దేవా చేశారు. ఇప్పుడు కేవలం 11 మంది ఎమ్మెల్యేలున్న వైసీపీకి ప్రతిపక్ష హోదా కావాలని అడగడంలో అర్థముందా? వారు అసెంబ్లీకి రాకపోతే ఆ 11 నియోజకవర్గాల ప్రజల తరఫున అసెంబ్లీలో ఎవరు మాట్లాడతారు? అని నిలదీశారు.

### 80 ఏళ్ల ఉమ్మారెడ్డినీ పోడియం వద్దకు పంపారు: విష్ణుకుమార్‌రాజు

'జగన్ అసెంబ్లీకి వస్తారా?.. వస్తే కూటమి ఎమ్మెల్యేలు ఏవిధంగా ప్రవర్తిస్తారో చూద్దామని రాష్ట్ర ప్రజలంతా ఆసక్తితో చూస్తున్నారు. కానీ గవర్నర్ ప్రసంగిస్తున్నప్పుడు సభలో జగన్, వైసీపీ సభ్యుల వికృత ప్రవర్తనను చూసిన తర్వాత కడుపు మండిపోతోంది. గవర్నర్ ప్రసంగిస్తున్నప్పుడు 80 ఏళ్లున్న సీనియర్ నాయకుడు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లును కూడా పోడియం వద్దకు వెళ్లాలంటూ జగన్ సైగలు చేశారు. జగన్ తన స్వార్థపూరిత ఆలోచనలతో వైసీపీ ఎమ్మెల్యేలు తలదించుకునే పరిస్థితులు తీసుకురావడం దురదృష్టకరం' అని విష్ణుకుమార్‌రాజు అన్నారు. సుందరపు విజయకుమార్, కలికిరి మురళీమోహన్, ఎం.మాలకొండయ్య, ఎంఎస్ రాజు, ఎన్.ఈశ్వరరావు, ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ జగన్ తీరుపై ధ్వజమెత్తారు.

## తెలుగు మీడియం చదివితే ఉద్యోగాలు వస్తాయా?

▸ వైసీపీ ఎమ్మెల్సీ తూమాటి వ్యాఖ్యలు.. మంత్రులు అనిత, డోలా ఫైర్

'తెలుగులో చదివితే ఐటీ ఉద్యోగాలు వస్తాయా? ఏఐ అని చంద్రబాబు అంటారు. ఏఐ తెలుగులో ఉంటుందా?' అంటూ వైసీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు మంగళవారం శాసనమండలిలో చేసిన వ్యాఖ్యలు సభలో దుమారం రేపాయి. తెలుగు రాష్ట్రాల్లో ఉండి తెలుగునే కించపరిచేవిధంగా మాట్లాడతారా? ఆ మాటలను వెనక్కి తీసుకోవాలంటూ మంత్రులు అనిత, డోలా బాల వీరాంజనేయస్వామి మండిపడ్డారు. మాధవరావు మాటలను రికార్డుల నుంచి తొలగించాలని మంత్రులు కోరారు.

## హోదా కోసం జగన్ డ్రామా: ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పును గౌరవించకుండా అసెంబ్లీలో జగన్ తన ఎమ్మెల్యేలతో చేసిన డ్రామా చూసి ప్రజలు నవ్వుకొంటున్నారని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి ఎద్దేవా చేశారు. పేదలకు సెంటు స్థలం ఇచ్చేందుకు రూ.వందల కోట్లు తినేసిన వైసీపీ పాలనలోని అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలి అని పార్థసారథి కోరారు.

## భవిష్యత్తు మనదే.. అధైర్యపడకండి: జగన్

పులివెందుల, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): 'భవిష్యత్తు మనదే... ఎవరూ అధైర్యపడవద్దు' అని మాజీ సీఎం జగన్ కార్యకర్తలతో పేర్కొన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన పులివెందుల చేరుకుని ప్రజాదర్బార్ నిర్వహించారు. ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుధ, అమరనాథరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా పాల్గొన్నారు.

## ఏపీలో అంజనీ కుమార్ రిపోర్ట్

▸ రేపు అభిలాష బిస్త్.. 4న అభిషేక్ మహంతి

అమరావతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ కేడర్‌కు చెందిన 1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అంజనీ కుమార్ రాష్ట్ర సచివాలయంలో రిపోర్టు చేశారు. మరో సీనియర్ ఐపీఎస్ అధికారి అభిలాష బిస్త్ గురువారం విధుల్లో చేరనుండగా.. డీజీ ర్యాంకు అధికారి అభిషేక్ మహంతి మార్చి 4న రిపోర్టు చేయనున్నారు.

## 18 మంది డిప్యూటీ కలెక్టర్లు బదిలీ

వెయిటింగ్ లిస్టులో ఉన్న డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్‌లు ఇస్తూ, పలువురిని బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పర్యాటక శాఖ మంత్రి వద్ద ఓఎస్‌డీగా పనిచేస్తున్న ఎ. చైత్రవర్షిణిని పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ)గా బదిలీ చేశారు. మొత్తం 18 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేశారు. కర్నూలు డీఆర్‌డీఏ పీడీగా టి. చిరంజీవి బదిలీ అయ్యారు.

## రిలయన్స్ సీబీజీ ప్లాంట్లకు సహకారం: గొట్టిపాటి

అమరావతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. ఆ ప్లాంట్ల నిర్మాణం, ప్రారంభానికి కార్యాచరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో రిలయన్స్ ప్రతినిధులు, ఇంధన శాఖ అధికారులతో మంత్రి మంగళవారం సమావేశమయ్యారు. ప్రకాశం, పల్నాడు జిల్లాల్లోని బంజరు భూముల్లో సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని రిలయన్స్ ప్రతినిధులను మంత్రి గొట్టిపాటి కోరారు. వీటికి సంబంధించి భూకేటాయింపుల ప్రక్రియ వేగవంతం చేయాలని ప్రకాశం, పల్నాడు జిల్లాల కలెక్టర్లకు ఆదేశించారు. కాగా, జగన్ తుగ్లక్ నిర్ణయాలతో రాష్ట్రంలో విద్యుత్తు రంగం నిర్వీర్యమైపోయిందని, అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తొమ్మిది నెలల్లోనే విద్యుత్తు రంగాన్ని గాడిన పెట్టామని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో విద్యుత్తు రంగంపై ఇంధన సంస్థల అధికారులతో మంత్రి సమీక్షించారు. గతంలో జగన్ ఏపీజెన్కోను నిర్వీర్యం చేసేలా థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రాలను బ్యాకింగ్ డౌన్ చేసి.. బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కరెంటుకొనుగోలు చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

## గంజాయికి చెక్... బడులపై ఈగల్ నిఘా!: అనిత

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పరిసరాలను నిరంతరం పర్యవేక్షించేందుకు ఈగల్ బృందాలను వినియోగించనున్నట్లు హోంమంత్రి అనిత తెలిపారు. మంగళవారం అసెంబ్లీ లాబీల్లో ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపేందుకు ఐజీ ఆకే రవికృష్ణ నేతృత్వంలో ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మహిళల భద్రతకు శక్తి పేరిట ప్రత్యేక యాప్‌ను పునరుద్ధరిస్తున్నామన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతోనే నా భార్య మృతి!

▸ తిరుపతి తొక్కిసలాటపై విశాఖ బాధితుడు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిటీ విచారణను వేగవంతం చేసింది. జస్టిస్ సత్యనారాయణమూర్తి మంగళవారం విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో బాధితులను విచారించారు. విశాఖ నుంచి ఒకరు, పాలకొల్లు నుంచి మరొకరు ఈ విచారణలో పాల్గొన్నారు. టీటీడీ, పోలీసుల అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తన భార్య శాంతి మృతి చెందిందని విశాఖకు చెందిన వెంకటేష్ కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఆనాటి తొక్కిసలాట ఘటనను ఆయన వివరించారు. అలాగే ధనకుమార్ అనే వ్యక్తి పాలకొల్లు నుంచి విచారణకు హాజరయ్యారు. తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడ్డానని పేర్కొన్నారు. విజయనగరం నుంచి మరో ఇద్దరు రావాల్సి ఉండగా.. వారు గైర్హాజరయ్యారు. ప్రత్యక్ష సాక్ష్యులైన పార్కు చుట్టుపక్కల ఉన్న 20 మంది దుకాణదారులను శుక్రవారం విచారించనున్నారు.

# దగాపడ్డ రాష్ట్ర పునర్నిర్మాణం

### ఉగాది నుంచి 4 పీ విధానం

"గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు 3 సెంట్ల జాగా, పట్టణాల్లో 2 సెంట్ల ఇంటిజాగా ఇవ్వబోతున్నాం. ఐదేళ్లలో ప్రతిఒక్కరికీ ఇళ్లు కట్టిస్తాం. ఇప్పటి వరకు రాష్ట్రంలో 1,14,000 ఇళ్లు కట్టాం. జూన్ 12 నాటికి 5 లక్షల కొత్త ఇళ్లు కట్టి పేదలకు అంకితం చేస్తాం. ప్రతి కుటుంబానికి ఇంటిజాగా, ఇల్లు, ట్యాప్ వాటర్, టాయిలెట్, సోలార్ పవర్, విద్యుత్, గ్యాస్, ఇంటర్నెట్ లాంటి కనీస సౌకర్యాలు కల్పిస్తాం. పీ 4 పాలసీని ఉగాది రోజు ప్రారంభిస్తాం. పేదవాళ్లను ఆర్థికంగా పైకి తెస్తాం. 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కట్టుబడి ఉన్నాం. రూ.6.50 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు కుదిరాయి. రూ.10 లక్షల కోట్ల పెట్టుబడితో 7.50 లక్షల ఉద్యోగాలు తెస్తున్నాం. ప్రభుత్వ ఉద్యోగాలను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తాం."



### స్వర్ణాంధ్ర సాధిస్తాం

"రాష్ట్రాన్ని అత్యున్నత స్థానంలో నిలపడం కోసం ఏ రంగంలో ఏం చేయాలన్న అంశాలతో విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేశాం. స్వర్ణాంధ్ర-2047 సాధన కోసం ఈ రోజు ఏంచేయాలి, 3 నెలల తర్వాత ఏవిధంగా ఉండాలన్న స్పష్టమైన ఆలోచనలతో ముందుకెళ్తున్నాం. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ప్రజల తలసరి ఆదాయం పెంచే బాధ్యత ఎమ్మెల్యేలదే. అసాధ్యమనుకున్న అమరావతి, పోలవరం, రైల్వేజోన్, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపడం ఈ 8 నెలల్లో చేసిచూపించాం. దీనికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సహకరించారు. ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి వచ్చింది కాబట్టి మనమందరం గర్వపడే దేశరాజధానిగా తీర్చిదిద్దుతారు. మోదీ ప్రధాని అయ్యేనాటికి ప్రపంచంలో పదో ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్‌ను ఇప్పుడు ఐదో స్థానానికి తెచ్చారు. 2028-29 నాటికి మూడో ఆర్థిక వ్యవస్థగా తయారవుతుంది.."

(మొదటి పేజీ తరువాయి)

సహకారం లేకపోతే చాలా ఇబ్బందుల్లో పడేవాళ్లం. ఒకప్పుడు కరెంటు లేని పరిస్థితి నుంచి ఇప్పుడు ఇంటిపైనే కరెంటు తయారుచేసుకునే స్థాయికి వచ్చాం. గౌరవ సభను గౌరవించే సంస్కారం లేని పార్టీ(వైసీపీ) నేడు అసెంబ్లీకి రావడం లేదు. అసెంబ్లీ అంటే గౌరవం. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఒక వేదిక. ఒక పవిత్ర దేవాలయం." అని చంద్రబాబు అన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

### ప్రతిపక్ష హోదా ఇచ్చేది నేను కాదు.. ప్రజలు

"41 ఏళ్ల నా రాజకీయ జీవితంలో ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీ జరగనిస్తాం.. లేదంటే వెళ్లిపోతామనే రాజకీయపార్టీని ఎన్నడూ చూడలేదు. ప్రజలు 11 సీట్లిచ్చారు. 11 గంటలకు వచ్చారు. 11 నిమిషాలున్నారు. 11:11 నిమిషాలకు వెళ్లిపోయారు. ఈ 11 నిమిషాల్లోనే స్పీకర్‌ను, గవర్నర్‌ను అవమానించారు. రాష్ట్రానికి అది చీకటి రోజు. ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ ఎమ్మెల్యేగా గెలవలేదు. అయినాసరే అసెంబ్లీకి వస్తానంటే ఒప్పుకొంటారా? 1994లో కాంగ్రెస్‌కు మెజారిటీ రాలేదు. అందువల్ల ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు. సంప్రదాయాలు మర్చిపోయి ప్రతిపక్ష హోదా ఇవ్వాలనడం దారుణం. అది నేనో, స్పీకరో ఇచ్చేది కాదు.. ప్రజలివ్వాలి."

### త్వరలో మెగా డీఎస్సీ

"మెగా డీఎస్సీకి త్వరలో శ్రీకారం చుడతాం. 16,384 పోస్టులకు పాఠశాలలు ప్రారంభించే లోగా నియామకం చేపట్టి శిక్షణ ఇచ్చి, పోస్టింగ్‌లు వేస్తాం. మే నెలలో తల్లికి వందనం పథకం ఇస్తాం. ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ ఇస్తాం. రైతు భరోసా కింద 3 విడతల్లో ప్రతి రైతుకూ రూ.20,000 ఇస్తాం. కేంద్రం రూ.6,000 ఇస్తుంది.. రాష్ట్ర ప్రభుత్వం రూ.14,000 ఇస్తుంది. మత్స్యకారులకు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లుగా వేటలేని సమయంలో రూ.20,000 ఇస్తాం."

### హామీల అమలు

"ఎన్ని కష్టాలున్నా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ అమలుకు అనుక్షణం పని చేస్తాం. సామాజిక పెన్షన్ డబ్బు ను రూ.200 నుంచి రూ.2000కు పెంచింది టీడీపీ ప్రభుత్వమే. ఆ తర్వాత రూ.3,000 నుంచి రూ.4,000 కు పెంచాం. గత ప్రభుత్వం దివ్యాంగులకు ఒక్కపైసా పెన్షన్ కూడా పెంచలేదు. మేము 8,08,570 మంది దివ్యాంగుల పెన్షన్‌ను రూ.3,000 నుంచి రూ.6,000కు పెంచాం. అనారోగ్యంతో మంచానికి పరిమితిమైన వారికి రూ.15,000 పెన్షన్ ఇస్తున్నాం. ఏటా రూ.33,000 కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం మనదే."

### సంకల్పం మంచిదైతే కొనసాగించాలి

'కూటమి ప్రభుత్వం వచ్చీరావడంతోనే 204 క్యాంటీన్లు ప్రారంభించాం. మేనిఫెస్టోలో చెప్పినట్లుగా దీపం పథకం ద్వారా 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. ఈ పథకానికి రూ.2,684 కోట్ల ఖర్చవుతోంది. ఇప్పటి వరకు దీని కోసం రూ.686 కోట్లు ఖర్చు చేశాం."

### రాష్ట్రం ఎలా నష్టపోయిందంటే...

"అభివృద్ధి చేయాలి...సంపద సృష్టించాలి. ఆదాయం పెంచాలి..పెంచిన ఆదాయాన్ని సంక్షేమం కోసం ఖర్చు చేయాలనేదే మా అభిమతం. టీడీపీ హయాంలో 2018-19లో 11.4 శాతం వృద్ధిరేటుతో 8.74 లక్షల కోట్ల జీఎస్‌డీపీ నమోదైంది. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2019-20 లో 5.25 శాతంతో రూ.9.26 లక్షల కోట్ల జీఎస్‌డీపీ నమోదైంది. ఒకవేళ వృద్ధిరేటు 11.4 శాతం కొనసాగి ఉంటే 9.71 లక్షల కోట్ల జీఎస్‌డీపీ వచ్చి ఉండేది. వృద్ధిరేటు తగ్గడం వల్ల రూ.45 వేల కోట్ల జీఎస్‌డీపీ తగ్గింది 2023-24లో 8.6 శాతం వృద్ధిరేటుతో రూ.14.22 లక్షల కోట్ల జీఎస్‌డీపీ నమోదైంది. కూటమి ప్రభుత్వం వచ్చిన 2024-25లో 12.94 శాతం వృద్ధిరేటుతో రూ.16.6 లక్షల కోట్ల జీఎస్‌డీపీ వస్తుందని అంచనా. ఒకవేళ వైసీపీ చివరి ఏడాదిలో నమోదైన 8.6 శాతం వృద్ధిరేటే కొనసాగితే రూ.15.44 లక్షల కోట్ల జీఎస్‌డీపీ వచ్చేది. రాష్ట్రం జీఎస్డీపీ రూపంలో రూ.62,000 కోట్లు కోల్పోయేది. టీడీపీ అధికారంలో ఉండి ఉంటే 2023-24 కు 14.23 శాతం వృద్ధి రేటుతో రూ.16.46 లక్షల కోట్ల జీఎస్డీపీ వచ్చేది. రాష్ట్రానికి రూ.76,190 కోట్ల ఆదాయం అదనంగా వచ్చేది. అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉండేది కాదు. రాబోయే ఏడాది నుంచి 15% సాధించాలి. 2018-19 మార్చి నాటికి రాష్ట్రం అప్పు రూ.3,75,295 కోట్లు ఉండగా, 2024 జూన్ 4వ తేదీ నాటికి అప్పు రూ.9,74,556 కోట్లకు పెరిగింది. కేంద్రం అనేక పథకాలు ఇస్తుంది. కానీ వైసీపీ ప్రభుత్వం వాటిని కూడా ఉపయోగించుకోలేదు. జల్‌జీవన్ విషన్ కింద ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా నీరందించాలంటే రూ.85,000 కోట్లు ఖర్చవుతుంది. ఈ పథకం ప్రకారం 45 శాతం కేంద్రం, 45 శాతం రాష్ట్రం, 10% లబ్ధిదారులు భరించాలి. కానీ, గత ప్రభుత్వం రూ.27,000 కోట్లు మాత్రమే అడిగింది. అదనంగా రూ.55,000 కోట్లు కావాలి. వాటికోసం కేంద్రాన్ని అడుగుతున్నాం."

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలపడం కోసం కూనరవికుమార్ , డాక్టర్ బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి బలపర్చిన తీర్మానాన్ని సభ ఆమోదించింది. తిరిగి ఫిబ్రవరి 28 శుక్రవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమవుతుందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు.

### రూ.80వేల కోట్లతో బనకచర్ల..

"రాష్ట్రంలోని ప్రజలందరికీ రూ.2,50,000 ఆరోగ్య బీమా సౌకర్యం తెచ్చేందుకు అవసరమైన ప్రీమియం ప్రభుత్వం చెల్లిస్తుంది. ఆ తర్వాత రూ.25 లక్షల వరకు అయ్యే వైద్యం ఖర్చులను ఎన్టీయార్ వైద్యసేవ ద్వారా అందజేస్తాం. బనకచర్లకు రూ.80,000 కోట్లు కావాలి. కేంద్రం, రాష్ట్రంతో కలిసి ప్రైవేటు పార్టీలను కూడా కలుపుకుని ఈ ప్రాజెక్టు పూర్తిచేయాలనే ఆలోచనలో ఉన్నాం."

### పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పనే లక్ష్యం..

"స్వర్ణాంధ్రకు 10 సూత్రాలు ప్రతిపాదించాం. ఇందులో పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పనకే తొలి ప్రాధాన్యం ఇచ్చాం. స్వర్ణకారుల కార్పొరేషన్‌తో బీసీలకు రూ.896 కోట్లు విడుదలచేశాం. మత్స్యకారులకు సంబంధించి 217 జీవోను రద్దు చేశాం. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్‌పై తీర్మానం చేసి ఢిల్లీకి పంపాం. గీత కార్మికులకు 10 శాతం రిజర్వేషన్, క్వారీల్లో వడ్డెర కులస్థులకు రిజర్వేషన్ కల్పించాం. చేనేతలకు జీఎస్టీ ఎత్తేశాం. అర్చకుల జీతాలు రూ.15,000కు పెంచాం. నిరుద్యోగ భృతి రూ.3,000 ఇస్తున్నాం. దేవాలయాల పవిత్రత కాపాడతాం. రాష్ట్రంలో ఏ ప్రార్థనాలయాల జోలికి వచ్చినా వెన్నెముక అదిరేలా చర్యలు తీసుకుంటాం."

# సభకు ఎందుకెళ్లానురా దేవుడా!


సోమవారం నాడు సభలో జగన్, వైసీపీ నేతలు

## ఆత్మరక్షణలో పడిపోయిన వైఎస్ జగన్

▸ సభ్యత్వం పోతుందని హడావుడిగా గవర్నర్ ప్రసంగానికి

▸ కానీ, దానిని 'హాజరు'గా పరిగణించరని తెలిసి అవాక్కు

▸ స్వార్థం కోసం ఇంత డ్రామానా అంటూ విమర్శలు

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): బడ్జెట్ సమావేశాల తొలిరోజున గవర్నర్ ప్రసంగం సందర్భంగా శాసనసభకు ఎందుకు వెళ్లానురా దేవుడా! అంటూ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ తలపట్టుకుంటున్నారని పార్టీవర్గాలు చెబుతున్నాయి. సభకు వరుసగా అరవై రోజులపాటు గైర్హాజరైతే సభ్యత్వం రద్దవుతుందని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు చేసిన ప్రకటన వలలో వైసీపీ పడింది. దీంతో... ఆదరాబాదరాగా సోమవారం జగన్ అసెంబ్లీకి వెళ్లి హాజరుపట్టికలో సంతకం చేశారు. గవర్నర్ ప్రసంగం మొదలు కావడానికి రెండు నిమిషాల ముందు సభకు వచ్చి.. ఆయన ప్రసంగం ప్రారంభించిన తొమ్మిదో నిమిషంలో తన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి జగన్ వాకౌట్ చేశారు. అలా.. 'అరవై రోజుల' గండం తప్పించుకున్నానని ఆయన భావించారు. మంగళవారం జగన్, వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాలేదు. పులివెందుల వెళ్లిన జగన్.. బుధవారం బెంగళూరుకు చేరుకుంటారు. తిరిగి వచ్చే మంగళవారం ఆయన తాడేపల్లి చేరుకుంటారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అప్పటికి ఆయనకు ప్రతిపక్ష నేత హోదాను ఇస్తూ అసెంబ్లీ నిర్ణయం తీసుకుంటేనే ఆయన సమావేశాలకు హాజరవుతారని ఈ వర్గాలు అంటున్నాయి. బడ్జెట్ సమావేశాలు మార్చి 21వ తేదీతో ముగుస్తాయి. అయితే, జగన్ మెడపై వేలాడుతున్న కత్తి ఇప్పటికీ తొలగిపోలేదని అసెంబ్లీ వ్యవహారాలతో పరిచయం ఉన్న వారు చెబుతున్నారు. గవర్నర్ ప్రసంగం ఉన్న రోజును శాసనసభా వ్యవహారాలు జరిగినట్లుగా పరిగణించరని తేల్చి చెబుతున్నారు. అంటే, వ్రతం చెడింది. కానీ, ఫలం మాత్రం దక్కలేదన్నమాట! ప్రతిపక్ష హోదా రానందుకు అసెంబ్లీలో అడుగుపెట్టరాదని జగన్ నిర్ణయించుకున్న విషయం తెలిసిందే. అయితే, శాసనమండలిలో ప్రతిపక్ష హోదా ఇప్పటికీ వైసీపీకి ఉంది. దీంతో అక్కడి సమావేశాలకు వైసీపీ సభ్యులు హాజరవుతున్నారు. ఇది కూడా జగన్‌ను ఇరుకునపడేస్తోంది. శాసనమండలికివెళ్తూ .. శాసనసభకు ఎందుకు వెళ్లరన్న ప్రశ్నలు చుట్టుముడుతున్నాయి. జగన్ రాజకీయం అంతా తన పదవులకోసం.....హోదాకోసమే తప్ప ప్రజాసమస్యల పరిష్కారంకోసం కాదా? అంటూ రాజకీయనిపుణులు ప్రశ్నిస్తున్నారు. జగన్ సోదరి, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెండు అడుగులు ముందుకేసి.."దమ్ముంటే శాసనసభకు వెళ్లు. లేదంటే రాజీనామా చేయి" అంటూ సవాల్ విసిరారు. కాగా, ఈ నెల 28న బడ్జెట్ సెషన్‌కు, దానిపై తాను స్పందించేందుకు వచ్చే నెల మూడున జగన్ మరోసారి అసెంబ్లీకి వెళతారని ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ వాదనలను వైసీపీ వర్గాలు ఖండిస్తున్నాయి.

## తెలుగు యోధుల సమాధుల కబ్జా

▸ ఢిల్లీలో ఆచార్య ఎన్జీ రంగా, సుందర్‌రావు సమాధుల విధ్వంసం

▸ మట్టి.. రాళ్లతో సమాధులు కప్పేసి.. జిమ్‌కు దారి

▸ తెలుగు రాష్ట్రాల సీఎంలు జోక్యం చేసుకోవాలని డిమాండ్


ఎన్జీ రంగా, సుందర్‌రావు సమాధులను, ఆ ప్రాంతాన్ని మట్టి, రాళ్లతో కప్పేస్తున్న కబ్జాదారులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలకు చెందిన స్వాతంత్ర్య సమర యోధులకు దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర అవమానం జరిగింది. స్వాతంత్ర్య సమరయోధుడు, తెలుగు ప్రజలకు ఆరాధ్యుడైన ఆచార్య ఎన్జీ రంగా, ఆయన అనుచరుడు సుందర్‌రావు సమాధులను రాత్రికి రాత్రే కబ్జా చేసేశారు. వారి సమాధులు కనిపించకుండా మట్టి, రాళ్లతో పూడ్చేసి, తమ జిమ్‌కు రహదారి ఏర్పాటు చేసుకున్నారు. ఇందిరాగాంధీ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో)కు కూతవేటు దూరంలో ఉన్న ఫ్రీడమ్ ఫైటర్స్ ఎన్‌క్లేవ్‌లో సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఆ స్థలాన్ని కబ్జారాయుళ్ల నుంచి విడిపించి, సమాధుల పరిరక్షణకు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చొరవ తీసుకోవాలని ఢిల్లీలో నివసించే తెలుగు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సమాధులు ఉన్న ప్రాంతాన్ని ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి అనులేఖ బూస, ఏపీ భవన్ అధికారులు, స్థానికులైన రవికుమార్, జీవీ రావు పరిశీలించారు.

### ఏం జరిగిందంటే..!

తెలుగువాడైన ఆచార్య ఎన్జీ రంగా, ఢిల్లీకి చెందిన బలక్‌రామ్ కాంగ్రెస్ పార్టీలో ఉంటూ స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. బలక్‌రామ్ కుమారుడు రతీరామ్ ఉపాధ్యాయుడిగా పని చేసేవారు. ఎన్జీ రంగా అంటే రతీరామ్‌కు ఎనలేని అభిమానం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 1980లలో ఎన్జీ రంగా ప్రోద్బలంతో స్వాతంత్ర్య ఉద్యమకారులు ఇళ్లు కట్టుకునేందుకు వీలుగా ఫ్రీడమ్ ఫైటర్స్ కల్చరల్ సెంటర్ అనే సొసైటీ ఏర్పడింది. దీనికి ఎన్జీ రంగా అధ్యక్షుడు కాగా, సుందర్‌రావు ప్రధాన కార్యదర్శి. స్థానికుడైన రతీరామ్‌కు చెందిన 42.5 ఎకరాలను ఈ సొసైటీ కొనుగోలు చేసింది. ఆ భూమిలో ఫ్రీడమ్ ఫైటర్స్ ఎన్‌క్లేవ్ పేరుతో 709 ప్లాట్లతో కాలనీ నిర్మించారు. ఎన్జీ రంగా అనుచరుడైన రణబీర్‌సింగ్ హుడా, సుందర్‌రావు, రతీరామ్ తదితరులు ఈ కాలనీలో ఇళ్లు నిర్మించుకున్నారు. తన సమాధిని కూడా ఇక్కడే నిర్మించాలని ఎన్జీ రంగా తన కోరికను వెలిబుచ్చారు. రంగా మరణానంతరం సమాధి నిర్మాణానికి రతీరామ్ ముందుకొచ్చారు. ఆయన అస్థికలతో కూడిన చితాభస్మాన్ని తీసుకొచ్చి సమాధి నిర్మించారు. ఆ పక్కనే రంగా అనుచరుడైన సుందర్‌రావు సమాధి కూడా నిర్మించారు. తదనంతరం వారి సమాధుల పక్కనే బలక్‌రామ్, రతీరామ్ దంపతుల సమాధులను రతీరామ్ వారసులు నిర్మించారు. కాలక్రమంలో రతీరామ్ వారసులు రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాల్లో స్థిరపడ్డారు. ఆస్తుల పంపకాల్లో భాగంగా సమాధుల పక్కన ఉన్న భవనం రతీరామ్ ఐదుగురు కుమారులలో ఒకరైన విజయ్‌దీప్‌కు వచ్చింది. భూమిరేట్లు పెరగడంతో ఆ సమాధులు ఉన్న ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తీసుకోవాలని విజయ్‌దీప్ ప్రయత్నించాడు. కాలనీలోని తెలుగువాళ్లు ఆ కుట్రలను తిప్పికొట్టారు. ఇటీవలకాలంలో ఇగ్నోకు వెళ్లే దారిలో మెట్రో రైలు భూగర్భ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆ దారి తాత్కాలికంగా మూతపడింది. ఆ దారిలో ఉన్న తన బిల్డింగ్‌ను జిమ్‌సెంటర్ నిర్వాహకులకు విజయ్‌దీప్ కిరాయికి ఇచ్చాడు. మార్చి 3న జిమ్‌సెంటర్ ప్రారంభోత్సవం ఉండడం, జిమ్‌కు వచ్చే దారి మూతపడడంతో విజయ్‌దీప్ అండతో జిమ్‌కు వెనకవైపు సమాధులు ఉన్న స్థలాన్ని నిర్వాహకులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

### సమాధులను పరిరక్షించాలి

తెలుగువారికి గర్వకారణమైన ఎన్జీ రంగా, సుందర్‌రావు సమాధులను, ఆ ప్రాంతాన్ని పరిరక్షించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చొరవ చూపాలని ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి అనులేఖ బూస డిమాండ్ చేశారు. ఎన్జీ రంగా సమాధిని పునరుద్ధరించాలని జీవీ రావు కోరారు.

## ప్రభుత్వ టెండర్లలో స్టార్టప్‌లకు అవకాశం

▸ రూ. 50 లక్షల విలువైన టెండర్లలో పాల్గొనవచ్చు

▸ స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం.. ఐటీ వర్గాల హర్షం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. స్టార్టప్ యజమానులకు గత అనుభవం లేకపోయినా, లక్షల రూపాయల టర్నోవర్ లేకపోయినా ప్రభుత్వ టెండర్లలో పాల్గొనే అవకాశం కల్పిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. సాధారణంగా టెండర్ విలువను బట్టి ఎర్నస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ), టెండర్ డాక్యుమెంట్‌కు కొంత మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. వీటిని కూడా చెల్లించనక్కర్లేదని స్పష్టంచేసింది. ఇలా రూ. 50 లక్షల విలువైన టెండర్లలో పాల్గొనే అవకాశం కల్పించింది. కేవలం ఐటీకి సంబంధించిన కాంట్రాక్టులే కాకుండా టెక్నాలజీతో ముడిపడిన ఎటువంటి పని అయినా చేపట్టవచ్చునని పేర్కొంది. వెబ్‌సైట్ల తయారీ, సాఫ్ట్‌వేర్ సేవలు, డ్రోన్ ఆపరేషన్ ఇలా ఏదైనా చేయవచ్చునని, రాష్ట్ర ప్రభుత్వ టెండర్లలోనే కాకుండా ఏపీలో అటానమస్ సంస్థలు, యూనివర్సిటీలు, డెవలప్‌మెంట్ అథారిటీలు, ప్రభుత్వ రంగ సంస్థల టెండర్లలో కూడా పాల్గొనవచ్చునని ప్రభుత్వం పేర్కొంది.

### డీపీఐఐటీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

దేశంలో ఎవరు స్టార్టప్‌ను ప్రారంభించినా డిపార్టుమెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) వద్ద రిజిస్టర్ చేసుకోవాలి. ఏపీలో సుమారుగా 1,400 స్టార్టప్‌లు రిజిస్టర్ అయ్యాయి. వాటిలో దాదాపుగా 800 వరకు యాక్టివ్‌గా ఉన్నాయి. వారిలో ఎవరైనా ఏపీ ప్రభుత్వం కల్పించిన అవకాశం ఉపయోగించుకోవచ్చు. దీనిపై ఐటీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

### మూడింటిలో ఒకటి ఉన్నా చాలు


'టెండర్లలో పాల్గొనే స్టార్టప్ గతంలో ఏదైనా పోటీలో పాల్గొని విన్నర్ లేదా రన్నర్ బహుమతి గెలిచి ఉండాలి. లేకుంటే ఏదైనా పేటెంట్ ఉండాలి. ప్రభుత్వ లేదా ప్రైవేటు సంస్థ నుంచి గ్రాంట్ పొంది ఉన్నా సరిపోతుంది. మూడింటిలో ఒకటి ఉన్నాచాలు. మిగిలిన వారి కంటే ఆ స్టార్టప్‌లు మంచి ప్రతిభ చూపి ఉండాలనేది ప్రభుత్వ ఉద్దేశం.'

\- కొసరాజు శ్రీధర్, ఐటాప్ పూర్వ చైర్మన్

### తక్కువ ఖర్చుతో ప్రాజెక్టులు

'ప్రభుత్వం ఏదైనా వర్క్ కోసం టెండర్ పిలిస్తే పెద్ద సంస్థలు ఎక్కువకు కోట్ చేస్తాయి. అదే స్టార్టప్‌లైతే తక్కువ మొత్తానికే పని పూర్తి చేయడానికి ముందుకు వస్తాయి. దీని వల్ల ఇరు వర్గాలకు లాభదాయకం. టెండర్ పిలిచిన సంస్థకు ఖర్చు తగ్గుతుంది. స్టార్టప్‌కు ప్రాజెక్టుతో పాటు అనుభవం వస్తుంది.'

\- నరేశ్‌కుమార్, రుషికొండ ఐటీ పార్క్ సంఘం ఉపాధ్యక్షుడు




## ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తామనడం సరికాదు: కేఏ పాల్



విజయవాడ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ఎమ్మెల్యేలు ఇతర పార్టీల్లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారు. వారిని కాపాడుకోవాలంటే జగన్ అసెంబ్లీకి వెళ్లాలి' అని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. విజయవాడలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. 'ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తామని జగన్ వ్యాఖ్యానించడం సరైనది కాదు. అసెంబ్లీకి వెళ్లి ప్రజల సమస్యలపై పోరాడకపోతే వైసీపీ ఎమ్మెల్యేలు వారి పదవులకు రాజీనామా చేయాలి. మా పార్టీ తరఫున ఒక్క ప్రజా ప్రతినిధి లేకపోయినా రాష్ట్రంలోని అనేక సమస్యలపై పోరాడుతున్నాం' అని పాల్ అన్నారు.

## ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉంది?

- ఎమ్మెల్యేకే టెలీకాలర్ ఫోన్!
- కూన రవి కుమార్ సరదా స్పందన



అమరావతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): 'ఎవ్వరినీ వదిలేది లేదు. అందరికీ కాల్ చేస్తాం. సమాచారం రాబడతాం' అంటూ ఏకంగా ఎమ్మెల్యేకే ఫోన్ చేసేశారు. 'మీ ఎమ్మెల్యే పని తీరు ఎలా ఉంది?' అంటూ ఆయననే అడిగారు. ఈ వింత అనుభవం శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు ఎదురైంది. మంగళవారం ఆయన అసెంబ్లీ లాబీల్లో ఉండగా ఫోన్ వచ్చింది. ఆయన స్పీకర్ ఆన్‌చేసి.. సరదాగా సమాధానాలు ఇచ్చారు. టెలీకాలర్, ఎమ్మెల్యే నడుమ జరిగిన సంభాషణ ఇదీ..

**టెలీకాలర్:** సర్, ప్రస్తుత ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది?
**ఎమ్మెల్యే:** ఎక్సలెంట్.
**టెలీకాలర్:** ఆమదాలవలస ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉంది?
**ఎమ్మెల్యే:** వాడో పనికిమాలిన వాడమ్మా.. పనికిమాలిన ఎమ్మెల్యేనమ్మా.
(దీంతో లాబీల్లో ఉన్నవారంతా నవ్వారు)
**టెలీకాలర్:** మీ నియోజకవర్గంలో అసంపూర్తి పనులు, సమస్యలు ఏమైనా ఉన్నాయా?
**ఎమ్మెల్యే:** నాకు అంత నాలెడ్జ్ లేదమ్మా!
**టెలీకాలర్:** మీరు ఓసీనా, బీసీనా, ఎస్సీనా, ఎస్టీనా?
**ఎమ్మెల్యే:** బీసీ.
**టెలీకాలర్:** మీరు హిందువా.. ముస్లిమా?
**ఎమ్మెల్యే:** మా దగ్గర ముస్లింలు లేరమ్మా.
**టెలీకాలర్:** మీ కులం?
**ఎమ్మెల్యే:** కళింగ.
**టెలీకాలర్:** మీ వయసు ఎంత సర్?
**ఎమ్మెల్యే:** అమ్మా మగవాళ్ల వయసు.. ఆడవాళ్ల జీతం అడక్కూడదు!
**టెలీకాలర్:** పర్వాలేదు సర్ చెప్పండి.
**ఎమ్మెల్యే:** నాకు పెళ్లే కాలేదమ్మా!
**టెలీకాలర్:** పోనీ మీ వయసు 50 ఉంటుందా?
**ఎమ్మెల్యే:** పెళ్లికాలేదంటే 50 ఎలా ఉంటాయమ్మా?
**టెలీకాలర్:** మీరు వయసు చెప్పకపోతే సర్వే పూర్తి కాదు సర్.
**ఎమ్మెల్యే:** నీవు విడిచిపెట్టేలా లేవు తల్లీ.. నీ సంతృప్తి కోసం చెబుతున్నా. నా వయసు 57 ఏళ్లు.
(దీంతో థ్యాంక్స్ సర్ అని టెలీకాలర్ కాల్ కట్ చేసింది.)

## ఎన్ని ఇబ్బందులొచ్చినా
# విడిపోం!

సభలో గవర్నర్ ప్రసంగించే సమయంలో గౌరవించాలని, ఆటంకం కలిగించకూడదని అసెంబ్లీ రూల్స్ చాప్టర్ 5లో స్పష్టంగా ఉంది. ఆ రూల్స్‌ను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా మనమే పాటించకపోతే ఎలా? రాష్ట్రంలో ఏదైనా కొత్త కార్యక్రమం చేపట్టాలంటే ఆర్థిక సమస్యలు కనిపిస్తున్నాయి. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మొత్తం ఖాళీ చేసింది.

\- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

అడుగు పెట్టకూడదు. మా కంటే మరొక సీటు అదనంగా వచ్చినా మీకు (వైసీపీకి) ప్రతిపక్ష హోదా వచ్చేది. కానీ ప్రజలు మీకా అవకాశం ఇవ్వలేదు. ఇప్పుడు మనమే అధికార పార్టీ. మనమే ప్రతిపక్ష పార్టీగా వ్యవహరించాలి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఇతర పార్టీ నుంచి గెలిచిన అంబేడ్కర్‌ను న్యాయశాఖ మంత్రిని చేశారు. ప్రతిపక్షంలో ఉన్న శ్యామప్రసాద్ ముఖర్జీని కేబినెట్‌లో చేర్చుకున్నారు. బాబూ రాజేంద్రప్రసాద్‌తో నెహ్రూ అనేక నిర్ణయాలపై విభేదించేవారు. ఆ తర్వాత వాజపేయి, మొరార్జీ దేశాయ్, చరణ్ సింగ్.. ఇలా విభిన్న పక్షాలు ఏకమయ్యాయి. ఏపీది కూడా స్వాతంత్ర్యం తర్వాతి పరిస్థితే. మా పార్టీ, కూటమి.. పాతతరం విలువలతో కూడిన రాజకీయం చేస్తాయి. స్వాతంత్ర్యం సమయంలో కేంద్రంలో సెంట్రల్ రీకన్సిలియేషన్ కేబినెట్ ఏర్పడింది. ఇప్పుడు రాష్ట్రంలో ఉన్నది కూడా స్టేట్ రీకన్సిలియేషన్ కేబినెట్‌లాంటిదే. ప్రతిపక్షంగా ఉండాల్సిన వారు ముఖం చాటేస్తే అధికార, ప్రతిపక్షం రెండూ మేమే. మనందరి లక్ష్యం వికసిత్ ఆంధ్రప్రదేశ్ అని స్పష్టం చేశారు.

### విపక్ష హోదా ఎవరో ఇచ్చేది కాదు..

వైసీపీకి ప్రజలే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని పవన్ అన్నారు. అది ఎవరో ఇచ్చేది కాదని, అందువల్ల ఆ పార్టీకి ఆ హోదా రాదని స్పష్టంచేశారు. ఆ హోదా కావాలంటే జర్మనీ దేశంలో అవకాశం ఉందని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేలంతా ఫ్లయిట్ టికెట్లు ఇప్పిస్తామని సరదాగా వ్యాఖ్యానించారు. 'అసెంబ్లీలో జరిగే గొడవలు ఎలా ఉంటాయో నాకు తెలియదు. గతంలో ఈఎస్ఎల్ నరసింహన్ గవర్నర్‌గా ఉన్నప్పుడు కొన్ని గొడవలు చూశాను. అప్పుడు విభేదించడానికి కారణం ఉంది. ఇప్పుడు విభేదించడానికి ఏముంది? రాష్ట్ర ప్రథమ పౌరుడైన గవర్నర్ ప్రసంగిస్తుంటే ఇలాగేనా వ్యవహరించేది? మనమే నిబంధనలు ఉల్లంఘిస్తే ఇక ప్రజలకేం చెబుతాం. ఇక్కడ గొడవలకు కేసులు ఉండవు కాబట్టి మరింత బాధ్యతాయుతంగా ఉండాలి. అదే ఆయన (గవర్నర్ అబ్దుల్ నజీర్) సుప్రీంకోర్టు జడ్జిగా ఉన్నప్పుడైతే ధైర్యం చేయగలరా? కళ్లలోకి చూడగలరా' అని నిలదీశారు.

### మేం వచ్చాక ఎన్నో చేశాం..

వైసీపీ ప్రభుత్వం రాజధానితో మూడు ముక్కలాట ఆడిందని.. రాష్ట్రం ఆర్థిక స్థిరత్వం కోల్పోయేలా చేసిందని పవన్ విమర్శించారు. 'కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఒకేరోజు 13,326 గ్రామ సభలు నిర్వహించి ప్రపంచ రికార్డు సాధించాం. మూడు నెలల్లో ప్రతి గ్రామంలో రోడ్లు నిర్మించాం. వైసీపీ ఐదేళ్లలో 1,800 కిలోమీటర్ల సీసీ రోడ్లు వేస్తే, మేం ఆరు నెలల్లో 4,300 కిమీ సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాం. వాళ్ల హయాంలో 268 మినీ గోకులాలు కడితే.. మేం ఇప్పటికే 22,500 గోకులాల నిర్మాణం చేపట్టాం. గత ప్రభుత్వం రూ.వెయ్యి పెన్షన్ పెంచడానికి ఐదేళ్లు తీసుకుంది. కూటమి ప్రభుత్వం నెల రోజుల్లోనే రూ.వెయ్యి పెంచింది. అటవీ ప్రాంతాల రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కుంకీ ఏనుగులు తీసుకొస్తున్నాం. రాష్ట్రంలో 50శాతం పచ్చదనం లక్ష్యంగా పనిచేస్తున్నాం. తాజాగా అన్నమయ్య జిల్లాలో జరిగిన ఏనుగుల దాడి ఘటనపై సమీక్షించాం. అక్కడ షార్ట్‌కట్ దారిని ఎంచుకోవడం వల్ల ఏనుగు దాడి చేసింది. అందుకే అటవీ ప్రాంతాల్లో ఉండే ప్రజలు ప్రభుత్వం నిర్దేశించిన దారుల్లోనే ప్రయాణించాలి. గత ప్రభుత్వంలో జరిగిన నిర్వాకంతో అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనాన్ని పట్టుకున్న కర్ణాటక ప్రభుత్వానికి రూ.125 కోట్ల ఆదాయం వచ్చింది. గత ప్రభుత్వం గిరిజన ప్రాంతాలను నిర్లక్ష్యం చేసింది. మేం వచ్చాక తొలిసారి గిరిజన ప్రాంతాల్లో రోడ్లు వేశాం. ఆర్థిక పరిస్థితి బాగోకపోయినా సీఎం రూ.35 కోట్లు విడుదల చేశారు. దాంతో మొదటిసారి అక్కడ ప్రజలు అంబులెన్స్ శబ్దం విన్నారు. వారికి డోలీ కష్టాలు తీరాయి" అని అన్నారు.

### ప్రధానికి ధన్యవాదాలు

'విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం 32 మంది చనిపోయారు. అన్ని ప్రాంతాల వారు ఇందులో ఉన్నారు. ఆ రోజు ప్రైవేటీకరణ ప్రకటన చేస్తే వైసీపీ వాళ్లు మద్దతు పలికారు. పైగా మమ్మల్ని ఇరకాటంలో పెట్టాలని చూశారు. అప్పుడు ఢిల్లీ వెళ్లి అమిత్‌షాను కలిసి ఆలోచన విరమించుకోవాలని కోరాం. కానీ ఆరోజు అది అసాధ్యమని చెప్పారు. కానీ సీఎం చంద్రబాబు దాన్ని ముందుకు తీసుకెళ్లారు. ఆంధ్రులకు కులాల భావన తప్ప ఆంధ్రులు అనే భావన తక్కువ. కానీ అందరూ ఆంధ్రులుగా భావించేది విశాఖ స్టీల్ ప్లాంట్. దాని ప్రైవేటీకరణను నిలుపుదల చేసినందుకు ప్రధాన మోదీకి ధన్యవాదాలు. అలాగే పలు పథకాలకు రాష్ట్రానికి నిధులు కేటాయించారు' అని పవన్ చెప్పారు.

### పవన్ చెప్పిన 'జల్సా' కథ!

గతంలో తాను అటవీశాఖ మంత్రిగా ఉన్నప్పుడు అమలు చేసిన 'హరితవనం' కార్యక్రమాన్ని పునరుద్ధరించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు కోరినప్పుడు.. రాష్ట్రానికి ఉన్న ఆర్థిక ఇబ్బందులు వివరించేందుకు పవన్ సరదాగా 'జల్సా' సినిమా కథ చెప్పారు. 'ఆ సినిమాలో హీరో స్నేహితులు ఎవరొచ్చి ఏం అడిగినా... బీరువా చూపించి, అందులో డబ్బులుంటాయి తెచ్చుకో అంటాడు. ఐదు సార్లు తీసుకున్నాక ఆ చొక్కా అతను బయటికొస్తాడు. ఏముంది ఆ చొక్కాలో.. చొక్కా దానికో బొక్క తప్ప అంటాడు. అలా ఇప్పుడు మేమేదైనా అడుగుదామంటే.. వారు ఖజానాను లూటీ చేసి వెళ్లిపోయారు. ఏదైనా పనికోసం డబ్బులు అవసరమైతే సీఎంను అడుగుతాం. ఆయనేమో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌వైపు చూస్తారు' అని సరదాగా అన్నారు. సీఎంతో మాట్లాడి హరితవనాన్ని పదిరెట్లు ఎక్కువగా అమలు చేస్తామని స్పీకర్‌కు హామీ ఇచ్చారు.





మంగళవారంనాడు సభలో మంత్రులు నారా లోకేశ్, అనిత, సవిత, ఎమ్మెల్యేలు తదితరులు

### చంద్రబాబు ఇన్నేళ్లు ఎలా భరించారో!

బూతులు, గొడవలకు వైసీపీ పర్యాయపదంగా మారిందని పవన్ మండిపడ్డారు. 'ఇన్నేళ్లు ఇలాంటివారిని చంద్రబాబు ఎలా భరించారో! ఆయనకు హాట్సాఫ్. వారు పేపర్లు విసిరినప్పుడు వివేకానంద రెడ్డి హత్య గుర్తొచ్చింది. 200 ఆలయాల విధ్వంసం గుర్తొచ్చింది. డాక్టర్ సుధాకర్ చనిపోవడం గుర్తొచ్చింది. చివరికి చంద్రబాబును 53 రోజులు జైల్లో పెట్టిన విషయం గుర్తొచ్చింది. జడ్జిలను సోషల్ మీడియాలో తిట్టిన విషయం, పత్రికాధిపతులపై దాడులు గుర్తొచ్చాయి. వారు సభలోనే ఇలా ప్రవర్తిస్తున్నారంటే మరి బయటా..! గవర్నర్‌లాంటి ఉన్నతమైన వ్యక్తి ఆరోగ్యం బాగాలేకపోయినా విజయవంతంగా ప్రసంగించారు. ఆయన్ను వైసీపీ సభ్యులు ఇబ్బంది పెట్టారు. చట్టసభలు దేవాలయం లాంటివి. వారు గవర్నర్ పట్ల సరిగా వ్యవహరించలేదు. అందుకు మా తప్పు లేకపోయినా ప్రభుత్వం తరఫున ఆయనకు క్షమాపణలు చెబుతున్నాం. గవర్నర్‌ను గౌరవించనివాళ్లు వచ్చే ఎన్నికల్లో మళ్లీ సభలోకి రాకూడదు' అని తేల్చిచెప్పారు. మళ్లీ వైసీపీ ప్రభుత్వం వస్తే పరిస్థితులు ఇంకెలా ఉంటాయోనని పవన్ ఆందోళన వ్యక్తంచేశారు. '4 దశాబ్దాల అనుభవం ఉన్న చంద్రబాబునే జైల్లో పెట్టి ఇబ్బంది పెట్టారు. లోకేశ్‌ను జైల్లో పెట్టాలని చూశారు. అచ్చెన్నాయుడిని జైలుకు పంపారు. ఎంత మంది ఇబ్బంది పడ్డారని అడిగితే ఈ సభలో 90 శాతం చేతులెత్తారు' అని చెప్పారు. వైసీపీకి 11 సీట్లు వచ్చినా సభకు వచ్చినప్పుడు ఇబ్బంది పెట్టకూడదనుకున్నామని... వారికి ఇవ్వాల్సిన గౌరవం ఇద్దామనుకున్నామని పవన్ తెలిపారు. ఎవరైనా ఏదైనా అన్నా సీఎం సున్నితంగా మందలించారన్నారు.

## 'సాక్షి'పై ప్రివిలేజ్

- ఎమ్మెల్యేలకు శిక్షణ ఇవ్వకుండానే కోట్లు ఖర్చంటూ తప్పుడు వార్తలతో సభ పరువు తీసిన జగన్ పత్రిక
- చర్యలు తీసుకోవాలన్న ఎమ్మెల్యే జయసూర్య
- ప్రివిలేజ్ కమిటీకి సిఫారసు చేసిన స్పీకర్
- ఎమ్మెల్సీ కోడ్ వల్లే కార్యక్రమం వాయిదా..
- అసత్య వార్తలు బాధ కలిగించాయి: అయ్యన్న



అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మొదటి సారి ఎమ్మెల్యేల శిక్షణ తరగతుల కోసం చేసిన ముందస్తు ఏర్పాట్లలో రూ.కోట్లు వృథా చేశారంటూ కథనం ప్రచురించిన 'సాక్షి' తీరు మంగళవారం అసెంబ్లీలో చర్చకు వచ్చింది. జరగని శిక్షణ తరగతులకు కోట్లు ఖర్చు చేయడం ఎలా సాధ్యమని అధికార టీడీపీ సభ్యుడు గిత్తా జయసూర్య ప్రశ్నించారు. జగన్ పత్రికపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానాన్ని ఆయన ప్రవేశపెట్టారు. ఆ వినతిని పరిగణనలోకి తీసుకున్న అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ అంశాన్ని సభాహక్కుల సంఘానికి (ప్రివిలేజ్ కమిటీ) ప్రతిపాదిస్తున్నట్లు ప్రకటించారు. సంఘం విచారణ తర్వాత చేసే సిఫారసు మేరకు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అసలేం జరిగిందంటే.. ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో 84 మంది మొదటి సారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. సభలో ప్రజా సమస్యల ప్రస్తావన, పాటించాల్సిన నియమాలు, నిబంధనలు, ఇతర అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 22, 23న శిక్షణ తరగతులు నిర్వహించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం సమ్మతి తెలపడంతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తదితరులను ఆహ్వానించాలని అనుకున్నారు. వేదికగా విజయవాడను ఎంచుకున్నారు. అయితే రాష్ట్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఈ కార్యక్రమాన్ని వాయిదా వేశారు. ఈ విషయమై జగన్ రోత పత్రికలో 'కోట్లు ఖర్చు.. శిక్షణ తుస్సు..' శీర్షికన ఈ నెల 22న వార్త ప్రచురించారు. అవగాహనలేని శాసన సభ నవ్వుల పాలైందని.. అతిథుల కోసం హోటళ్లలో గదులు బుక్ చేసి శాలువాలు, జ్ఞాపికలు కొనుగోలుకు కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అయినట్లు అందులో పేర్కొన్నారు. దీనిపై ఎమ్మెల్యే జయసూర్య సభాహక్కుల ఉల్లంఘన తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు.

### సమగ్ర విచారణ జరిపించాలి: కూన రవి

అప్పులు, అరాచకాలతో రాష్ట్రాన్ని ఐదేళ్ల పాటు ధ్వంసం చేసి వనరులతో పాటు రాష్ట్ర ఆదాయాన్నీ దోచేసిన వైసీపీ అవినీతిపై కూలంకషంగా విచారణ జరిపించాలని ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. గవర్నర్ ప్రసంగిస్తుండగా సోమవారం వైసీపీ సభ్యులు వ్యవహరించిన తీరు దుర్మార్గంగా ఉందన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని దోచేసి అభివృద్ధి పూర్తిగా విస్మరించిన వైసీపీకి ప్రజలే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని వ్యాఖ్యానించారు. స్వార్థం తప్ప ప్రజల కోసం పనిచెయ్యని వైసీపీని అధికారం నుంచి ప్రజలే విసిరి పారేశారని, ఐదేళ్ల పాటు నడిచిన మాఫియా రాజ్యానికి సమాధి కట్టేశారని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ అన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల నుంచి సామాజిక పెన్షనర్ల వరకూ అందరూ ఒకటో తేదీ చేతికి డబ్బు తీసుకుని హాయిగా జీవిస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ ప్రాధాన్యం ఇస్తున్న చంద్రబాబు ప్రభుత్వం ఆర్థికంగా రాష్ట్రాన్ని బలోపేతం చేసేందుకు శ్రమిస్తోందన్నారు. ఐదేళ్ల అరాచకపాలన అంతమై కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, జనసేన ఎమ్మెల్యే లోకం మాధవి వ్యాఖ్యానించారు.

# పేదరిక నిర్మూలనే లక్ష్యం

- కక్ష సాధింపు చర్యలు మా విధానం కాదు
- కలిసికట్టుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం
- మూడేళ్లలో అమరావతి కోర్ క్యాపిటల్ పూర్తి
- విద్యా సంవత్సరం ప్రారంభంలోగా కొత్త టీచర్లు
- ఏప్రిల్, మేల్లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ
- రాష్ట్రం కోసమే కేంద్రానికి బేషరతుగా మద్దతు
- శాసనమండలిలో మంత్రి నారా లోకేశ్



"రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ వచ్చింది. కేంద్ర ప్రభుత్వ సహకారం ఏపీకి చాలా అవసరం. మేం బేషరతుగా ఎన్‌డీయేలో చేరాం. ఐదేళ్లలో మీరు (వైసీపీ) తీసుకురాలేని నిధులు మేం 9 నెలల్లో తెచ్చాం. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం"

\- మంత్రి నారా లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): "పేదరికం లేని ఆంధ్రప్రదేశ్ మా ప్రభుత్వ లక్ష్యం. అభివృద్ధి, సంక్షేమం అమలు చేస్తాం. సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో ఉన్నాం. కక్షసాధింపు మా విధానం కాదు. రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిద్దాం. కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందాం" అని మంత్రి నారా లోకేశ్ శాసన మండలిలో వైసీపీ సభ్యులను ఉద్దేశించి అన్నారు. "సాగునీటి ప్రాజెక్టులతో పాటు అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి మా లక్ష్యం. అమరావతికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని అసెంబ్లీలో నాటి ప్రతిపక్షనేత (జగన్) చెప్పారు. ప్రధాని మోదీ వచ్చి అమరావతి రాజధానికి శంకుస్థాపన చేశారు. ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా ప్రతిజిల్లాకు ఒక యాక్షన్ ప్లాన్ ఇచ్చాం" అని అన్నారు. కాగా, మండలిలో వైసీపీ, టీడీపీ సభ్యుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్యుద్ధం జరిగింది. పలు అంశాలపై లోకేశ్ దీటుగా సమాధానం చెప్పారు.

### ఒక్క చాన్స్ పేరుతో రాష్ట్రానికి నష్టం

2019లో ప్రజలు ఒక్క చాన్స్ మాయలోపడి వైసీపీకి అధికారం ఇవ్వడంతో రాష్ట్రం ఎంతో నష్టపోయింది. గత ఐదేళ్లలో రాష్ట్రానికి పెట్టుబడులు రాలేదు. ఒక్క డీఎస్సీలేదు. మీరు మమ్మల్ని ప్రశ్నిస్తారా? జేట్యాక్స్‌ల కోసం పీపీఏలు రద్దు చేశారు. పీపీఏల రద్దు వల్ల ప్రధాన పెట్టుబడిదారులు పారిపోయారు. సంక్షేమం, అభివృద్ధి జోడెద్దులలాంటివి. అభివృద్ధి చేస్తే ట్యాక్సులు పెరుగుతాయి. గత ప్రభుత్వం అప్పులతో సంక్షేమం చేయడంతో రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో మునిగాం. ఆ అప్పులపై రూ.5వేల కోట్లు వడ్డీ కట్టాల్సిన పరిస్థితి. గత పాలకులు అమరావతిని సర్వనాశనం చేశారు" అని లోకేశ్ నిప్పులు చెరిగారు.

### నాపై 23 కేసులు పెట్టారు!

అయిదేళ్ల అరాచకపాలనలో రాష్ట్ర ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడ్డారని లోకేశ్ అన్నారు. "ప్రతిపక్ష నాయకులపై ఇష్టారాజ్యంగా కేసులు పెట్టారు. 8 నెలలుగా మేం ఒక్క తప్పుడు కేసు పెట్టలేదు. నాపై 23 కేసులు పెట్టారు. నా తల్లిని నన్ను, శాసనమండలి చైర్మన్ షరీఫ్‌ను అవమానించారు. నా వద్ద ఆధారాలు ఉన్నాయి. టీడీపీ కార్యాలయంపై దాడి చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలపై యథేచ్ఛగా దాడులు చేశారు. మాపై బాధ్యత పెరిగింది. ఏపీ బ్రాండ్ పునరుద్ధరణకు కష్టపడుతున్నాం. మేం పెట్టుబడుల కోసం పారిశ్రామిక వేత్తల వద్దకు వెళుతుంటే మళ్లీ జగన్ రారని గ్యారెంటీ అడుగుతున్నారు" అన్నారు. 'ఇచ్చిన మాట ప్రకారం అయిదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 20 లక్షల ఉద్యోగాలు సాధిస్తాం. గత ఎనిమిది నెలల్లో 6.4 లక్షల కోట్లు పెట్టుబడులు రప్పించాం. వీటి ద్వారా 4.5 లక్షల ఉద్యోగావకాశాలు లభిస్తాయి. మెగా డీఎస్సీ కొన్ని సాంకేతిక కారణాల వల్ల జాప్యమైంది. ఏప్రిల్, మే నెలల్లో ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరంలోనే కొత్త ఉపాధ్యాయులు స్కూళ్లకు వచ్చేలా చేస్తాం. పెన్షన్లు ఒకే సారి రూ.వెయ్యి పెంచాం. ఏటా 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ప్రారంభించాం. ఏప్రిల్, మే నెలల్లో 'తల్లికి వందనం' అమలు చేస్తాం. అన్నదాత సుఖీభవను కూడా ఇస్తాం' అని చెప్పారు.

### పులివెందుల ఎమ్మెల్యే ఏం చేశారు?

"కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానన్న పులివెందుల ఎమ్మెల్యే ఐదేళ్లు ఏం చేశారు. గత ఐదేళ్లలో కేంద్రంలో అన్ని బిల్లులకూ సపోర్టు చేశారు. మరి ఏపీకి ఏం చేశారో? ఏం తెచ్చారో? వైసీపీ సభ్యులు సమాధానం చెప్పాలి" అని మండలిలో లోకేశ్ నిలదీశారు. ఏపీపీఎస్సీ చైర్మన్‌ను తాము బెదిరించామంటూ వైసీపీ సభ్యురాలు వరుదు కల్యాణి చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని వాటిని వెనక్కి తీసుకోవాలని, రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కాగా, ఆ వ్యాఖ్యలపై రికార్డులను పరిశీలించి అభ్యంతరకరంగా ఉంటే తొలగిస్తామని చైర్మన్ మోషేన్‌రాజు చెప్పడంతో సద్దుమణిగింది.

### రాష్ట్రం కోసం మద్దతు

రాష్ట్ర ప్రయోజనాల కోసమే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు కేంద్రానికి బేషరతుగా మద్దతు ఇస్తున్నారని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. గవర్నర్ ప్రసంగాన్ని తెలుగు, ఇంగ్లి్‌ష్‌లో ప్రచురించారని, ఈ రెంటి మధ్య తేడా ఉందని వైసీపీ సభ్యులు పేర్కొనడంతో మండలిలో గందరగోళం నెలకొంది. 4 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని గవర్నర్ ప్రసంగంలో ఉందని కల్యాణి అన్నారు. ఆమె ఈ వ్యాఖ్యలపై లోకేశ్ అభ్యంతరం తెలిపారు. తాము ఉద్యోగాలు ఇచ్చామని ఎక్కడా చెప్పలేదని, ఉద్యోగావకాశాలు కల్పించామనే చెప్పామని పేర్కొన్నారు. ఇక, టీడీపీ మద్దతు మీదే కేంద్రం ఆధారపడి ఉందని తాము చెబుతున్నట్లు కల్యాణి చెప్పిన అసత్యాలను వెనక్కి తీసుకోవాలని, ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని లోకేశ్ డిమాండ్ చేశారు. ఈ సమయంలో వాకౌట్ చేయబోయిన వైసీపీ సభ్యులను ఉద్దేశించి.. "వాకౌట్ చేయొద్దు. అన్నింటిపైనా చర్చిద్దాం" అని లోకేశ్ అన్నారు. "ఇంగ్లీషు మీడియం కావాలంటారు. మళ్లీ ఇంగ్లీషులో చెప్తే అర్థం కాదని అంటారు" అని వ్యాఖ్యానించారు. ఈ సమయంలో జోక్యం చేసుకున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ "గవర్నర్‌ప్రసంగం తెలుగు అనువాదంలో తేడా ఉందని, తప్పుంటే మార్చుకుంటామని చెప్పండి" అన్నారు. దీంతో టీడీపీ, వైసీపీ మధ్య మాటల యుద్ధం నడిచింది.

### ప్రతిపక్ష హోదా ఎలా అడుగుతారు?

"పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో పార్లమెంటు గైడ్‌లైన్స్‌ను అనుసరించాల్సి ఉంది. దీనిలో లోక్‌సభ స్పీకర్ డైరెక్షన్‌లో 'కండిషన్స్ ఫర్ రికగ్నిషన్' పేజీ నెంబర్ 62లో 121-సీ పాయింట్‌లో టోటల్ నెంబర్ ఆఫ్ హౌస్‌లో పదో వంతు ఉంటేనే ప్రతిపక్ష హోదా ఇవ్వాలని ఉంది. 2009 అసెంబ్లీకి సంబంధించి కూడా అలాంటి నిబంధనలే ఉన్నాయి. మాజీ ముఖ్యమంత్రి 2019, జూన్‌లో చంద్రబాబుకు 23 మంది సభ్యులు ఉన్నారు, ఐదుగురిని లాగేస్తే 17 లేదా 18 మంది ఉంటారు. అప్పుడు ఆయనకు ప్రతిపక్ష హోదా ఉండదని చెప్పారు. ఇప్పుడు ఏ విధంగా ప్రతిపక్ష హోదా అడుగుతారు. అసెంబ్లీ, కౌన్సిల్‌లో సమస్యలపై చర్చ జరగాలి" అని శాసన మండలిలో మంత్రి లోకేశ్ అన్నారు.

## వీసీలను బెదిరించామా? నిరూపించండి!

- ఆధారాలిస్తే విచారణకు ఆదేశిస్తా.. బెదిరించడం మీకు అలవాటు
- మండలిలో వైసీపీ ఆరోపణలకు మంత్రి లోకేశ్ సమాధానం

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్ల(వీసీ) రాజీనామాపై శాసనమండలిలో కూటమి, వైసీపీ సభ్యుల మధ్య వాడివేడిగా చర్చ జరిగింది. రాష్ట్రంలో 17 మంది వీసీలు రాజీనామా చేశారని, వారిని బెదిరించి మూకుమ్మడిగా రాజీనామా చేయించారని వైసీపీ సభ్యుడు చంద్రశేఖరరెడ్డి ఆరోపించారు. దీనిపై స్పందించిన మంత్రి లోకేశ్.. "వీసీలను బెదిరించి రాజీనామాలు చేయించామంటున్నారు కదా.. ఆధారాలు ఇవ్వండి. ఇప్పుడే విచారణకు ఆదేశిస్తా. అనవసరమైన ఆరోపణలు చేయడం కాదు. వాటిని నిరూపించాలి" అని సవాల్ విసిరారు. వైసీపీ సభ్యులు గవర్నర్‌ను అవమానించేలా మాట్లాడుతున్నారని అన్నారు. "వీసీలను మేం బెదిరించడం ఏంటి? గవర్నర్ ఆధ్వర్యంలో వర్సిటీలు నడుస్తాయి. ఎవరు బెదిరించారో చెప్పమనండి. గతంలో ఏపీపీఎస్సీ చైర్మన్‌ను రూంలోకి వెళ్లకుండా తాళం వేశారు. మీరా మాట్లాడేది? మీ వ్యాఖ్యలను ఉపసంహరించుకోండి" అని లోకేశ్ డిమాండ్ చేశారు. వీసీలు తప్పు చేశారు కాబట్టే రాజీనామా చేసి వెళ్లిపోయారన్నారు. "బెదిరించడం, భయపెట్టడం, బయటకు వంపండం మీకు అలవాటు" అని మంత్రి తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. వీసీల విషయంలో ఆధారాలు సమర్పిస్తే విచారణ జరిపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. స్పందించిన వైసీపీ సభ్యుడు బొత్స సత్యనారాయణ.. వీసీల రాజీనామా లేఖల్లోనే అధికారులు చేయమన్నారని ఉందని చెప్పారు.

### జగన్‌ను సభకు తీసుకురండి: ఆది

అమరావతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌ను ఎలాగైనా అసెంబ్లీకి తీసుకురావాలని స్పీకర్ అయ్యన్నను బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కోరారు. గవర్నర్ ప్రసంగం సందర్భంగా సభలో వైసీపీ దారుణంగా వ్యవహరించిందన్నారు. చివరికి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లును కూడా జగన్ గవర్నర్ పైకి ఉసిగొల్పారని ఆక్షేపించారు. 11 మంది ఎమ్మెల్యేలున్నారని, రెండు నిమిషాలు చొప్పున 22 నిమిషాలు మాట్లాడే అవకాశం వారికి ఉందన్నారు.

### వైసీపీ సభ్యులకు సభ్యత, సంస్కారం లేవు: జీవీ

వైసీపీ ఎమ్మెల్యేలు సభ్యత, సంస్కారం లేకుండా సభలో వ్యవహరించారని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు విమర్శించారు. వరుసగా 60 రోజులు సభకు రాకపోతే సభ్యత్వం పోతుందనే భయంతోనే ఒకరోజు వచ్చారన్నారు. 11 మంది ఎమ్మెల్యేలు చివరికి 11 నిమిషాలు కూడా మాట్లాడలేదన్నారు.

### ఈసారి జగన్ జీరో అవడం ఖాయం: మాధవి

ప్రతిపక్ష హోదా ఇవ్వలేదంటూ వైఎస్ జగన్ అసెంబ్లీకి రాకపోతే.. వైసీపీకి ఇప్పుడున్న 11 సీట్లు కూడా రావని, జగన్ జీరో అవుతాడని జనసేన ఎమ్మెల్యే లోకం మాధవి అన్నారు. జగన్ అసెంబ్లీకి రాకపోవడం దుర్మార్గమని, సభకు వెళ్దామని వైసీపీ ఎమ్మెల్యేలైనా ఆయనకు చెప్పాలని సూచించారు.

### వ్యక్తిగత లబ్ధికే జగన్ రాద్ధాంతం: పార్థసారథి

ప్రజా సమస్యలు పట్టని జగన్.. తన వ్యక్తిగత లబ్ధి కోసమే ఒక రోజు అసెంబ్లీకి వచ్చారని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి విమర్శించారు. సభ్యత్వం రద్దవుతుందనే భయంతోనే సభలో హాజరు వేయించుకుని వెళ్లిపోయారని అన్నారు. ప్రజా సమస్యలను ప్రస్తావించని జగన్.. సౌకర్యాలు అనుభవిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు.

### నిపుణులనే వీసీలుగా నియమించాం: భూమిరెడ్డి

వైఎస్ జగన్ తన హయాంలో సింహపురి వర్సిటీకి వైఎస్సార్ బంధువు సుందరవల్లి, శ్రీకృష్ణదేవరాయ వర్సిటీకి పులివెందులకు చెందిన రామకృష్ణారెడ్డిని, నన్నయ్య వర్సిటీకి వైఎస్ భారతి తమ్ముడు సురేంద్రనాథ్‌రెడ్డిని, ఏయూకు ప్రసాదరెడ్డిని నియమించారని, మంత్రి లోకేశ్ మాత్రం విద్యారంగ నిపుణులను వీసీలుగా నియమించారని చెప్పారు.

### వర్సిటీలను రాజకీయాలకు వాడుకున్న వైసీపీ: విప్

వర్సిటీలను జగన్‌రెడ్డి రాజకీయ ప్రయోజనాలకు వాడుకున్నారని మండలిలో ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ ఆరోపించారు. ఆంధ్రా వర్సిటీని వైసీపీ కార్యాలయంగా మార్చారని, ఎస్వీయూలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు.

# భక్తులపై ఏనుగుల దాడి..

**కాలినడకన అడ్డదారిలో తలకోనకు**

**శివరాత్రి ఉత్సవాలకు వెళ్తుండగా పెను విషాదం**

**ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి**


వంకాయల దినేశ్ | తుపాకుల మణెమ్మ | టి.చెంగల్రాయుడు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినాన ఆ శివయ్యను దర్శించుకుందామని బయలుదేరిన భక్తులపై ప్రశాంతమైన ప్రకృతి.. పగబట్టినట్లు పంజా విసిరింది! అసలే అడవి.. ఆపై అర్ధరాత్రి.. ఏనుగుల భీకర గర్జనలతో భూమి కంపించింది.. తలకోనకు నడచి వెళుతున్న భక్తులపై ఏనుగుల గుంపు దాడి చేయడంతో ముగ్గురు భక్తులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. నలుగురు గాయపడ్డారు. అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండల పరిధిలో ఉన్న గుండాలకోన నీలకంఠేశ్వర స్వామి ఆలయానికి 4 కిలోమీటర్ల దూరంలోని శేషాచల అడవిలో సోమవారం అర్ధరాత్రి ఈ ఘోర విపత్తు చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. రైల్వేకోడూరు మండలం ఉర్లగట్టుపోడు అరుంధతివాడ, కన్నెగుంట గిరిజన కాలనీలకు చెందిన భక్తులు 30 మంది తిరుపతి జిల్లా నెరబైలు సమీపంలో ఉన్న తలకోనలోని శ్రీసిద్ధేశ్వర స్వామి దర్శనం కోసం కాలినడకన సోమవారం రాత్రి 7 గంటలకు శేషాచలం అడవిలోని అడ్డదారిలో బయలుదేరారు. రాత్రి 2 గంటల సమయంలో గుండాలకోనకు 4కిమీ దూరంలో ఏనుగుల మంద తారసపడింది. శబ్దం చేస్తే వెళ్లిపోతాయన్న ఉద్దేశంతో 30 మందిలో ఒకరు స్టీలు టిఫిన్ బాక్సుతో శబ్దం చేయడంతో ఆగ్రహంతో ఏనుగులు ఒక్కసారిగా భక్తులపై దాడి చేశాయి. దీంతో చెట్టుకొకరు పుట్టకొకరు పరుగులు తీశారు. ఏనుగుల దాడిలో ఉర్లగట్టుపోడుకు చెందిన పుణెలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న వంకాయల దినేశ్ (34) మృతి చెందాడు. ఇతడికి పది రోజుల క్రితమే కొడుకు పుట్టడంతో తలనీలాలు ఇచ్చేందుకు వెళుతూ మృత్యువాతపడ్డాడు. అలాగే కన్నెగుంట గిరిజన కాలనీకి చెందిన తుపాకుల మణెమ్మ(40), తిరుపతి చెంగల్రాయుడు(35)లను ఏనుగులు తొక్కి చంపేశాయి. ఉర్లగట్టుపోడు అరుంధతివాడకు చెందిన పలిగిల రాజశేఖర్, వెంకట సుబ్బయ్య, వెంకట రత్నమ్మ, కన్నెగుంట గిరిజనకాలనీకి చెందిన అమ్ములు అలియాస్ పాపమ్మ గాయపడ్డారు. అటవీశాఖ, పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని రైల్వేకోడూరు ఆస్పత్రికి తరలించారు.


బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేస్తున్న రైల్వేకోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్

### బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున అందజేత

ఏనుగుల దాడిలో మృతి ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు, గాయపడిన కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం ప్రభుత్వం ద్వారా అందించాలని స్థానిక అటవీశాఖాధికారులను ఆదేశించారు. వెంటనే వెళ్లి బాధితులను పరామర్శించాలని పవన్ ఆదేశించడంతో.. రైల్వేకోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అసెంబ్లీ సమావేశాల నుంచి వెంటనే వెనుదిరిగి వచ్చి బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెక్కులు పంపిణీ చేశారు.

### ఏనుగుల కదలికలను ట్రాక్ చేయండి

మహాశివరాత్రి సందర్భంగా అటవీ ప్రాంతాల్లో ఉన్న ఆలయాలను దర్శించుకునే భక్తులకు తగిన భద్రత కల్పించాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్‌వోలతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఏనుగుల కదలికలను ట్రాక్ చేయడానికి రేడియో కాలరింగ్, ఇతర ముందస్తు హెచ్చరికల వ్యవస్థలను ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చారు.

### పొదలో దాక్కున్నా..

తలకోనలో శివయ్యను దర్శించుకోవడానికి నడిచివెళ్తుండగా సోమవారం రాత్రి 7 గంటలకు కాలినడక ప్రారంభించాం. అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో దట్టమైన అడవిలో ఏనుగులు తారసపడ్డాయి. అందరం పొదలోకి వెళ్లి దాక్కున్నాం. నా కుమార్తె అమ్ములు (అలియాస్ పాపమ్మ) కాలు బయట ఉండడంతో ఆ కాలును ఏనుగు తొక్కింది. దీంతో నా భార్య మణెమ్మ కేకలు పెట్టింది. దీంతో ఏనుగుల మంద ఒక్కసారిగా మీదపడి తొక్కేయడంతో నా భార్య మణెమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. నా కుమార్తె కాలు విరిగి ఉంది. దిక్కు తోచక బిక్కుబిక్కుమంటూ తెల్లవారిందాకా ఉండాల్సి వచ్చింది.

- సిద్ధయ్య, ప్రత్యక్ష సాక్షి, కన్నెగుంట గిరిజన కాలనీ


విద్యుద్దీపాల అలంకరణలో కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి దేవస్థానం



శ్రీశైల మల్లన్న ప్రధాన ఆలయానికి శివరాత్రి శోభ

# సర్వం శివమయం!

## మహాశివరాత్రికి ముస్తాబైన శైవ క్షేత్రాలు

శ్రీశైలం/కోటప్పకొండ(నరసరావుపేట)/శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వేడుకలకు శైవ క్షేత్రాలన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. మంగళవారం ఉదయం నుంచే లక్షల సంఖ్యలో భక్తులు శ్రీగిరికి తరలి వస్తున్నారు. బుధవారం జరిగే వేడుకలకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. వివిధ రకాల పూలు, విద్యుద్దీపాల అలంకరణతో ప్రధాన ఆలయం దేదీప్యమానంగా వెలుగుతోంది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సాయంత్రం 5:30 గంటలకు ప్రభోత్సవం, రాత్రి 7గంటలకు నందివాహన సేవ, రాత్రి 10 గంటలకు లింగోద్భవకాల మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అర్ధరాత్రి వేళ పాగాలంకరణ, స్వామిఅమ్మవార్లకు కల్యాణమహోత్సవం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

**ఎంతో ప్రత్యేకం.. పాగాలంకరణ**

మహాశివరాత్రి వేడుకల సందర్భంగా లింగోద్భవ కాలంలో జరిగే శ్రీశైలంలో పాగాలంకరణకు ఎంతో విశిష్టత ఉంది. ప్రకాశం జిల్లా హస్తినాపురానికి చెందిన పృథ్వీ వెంకటేశ్వర్లు కుటుంబం మూడు తరాలుగా మల్లన్నకు పాగాను అలంకరిస్తోంది. ఏడాది పాటు దీక్షలో ఉండి రోజుకు ఒక మూర చొప్పున 365 రోజులు పాగా వస్త్రాన్ని పృథ్వీ కుటుంబం నేస్తుంది. కల్యాణోత్సవానికి ముందు వరుడు మల్లన్నకు తలపాగా చుట్టే తీరు అద్భుతంగా ఉంటుంది. మహాశివరాత్రి రోజున చిమ్మ చీకట్లో దిగంబరులుగా మారి స్వామివారి గర్భాలయ విమాన కలశాలు, నవ నందులను కలుపుతూ పాగాను అలంకరిస్తారు.

**శ్రీకాళహస్తిలో...**

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో బుధవారం జరిగే మహాశివరాత్రి వేడులకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులు ఇబ్బంది పడకుండా తాగునీరు, బిస్కెట్లు అందించనున్నారు. తొలిసారిగా ఉచిత ప్రసాదాలు పంపిణీ చేయనున్నారు. ఇక, ప్రభుత్వం తరఫున దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఆలయ ఈవో బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కోటప్పకొండలో ప్రభల సంబరం**

మహాశివరాత్రి సందర్భంగా పల్నాడు జిల్లా నరసరావుపేట మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల బుధవారం కనులపండువగా జరగనుంది. దేశ నలుమూలల నుంచి పది లక్షల మందికి పైగా భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నారు. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదా కల్పించిన నేపథ్యంలో ప్రభుత్వం తరఫున స్వామికి దేవదాయ మంత్రి ఆనం పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. పోలీసు శాఖ బందోబస్తుకు ఏర్పాట్లు చేసింది. నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ నుంచి ఆర్టీసీ 550 ప్రత్యేక బస్సులను నడపనుంది. తెల్లవారుజామున 2గంటలకు బిందె తీర్థంతో స్వామికి విశేష అభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం స్వామి దర్శనం కల్పిస్తారు. అర్ధరాత్రి లింగోద్భవ అభిషేకాలు వైభవంగా జరగనున్నాయి. 19 భారీ విద్యుత్ ప్రభలు తిరునాళ్లలో కాంతులీననున్నాయి. కోటప్పకొండ దిగువన, దేవస్థాన ప్రాంగణమంతా విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు.

# రేపే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

## ప్రచార ఘట్టం పరిసమాప్తం

అమరావతి, ఏలూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరిగే రెండు పట్టభద్రులు, ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరిగే పోలింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వెబ్ కాస్టింగ్ చేస్తున్నాం. గుంటూరు-కృష్ణా, ఉభయ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు, విశాఖ-విజయనగరం, శ్రీకాకుళం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ జరగనుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో మొత్తం 6,62,100 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ రెండు పట్టభద్రుల నియోజకవర్గాల్లో 60 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొత్తం 939 పోలింగ్ కేంద్రాల్లో పట్టభద్రుల నియోజకవర్గాల్లో పోలింగ్ జరగనుంది. అదేవిధంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 10 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ నియోజకవర్గంలో 22,493 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. దీని కోసం ఉత్తరాంధ్ర జిల్లాల్లో 123 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. కొత్త జిల్లాల ప్రాతిపదికన మొత్తం 17 జిల్లాల్లో పోలింగ్ కేంద్రాలు విస్తరించి ఉన్నాయి. పోలింగ్ కోసం 8,500 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేశాం' అని వివేక్ యాదవ్ తెలిపారు.

**కూటమి అభ్యర్థులకు మద్దతు..** పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వనున్నట్లు నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్దిక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'ఆలపాటి రాజేంద్రప్రసాద్, పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్య ఓట్లు వేయాలి. ఇప్పటికే డీఎస్సీ ప్రక్రియ చేపట్టారు. రెండేళ్లుగా ఆగిపోయిన కానిస్టేబుళ్ల దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. నిరుద్యోగులు, యువతకు కూటమి ప్రభుత్వంలోనే మేలు జరుగుతుంది' అని సిద్దిక్ అన్నారు. కాగా, ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార ఘట్టం మంగళవారంతో ముగిసింది. ఎలాంటి కవ్వింపులు, దూషణలు, ఆరోపణాస్త్రాలు లేకుండా పట్టభద్రులు హుందాగా వ్యవహరించారు.

# అవినాశ్, జోగికి ముందస్తు బెయిల్



## దేశం విడిచి వెళ్లరాదని సుప్రీంకోర్టు షరతు

- బాబు నివాసం, టీడీపీ ఆఫీసుపై దాడి కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు
- విచారణకు పూర్తిగా సహకరించాలి.. లేదంటే బెయిల్ రద్దే: ధర్మాసనం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయం, సీఎం చంద్రబాబు నివాసంపై దాడి కేసుల్లో దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని వైసీపీ నేతలు దేవినేని అవినాశ్, జోగి రమేశ్ సహా నిందితులందరినీ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. విచారణ ముగిసే వరకు దర్యాప్తు అధికారికి తెలియకుండా దేశం విడిచి వెళ్లొద్దని స్పష్టం చేసింది. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి చేశారనే అభియోగంతో అవినాశ్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురామ్.. చంద్రబాబు ఇంటిపై దాడి చేసినందుకు జోగితో పాటు మరికొందరిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆ కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ వారు హైకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. ఆ తీర్పును సెప్టెంబరు 9న అవినాశ్, అప్పిరెడ్డి, తలశిల, ఒగ్గు గవాస్కర్.. సెప్టెంబరు 10న జోగి రమేశ్ సహా మరికొందరు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. దీనిపై మంగళవారం జస్టిస్ సుధాంశు ధూలియా, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్‌లూథ్రా.. అవినాశ్, జోగి తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, సిద్ధార్థ దవేతోపాటు అల్లంకి రమేష్, పి.మోహిత్‌రావు హాజరయ్యారు. తొలుత లూథ్రా వాదనలు వినిపిస్తూ.. టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌ను ధ్వంసం చేసిన ఘటనలో దేవినేని అవినాశ్ కీలక సూత్రధారి, పాత్రధారి అని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. గతంలో సుప్రీంకోర్టు మధ్యంతర రక్షణ కల్పిస్తూ.. దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని ఆదేశించిందని.. కానీ నిందితులు సహకరించడం లేదని తెలిపారు. అవినాశ్ దేశం విడిచి పారిపోయేందుకు ప్రయత్నించారని, విమానాశ్రయంలో పోలీసులు అడ్డుకోకపోతే కచ్చితంగా వెళ్లిపోయేవారన్నారు. సిబల్ ఆయనతో విభేదించారు. దేశం విడిచి పారిపోవాలని అవినాశ్ ఎప్పుడూ ప్రయత్నించలేదని.. దేశంలోనే ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్లాలని అనుకున్నారని చెప్పారు. ముందస్తు సమాచారం ఇవ్వాలని గత ఆదేశాల్లో ఉంది కదా అని ధర్మాసనం ప్రశ్నించింది. అవినాశ్ అవగాహన లోపంతోనే అలా చేశారని, వేరే దేశానికి వెళ్లిపోవాలనే ఉద్దేశం లేదని సిబల్ తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలనే పట్టించుకోని వ్యక్తి దర్యాప్తునకు సహకరిస్తాడనే నమ్మకం లేదని, అతడికి కల్పించిన మధ్యంతర రక్షణను రద్దు చేయాలని లూథ్రా కోరారు. దర్యాప్తులో భాగంగా మొబైల్ ఐఎంఈఐ నంబర్ ఇవ్వాలని ఎన్నిసార్లు అడిగినా వంశీ ఇవ్వడం లేదని తెలిపారు. అయితే.. ఐఎంఈఐ ఎవరికి గుర్తుంటుంది.. మీ నంబర్ చెప్పగలరా అని జస్టిస్ ధూలియా ప్రశ్నించారు. టీడీపీ ఆఫీసుపై దాడికి అవినాశ్ వాట్సా‌ప్‌లో ఆదేశాలు ఇచ్చారని, అవన్నీ బయటకు రావాలంటే ఆయన్ను కస్టడీలో విచారించాలని లూథ్రా కోరారు. నిందితులకు తాము తప్పు చేశామని తెలుసని, ప్రభుత్వం మారిన తర్వాత నిజం బయటికి వస్తుందనే భయంతో మూడేళ్ల తర్వాత న్యాయస్థానాన్ని ఆశ్రయించారని తెలిపారు. సిబల్ జోక్యం చేసుకుని.. రాజకీయ దురుద్దేశంతోనే మూడేళ్ల తర్వాత ఇప్పుడు అరెస్టు చేస్తామంటున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. 2021లో సాధారణ సెక్షన్లు ఉండేవని, 2024లో ప్రభుత్వం మారాక సెక్షన్ 307ను జతచేశారని, అందుకే బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు.

### మూడేళ్లు ఏం చేశారు?

ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసుపై ఎందుకింత ప్రత్యేక శ్రద్ధపెట్టారని ప్రభుత్వం తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. దాదాపు మూడేళ్లుగా దర్యాప్తు జరపకుండా ఎందుకు తాత్సారం చేశారని అడిగింది. నిందితుల్లో ప్రతిఒక్కరూ పాస్‌పోర్టులు సరెండర్ చేయాలని, దర్యాప్తు అధికారి అనుమతి లేనిదే దేశం విడిచి వెళ్లరాదని, దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని షరతులు విధించింది. అవినాశ్, జోగి సహా మొత్తం 20మందికి ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఒకవేళ షరతులను ఉల్లంఘిస్తే బెయిల్ రద్దు అవుతుందని ధర్మాసనం హెచ్చరించింది.



# సన్నగిల్లుతున్న ఆశలు!

- 96 గంటలైనా అంతుచిక్కని సిబ్బంది ఆచూకీ
- టన్నెల్‌లో పేరుకున్న బురద.. ఉబుకుతున్న ఊట

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు కాలువ(ఎస్ఎల్బీసీ) సొరంగం ప్రమాదం సంభవించి నిమిషాలు.. గంటలు.. రోజులు గడిచిపోతున్నాయి. లోపల చిక్కుకున్న ఆ ఎనిమిది మంది సిబ్బంది జాడ మాత్రం తెలియరావడం లేదు. సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నా.. కూలిన మట్టిదిబ్బలు, పేరుకుపోయిన బురదకు తోడు భారీగా ఉబికి వస్తున్న నీటితో తీవ్ర ఆటంకాలు ఏర్పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. గంటలు గడుస్తున్నకొద్దీ ఆశలు సన్నగిల్లుతున్నాయి. ప్రమాదం జరిగి.. సిబ్బంది లోపల చిక్కుకుపోయి మూడు రోజులు గడిచిపోయాయి. సహాయక చర్యలు ఫలిస్తాయని గానీ, చిక్కుకుపోయిన వారిని ప్రాణాలతో బయటకు తీసుకొచ్చే పరిస్థితులు ఉన్నాయని గానీ సహాయక బృందాలే గట్టిగా చెప్పలేని పరిస్థితి నెలకొంది. అందునా.. సిబ్బంది చిక్కుకుపోయిన చోట 40 మీటర్ల పరిధిలో మట్టి దిబ్బలు కూలే పరిస్థితులు ఏర్పడటం.. లోపల పేరుకుపోయిన మట్టిదిబ్బలను తొలగిస్తే మరో 50 మీటర్ల మేర టన్నెల్ కూలిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తుండటం మరింత కలవరపాటుకు గురిచేస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట శివారులో ఉన్న ఈ ప్రాజెక్టులో శనివారం ఉదయం సొరంగం పైకప్పు కూలిన ఘటనలో పనుల్లో ఉన్న ఇద్దరు ఇంజనీర్లు, ఇద్దరు మెషీన్ ఆపరేటర్లు, నలుగురు కార్మికులు కలిపి మొత్తం ఎనిమింది టన్నెల్ లోపల గల్లంతయ్యారు. శ్రీశైలం జలాశయం వైపు నుంచి సొరంగం మొదలై పనులు జరుగుతున్న 13.8 కి.మీ వద్ద టన్నెల్ కూలింది. అక్కడే ఈ ఎనిమిది మంది చిక్కుకుపోయారు. 13.6 కి.మీ నుంచి 13.850 కి.మీ వరకు.. దాదాపు 250 మీటర్ల మేర ఎక్కడికక్కడ మట్టిదిబ్బలు కూలిపోయాయి. 15 ఫీట్లు, 10 వేల క్యూబిక్ మీటర్లలో బురద, వ్యర్థాలు పేరుకుపోయాయి. 4వేల నుంచి 5వేల లీటర్ల దాకా నీరు ఉబికి వస్తోంది. ఇవన్నీ సహాయక చర్యలకు ప్రతిబంధకంగా మారాయి. శనివారం అర్ధరాత్రి నుంచి మంగళవారం వరకు 10 దఫాలుగా సహాయక బృందాలు లోపలికి వెళ్లినా పేరుకుపోయిన బురద, వెల్లువలా ఉబికివస్తున్న నీరు కారణంగా ముందుకు వెళ్లే పరిస్థితులు లేకపోవడంతో వెనక్కి వచ్చేశారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు వివిధ ఏజెన్సీలకు చెందిన 52 మంది సొరంగం లోపలికి వెళ్లి సాయంత్రం 5:30 గంటలకు బయటకొచ్చారు. ఆ తర్వాత మరో బృందం టన్నెల్‌లోకి వెళ్లింది. సోమవారంతో పోల్చితే కొంత ఇనుప వ్యర్థాలను పక్కకు జరిపినట్లు తెలుస్తోంది. సిబ్బంది చిక్కుకుపోయిన 13.8 కి.మీ పాయింటు నుంచి 40 మీటర్ల పరిధి వరకు ప్రదేశం చాలా సున్నితంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.



Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,**
RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.